Sri Chaitanya
NEET-LONG TERM
VAIDYAH
2027
ADMISSIONS OPEN

www.prajapaksham.in
PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

Sri Chaitanya
NEET-LONG TERM
VAIDYAH
2027
ADMISSIONS OPEN

సంపుటి 09, సంచిక: 228 | శనివారం | 18-07-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెడుతున్న అమెరికా

అమెరికా పెట్టుబడిదారీ విధానాలు, సామ్రాజ్యవాద ధోరణులు యావత్ ప్రపంచాన్ని అత్యంత భయంకరమైన ద్రవ్యోల్బణంవైపు, మరింత ప్రమాదకరమైన పర్యావరణ విరాశనంవైపు నెడుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా తిరిగి కొనసాగిస్తున్న దాడులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ఇంధన మార్కెట్లను, ఆహార భద్రతను, పేద దేశాల అభివృద్ధి అవకాశాలను నేరుగా ప్రభావితం చేస్తున్నాయి. ఆధునిక ప్రపంచీకరణ యుగంలో, ఒక ప్రాంతంలో పడే బాంబు శబ్దం వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న రైతు పొలం, కూలీ వంటిల్లు, చిన్న వ్యాపారి దుకాణంలో ప్రతిధ్వనిస్తుంది. అందుకే మధ్యప్రాచ్యంలో అమెరికా చేపట్టిన సైనిక చర్యలు కేవలం వ్యూహాత్మక నిర్ణయాలుగా కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది సాధారణ ప్రజల జీవితాలను ఖరీదైనవిగా, అస్థిరమైనవిగా మారుస్తున్నాయి. అనిశ్చితిని నింపేస్తున్నాయి. యుద్ధ ప్రభావాలు ఆయుధాలు పట్టిన దేశాలకే పరిమితం కావు. నిజానికి అసలు భారాన్ని మోసేది తుపాకీ పట్టని ప్రజలే. ముఖ్యంగా పేద దేశాలు, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు. ఇప్పటికే అప్పులు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, వాతావరణ మార్పుల ప్రభావాలతో పోరాడుతున్న సమాజాలు ఈ యుద్ధాలతో బలిపశువులుగా మారుతున్నాయి. అమెరికా తన సైనిక చర్యలను జాతీయ భద్రత, ప్రాంతీయ స్థిరత్వం లేదా ఉగ్రవాద నిరోధక చర్యలుగా సమర్థించవచ్చు. అలాగే ఇరాన్ తన భద్రత, సార్వభౌమాధికారాన్ని రక్షించుకోవాలనే వాదనను ముందుకు తీసుకురావచ్చు. కానీ ఈ వాదనల వల్ల ప్రయోజనం శూన్యం. యుద్ధం కారణంగా, చమురు ధరలు పెరగడం, రవాణా వ్యయం పెరగడం, ఎరువుల ఉత్పత్తి ఖరీదవడం, ఆహార ధరలు ఎగబాకడం, విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరగడం సర్వసాధారణం. ఈ విపరీత పరిణామాలకు దేశాల సరిహద్దులు ఉండవు. యుద్ధం ప్రారంభమైన ప్రాంతం మధ్యప్రాచ్యం అయినప్పటికీ దాని ఆర్థిక అలజడి ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ప్రపంచ చమురు సరఫరాలో అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి చుట్టూ ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారి అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు ఒక్కసారిగా ఎగసిపడతాయి. ప్రపంచంలో సముద్ర మార్గం ద్వారా తరలించే ముడి చమురులో గణనీయమైన భాగం ఈ మార్గం మీదుగానే రవాణా అవుతుంది. అక్కడ ఏ చిన్న అంతరాయం వచ్చినా అంతర్జాతీయ మార్కెట్లు భయాందోళనలకు గురవుతాయి. ముడి చమురు ధరలు పెరిగితే కేవలం పెట్రోల్, డీజిల్ ధరలే పెరగవు. విద్యుత్ ఉత్పత్తి నుంచి పరిశ్రమల వరకు, ట్రక్కుల రవాణా నుంచి విమానయాన రంగం వరకు, చేపల వేట నుంచి వ్యవసాయ యంత్రాల వరకు ప్రతి రంగంపైనా ప్రభావం పడుతుంది. చివరికి ఈ అదనపు భారం వినియోగదారుల భుజాల మీదకు బదిలీ అవుతుంది. పేద దేశాలకు ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంటుంది. చాలా దేశాలు తమ చమురు అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటున్న కారణంగా, దిగుమతుల ధరలు పెరిగితే విదేశీ మారక నిల్వలు కరిగిపోతాయి. స్థానిక కరెన్సీ విలువ తగ్గుతుంది. దిగుమతులు మరింత ఖరీదవుతాయి. ప్రభుత్వాలు సబ్సిడీలను కొనసాగించలేకపోతాయి. ఫలితంగా ఇంధన ధరలు పెరుగుతాయి.

ఇంధన ధరల పెరుగుదల మళ్లీ ప్రతి వస్తువు ధరను పెంచుతుంది. ఒక యుద్ధం ప్రపంచంలోని మరో మూలలో జరుగుతున్నప్పటికీ, దాని ఖర్చును వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న పేద కుటుంబం తన రోజువారీ ఖర్చుల రూపంలో చెల్లించాల్సి రావడం చేదు నిజం. వ్యవసాయం మీద పడే ప్రభావం మరింత ఆందోళనకరం. ఆధునిక వ్యవసాయం పూర్తిగా ఇంధనం, విద్యుత్, రసాయన ఎరువులు, రవాణా వ్యవస్థలపై ఆధారపడి ఉంది. నత్రజని ఎరువుల తయారీలో సహజ వాయువు కీలక ముడి పదార్థం. చమురు, వాయువు ధరలు పెరిగినప్పుడు ఎరువుల ఉత్పత్తి వ్యయం కూడా పెరుగుతుంది. ఆ వ్యయాన్ని రైతు భరించలేక ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తే దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంటుంది. దిగుబడులు తగ్గితే మార్కెట్లో సరఫరా తగ్గుతుంది. సరఫరా తగ్గితే ఆహార ధరలు పెరుగుతాయి. ఈ మొత్తం పరిణామాల గొలుసు చివరలో ఆకలితో పోరాడేది పేద వినియోగదారులే. ఇప్పటికే ప్రపంచం వాతావరణ మార్పులు, కరువు, వరదలు, అంటువ్యాధులు, సరఫరా గొలుసు అంతరాయాల వంటి సమస్యలను ఎదుర్కొంటోంది. ఇప్పటికే అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల వద్ద భారీ అప్పులతో నిలిచాయి. యుద్ధాల వల్ల ఏర్పడే ఇంధన ధరల పెరుగుదల ఆ అప్పుల భారం మరింత పెంచుతుంది. అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన వనరులు అప్పుల చెల్లింపులు, ఇంధన దిగుమతులకు మళ్లిపోతాయి. ఈ పరిణామాలను పరిశీలిస్తే ప్రపంచ రాజకీయాల్లో ఉన్న అసమానత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. శక్తివంతమైన దేశాలు తమ వ్యూహాత్మక ప్రయోజనాల కోసం సైనిక చర్యలు చేపడతాయి. కానీ వాటి ఆర్థిక దుష్పరిణామాలను మాత్రం యుద్ధంలో పాల్గొనని దేశాలే భరించాల్సిన దుస్థితి. ఈ పరిస్థితుల్లో యుద్ధాలు లేని ప్రపంచాన్ని అత్యధిక జనాభా కోరుకుంటున్నారు.


ప్రపంచ శాంతి అనేది కేవలం యుద్ధం లేకపోవడం మాత్రమే కాదు. ప్రజలకు అందుబాటు ధరల్లో ఆహారం, ఇంధనం, ఉపాధి, జీవన భద్రత ఉండే పరిస్థితిని సృష్టించడం కూడా అంతే ముఖ్యమైనది. అంతర్జాతీయ సంబంధాలు పరస్పర గౌరవం, చర్చలు, దౌత్య పరిష్కారాల ఆధారంగా ముందుకు సాగితేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంటుంది. సైనిక చర్యలు మొదటి పరిష్కారం కారాదు.. అది ముమ్మాటికీ చివరి ప్రత్యామ్నాయంగానే ఉండాలి. ముఖ్యంగా చమురు రవాణా, సముద్ర వాణిజ్యం, ప్రపంచ సరఫరా గొలుసులను ప్రమాదంలోకి నెట్టే చర్యలు మొత్తం మానవాళిపై ప్రభావం చూపుతాయని ప్రపంచ శక్తులు గుర్తించాలి. యుద్ధాన్ని ఎవరుగెలిచినా, కానీ ద్రవ్యోల్బణం, ఆకలి, నిరుద్యోగం, అభివృద్ధి మందగమనం వంటి పరిణామాల్లో ఓడిపోయేది మాత్రం ప్రపంచంలోని పేద ప్రజలే. అందుకే ప్రపంచ రాజకీయాలు ఆయుధాల శక్తికంటే మానవ సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. శక్తి ప్రదర్శన కంటే శాంతి, సహకారం, ఆర్థిక న్యాయం, అంతర్జాతీయ బాధ్యత అనే విలువలే మానవాళిని భవిష్యత్తు సంక్షోభాల నుంచి కాపాడతాయి.



## జులై 21 లోగా పార్టీని వీడండి

**పార్టీని వీడాలనుకునేవారు జులై 21న జరిగే అమరవీరుల దినోత్సవ ర్యాలీకి ముందే వెళ్లిపోవాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణకు భయపడి బిజెపికి మద్దతు ఇవ్వాలనుకునేవారు, పార్టీకి ద్రోహం చేయకుండా ఇప్పుడే పార్టీని వీడవచ్చు. 1997లో నేను కాంగ్రెస్ నుంచి విడిపోయి ఏ విధంగానైతే తృణమూల్ కాంగ్రెస్‌ను నిర్మించానో.. అలాగే ఇప్పుడు కూడా పార్టీని బలంగా పునర్నిర్మిస్తాను.**

– తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ




## అసమానతలపై పిడికిలి బిగించాల్సిందే..

దక్షిణ ఆఫ్రికా జాతి వివక్ష వ్యతిరేక పోరాటయోధుడు, న్యాయవాది, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఎఎన్‌సి) నాయకుడు, దానశీలి, ప్రజా సేవకుడు, ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వంలో తొలి నల్లజాతి దేశాధ్యక్షుడు(1994–99), 27ఏండ్లపాటు జైలు జీవితం అనుభవించిన అవిశ్రాంత నల్లజాతి ప్రతినిధి అయిన నెల్సన్ మండేలా పుట్టిన రోజు (18, జులై 1918) సందర్భంగా ఐరాస చొరవతో ప్రతి ఏట 18 జులై రోజున అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం లేదా ఇంటర్నేషనల్ డే ఆఫ్ నెల్సన్ మండేలాను పాటించడం 18 జులై 2010 నుంచి ప్రారంభం అయ్యింది. దక్షిణ ఆఫ్రికాలోని మ్వోజో గ్రామంలోని తెంబూ రాయల్ కుటుంబంలో జన్మించిన మండేలా వంశంలో తొలి విద్యావేత్తగా పోర్ట్‌హేర్, విట్‌వాటర్స్రాండ్ యూనివర్సిటీల్లో బిఏ, న్యాయ పట్టాలు పొంది ఉన్నత విద్యావేత్తగా పేరు తెచ్చుకొని, లాయర్‌లా పని చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు తన పేరు ముందు నెల్సన్‌ను చేర్చడంతో నెల్సన్ మండేలా అనే పేరు ఖ్యాతిలోకి వచ్చింది. అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం–2026 ఇతివృత్తంగా పేదరికం, అసమానతల నిర్మూలన ఇప్పటికీ మన చేతుల్లోనే ఉన్నది అనే అంశాన్ని ఎంపిక చేశారు.

**ఉద్యమాలే ఊపిరిగా సాగిన జీవితం:** 1943లో వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాలు ప్రారంభించిన మండేలా ఏఎన్‌సి పార్టీలో చేరి శ్వేతజాతి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభిం చారు. వర్ణ వివక్ష పోరాటంలో చురుకుగా పాల్గొనడంతో అరెస్టు కూడా అయ్యారు. ఇదే క్రమంలో మార్క్సిజం వైపు ఆకర్షితులై దక్షిణ ఆఫ్రికా కమ్యూనిస్టు పార్టీలో చేరి రహస్యంగా ఉద్యమాలు చేశారు. శాంతియుతంగా పోరాటం చేస్తూ ఉమ్కోంటో వీ స్విజ్వే అనే తీవ్రవాద సంస్థను స్థాపించారు. నాటి శ్వేతజాతి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ, 12 జూన్ 1963రోజున యావజ్జీవ కారాగార శిక్షను విధించడంతో 27 ఏండ్లపాటు సుదీర్ఘ జైలు జీవితం అనుభవిస్తూ అంతర్జాతీయ మానవాళి దృష్టిని ఆకర్షించారు. జాతీయ, అంతర్జాతీయ ఒత్తిడులకు లొంగిన నాటి ప్రభుత్వం 11, ఫిబ్రవరి 1990న విడుదల చేసింది. జైలులో 466 గదిలో బంధించబడి 63 (1963)లో విడుదల కావడంతో 46663ని మండేలా సంఖ్యగా పిలుస్తారు.

1994లో నిర్వహించిన ఎన్నికల్లో ఏఎన్‌సి పార్టీ నేతృత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో నల్లజాతికి చెందిన తొలి అధ్యక్షుడిగా సేవలు అందించారు.

**ఏ లాంగ్ వాక్ టు ఫ్రీడం – మండేలా జీవితం:** అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం సందర్భంగా పేదరిక నిర్మూలన కేంద్రంగా అన్నదాన కార్యక్రమాలు, వృద్ధుల పట్ల ఆదరణ, యువతకు ప్రేరణాత్మక కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవలు, పరిసరాల పరిశుభ్రత లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. అందరికీ అందుబాటులో విద్య లాంటి కనీస అంశాలకు అంకితభావంతో సేవలు అందించిన నల్లజాతి వెలుగుల సూరీడు మండేలా నేటి యువతకు నిత్య ప్రేరణగా నిలుస్తూ, భవిష్యత్తుకు దారులు చూపే దారి దీపం అవుతున్నారు. 'ఏ లాంగ్ వాక్ టు ఫ్రీడం' అనబడే పేరుతో ఆత్మకథను రాసిన మండేలాను దక్షిణ ఆఫ్రికా గాంధీగా పిలవడం సముచితంగా వుంది. మండేలా 67 ఏండ్ల జీవితాన్ని ప్రేరణగా తీసుకొని 67 నిమిషాలు ప్రజాహిత సేవలో అందరం గడిపి ఆయనకు అసలైన నివాళి అర్పించాలి. ప్రతిష్ఠాత్మక 'మడిబా' అనే బిరుదును పొందిన మండేలా 05, డిసెంబర్ 2013 న తుది శ్వాస విడిచారు.

**(18 జులై అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం సందర్భంగా)**

# 'సర్' ప్రక్రియకు పారదర్శకత అవసరం

రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రతిష్ఠాత్మకంగా కొనసాగుతుంది. మొత్తం ఓటర్లలో 99.99%పైగా ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశామని ఎన్నికల అధికారులు తెలుపుతున్నారు. కానీ అందజేసింది బిఎల్ఓ లకు. బిఎల్ఓ లు ఇల్లిల్లు తిరిగి ఓటర్స్‌కు అందజేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు బిఎల్ఓ లు అందజేసే కార్యక్రమం నత్తనడకలోనే సాగుతుంది.

ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ద్వారా ప్రజలు సాధించుకున్న అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు. ఐదేండ్లకు ఒకసారి ప్రభుత్వాలను ఏర్పాటు చేసే శక్తి, అధికారాన్ని ప్రశ్నించే హక్కు, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరించిన పాలకులకు శిక్షించే అధికారం, ప్రజల తీర్పును ప్రకటించే సాధనం ఓటు. అలాంటి ఓటు హక్కుకు ఆధారమైన ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ జరగాలి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే సర్ ప్రక్రియ కంటే గందరగోళమే ఎక్కువగా కనిపిస్తుంది. ప్రజలను ఒక ప్రశ్న వేధిస్తుంది. 'నా పేరు ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉంది. మరి నేను మళ్ళీ ఏం చేయాలి?' ఈ ప్రశ్నకు ప్రతి ప్రాంతంలో ఒకే సమాధానం లేదు. తిరిగి సర్ ద్వారా తాను ఓటరునే అని నిరూపించుకోవాలని ఎలక్షన్ కమిషన్ చెబుతుంది. భారత ఎన్నికల కమిషన్ పైనే ప్రతి వ్యక్తికి ఓటు కల్పించాల్సిన బాధ్యత వారిపై ఉన్నది. ప్రస్తుతము జరుగుతున్నది ఓటర్లను తికమక పెట్టే విధంగా ఉన్నది!

ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ –మల్కాజ్గిరి జిల్లాలకు చెందిన ఓటర్లు ఓటేయడం లోనూ, ఓటును కాపాడుకోవటంలోను వెనుకబడి ఉన్నారని జనరల్‌గా వస్తున్న విమర్శలు.. ఎందుకంటే గత ఎన్నికల్లో ఈ జిల్లాలలో పోలింగ్ సరళి పరిశీలిస్తే మనకు ఇదే అర్థమవుతుంది. ఈ జిల్లాలో వలస ఓటర్లు, వారికి గ్రామాలలో ఓట్లు ఉండటం, ఓటర్స్ శాశ్వత నివాసం లేకపోవడం మొదలకు కారణాలు ఉన్నాయి.

**ఆగస్టు 3 వరకు గడువు పెంచిన కమిషన్!**

ఆంధ్రప్రదేశ్‌లో 14 రోజులపాటు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పొడిగించిన నేపథ్యంలో, తెలంగాణలో కూడా కనీసం 10 రోజులు పొడిగించాల ని అన్ని పార్టీలు డిమాండ్ చేశాయి. అయితే ఎన్నికల కమిషన్ ఆగస్టు 3 వరకు ఎన్యూమరేషన్ల ఫారాల సేకరణకు గడువు పెంచింది. బిఎల్ఓ లు ఫారాలు అందజేయవలసిన బాధ్యత ఉన్నది. జులై 15 వరకు 1,66, 70,610 మంది ఓటర్లు మాత్రమే(49.27%) తమ ఫారాలను అందజేశారు. దీంతో మరో 50% మంది ఓటర్లు పది రోజుల్లో ఇవ్వడం సాధ్యమేనా? ఇది ఇలాఉండగా 35 శాతం మందికి( నగరాలలో, పట్టణాలలో)ఫారాలు అందలేదని చెబుతున్నారు. గ్రామాలలో 80 నుండి 85 శాతం వరకు ఫారాలు అందజేసినారు. బిఎల్ఓ లు అందజేసిన ఫారాలలో వారి వద్దకు చేరినవి సగం మాత్రమే. ఇంకా కొంత టైం ఉన్నందున అందరికి అందజేయాలి.

అధికారులు 100% పంపిణీ అని చెప్తుంటే నగర, పట్టణ ప్రాంతాల ఓటర్లు మాత్రం మా కాలనీలకు, మా ఇండ్లకు అసలు బిఎల్వోలు వచ్చిన దాఖలాలే లేవు.. మాకు అందాల్సిన ఎన్యూమరేషన్ ఫామ్స్‌లు ఎటుపోయాయి? అంటూ నిలదీస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ దాని చుట్టు పక్కల ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, శివారు కాలనీల్లో చాలామందికి ఫామ్స్ అందలేదు. అధికారులు ఇండ్ల వద్దకు వచ్చి వివరాలు సేకరించకుండానే ఆఫీసుల్లో కూర్చుని ఫామ్ పంపిణీ అయిపోయినట్టు టిక్ మార్కులు పెట్టుకుంటున్నారని ఆరోపణలు వింటున్నాం.

**నత్త నడకన సర్ డిజిటలైజేషన్ :**

కేంద్ర ఎన్నికలసంఘం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్ ప్రక్రియ రాష్ట్రంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీలోను.. డిజిటలైజేషన్ లోను నత్త నడకలో సాగుతున్నది. రాష్ట్రంలో 3.38 కోట్లకు పైగా ఓటర్లలో 50 శాతమే ఆన్లైన్ అయినవి. 75.44% యాదాద్రి టాప్‌లో ఉంది. 13.71% తో మల్కాజ్గిరి లాస్ట్ ఉన్నదని సిఇఒ కార్యాలయం నివేదిక.

సర్ నిబంధనల ప్రకారం బూత్ లెవెల్ ఆఫీసర్లు (బిఎల్ఓలు) మూడుసార్లు ఓటర్ల ఇండ్లకు వెళ్లాలని ప్రాథమిక నియమం. నగరాలు, పట్టణాల్లో అది అమలవుతున్న ప్రాంతాలను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతుందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెబుతోంది. బిఎల్వోలు ఒక కాలనీ కమ్యూనిటీ హాల్లో కూర్చుని అందుబాటులో ఉన్న వారికి ఫారాలిస్తున్నారు. లేదా ఆ కాలనీ బాధ్యులకు ఇచ్చిఅందజేయాలని కోరుతున్నారు. పూర్తి చేసిన ఫారాలుకూడా ఓటర్లే మళ్లీ బిఎల్ వో వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితి చాలా చోట్ల ఉంది. సర్ ప్రక్రియలో ప్రాథమిక అడుగే సరిగా పడలేదని దీన్ని బట్టి తేలికగానే అర్థం అవుతుంది. అయినా మన యంత్రాంగం సమర్థత బ్రహ్మాండంగా ఉందని మనం సరిపెట్టుకోవా లి.

**అదే ప్రమాణికం ఎట్లవుతది?**

తెలంగాణలో 2002లో చేపట్టిన సర్ తర్వాత ఏడు సార్లు ఎన్నికలు



జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటు వేసిన వారందరూ కూడా ఇప్పుడు మళ్లీ తమని తామే నిఖార్సయిన ఓటర్లు గా నిరూపించుకోవాలి. ఇంటర్నెట్ ను ఉపయోగించగలిగిన వాళ్ళు కూడా 2002 నాటి సర్ జాబితాలో తమ పేర్లు వెతుక్కోవటానికి కింద మీద పడుతున్నారు. గంటలపాటు దాని కోసం ప్రయత్నించి విఫలమై చివరకు 2002 నాటి సర్‌లో తమ పేర్లు లేవని వెలుసుబాటును ఉపయోగించుకొని ఎన్యూమరేషన్ ఫామ్ ఆన్లైన్లో పూర్తి చేస్తున్నారు. దీనికి ఫోన్ నెంబరు, ఆధార్ కార్డు వివరాలను సమర్పించి వాటి ఆధారంగా వచ్చే ఒటిపిలతో వన్ టైం పాస్‌వర్డ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. 2002 నాటి సర్ జాబితాతో సంబంధం లేకుండానే ఓటర్ గా కొనసాగే అవకాశం ఉంటే అసలు దాంతో మొత్తం ప్రక్రియను ఎందుకు ముడి పెట్టాల్సి వచ్చిందనే ప్రశ్న తలెత్తక మానదు. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటి మంది 11 రకాల డాక్యుమెంట్లతో ఏదో ఒక దాన్ని సమర్పించి తమని తాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలని నిబంధనలు రూపొందించటం ఎంతవరకు కరెక్టు..2002 నాటి ఓటర్ల చేర్పు మామూలుగానే జరిగిపోయింది..ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడు సర్ సంబంధిత ప్రత్యేక హడావుడి కనబడలేదు. మామూలు ఓటర్ల జాబితా సవరణ లాగే అది జరిగి పోయింది. దీనికి భిన్నంగా ఇటీవల బిహార్, బెంగాల్, తమిళనాడులో తగిన సమయం ఓటర్లకు ఇవ్వకుండా హడావిడిగా సర్ చేపట్టడంతోనే తీవ్రస్థాయిలో వివాదాలు చెలరేగాయి. లక్షల సంఖ్యలో ఓట్లను తొలగించారు. ఈ విధానాన్ని రాజకీయ పార్టీలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి.

ఇప్పుడే బిఎల్ఓ లు ఇంటింటికి వెళ్లలేని పరిస్థితి ఉంటే.. 2002లో సర్ అంత సక్రమని భావించి దాన్ని ప్రామాణికంగా తీసుకోవడం ఏ మాత్రం సహేతుకంగా అనిపించదు. అప్పటికి మొబైల్ ఫోన్లు లేవు, ల్యాండ్ లైన్‌ఫోన్ ఉన్న వాళ్ళు తక్కువే, సోషల్ మీడియా లేనేలేదు. 2002 నాటి పరిస్థితుల్లో సర్ కు చాలా పరిమితులు ఉంటాయి.

పేర్లలో, ఇంటి పేర్లలో, వయస్సు నమోదులు ఎన్నో తప్పులు ఆనాటి జాబితాలో కనబడతాయి. వీటన్నింటినీ సర్దిద్దుకోవాల్సిన బాధ్యతను ఇప్పుడు ఓటర్ల పైనే పెట్టారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయడం రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ విధి. అలా నమోదు చేసిన వాళ్లను కొన్నేళ్ల తర్వాత 'మిమ్మల్ని మీరు ఓటర్లుగా నిరూపించుకోండి' అని చివరికి అదే కమీషన్ ఆదేశించటం ప్రజాప్రతినిధి చట్టాన్ని పలుచన చేయటమేనని ఇప్పటికే ఎన్నో విమర్శలు వచ్చాయి.

**ఫారం ఇస్తేనే ఓటు హక్కు– సిఇఒ వెల్లడి :**

పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్‌ఓలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని, లేదంటే ఓటును తొలగించాల్సి వస్తుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్ఓలకు అందజేయాలని ఆయన ఒక ప్రకటనలో సూచించారు.

**రాష్ట్రవ్యాప్తంగా 88 లక్షల ఓట్లు గల్లంతు!**

ఓటరు జాబితా సమగ్ర సవరణ సర్ ప్రక్రియ జరుగుతుండగానే తాజాగా రాష్ట్ర ఎన్నికల అధికారులు రాష్ట్రవ్యాప్తంగా 88 లక్షల ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఆ ఓట్లలో సగం రాజధానివే అని గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. బిఎల్ఓ లు సరిగా ఫారాలు పంపిణీ చేయకపోవడం, అందుకున్న ఓటర్లు నింపకపోవడం వంటి కారణాలతో ఓట్లు గల్లంతు అవుతాయని ఎన్నికల అధికారులు చెప్తున్నారు.

**జిహెచ్ఎంసి పరిధిలో భారీగా ఓట్లు రద్దు**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని అధికంగా ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉంది. అయితే ఒక్కొక్క జిల్లా నుంచి 8 లక్ష ల నుంచి 12 లక్షల మేర ఓట్లు రద్దు అవుతాయని తెలుస్తుంది. ఈ జిల్లా లో ఓటరు గుర్తింపు కార్డులు ఒకటికి మించి ఉన్నాయని తేలింది.ఈ సంఖ్య పెద్ద ఎత్తున ఉండటంతో ఓటరు జాబితాలో తేడా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

**రెండు చోట్ల ఓటు ఉంటే?**

గతంలో ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాలు లేదా ఇతర రాష్ట్రాల్లో ఓటరుగా నమోదైన వారు ఒకేచోట తమ ఓటును నమోదు చేసుకోవాలి. జిల్లాలు, రాష్ట్రాల వ్యాప్తంగా నకిలీ ఓటరు నమోదులను గుర్తించడానికి ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్ (డిఎస్ఇ) సాఫ్ట్‌వేర్‌ను ప్రయోగిస్తుంది. నకిలీ నమోదులను గుర్తించిన తర్వాత అధికారులు విచారణ జరిపి, నోటీసులు జారీ చేసి తమ ఓటును నిలుపుకోవాలనుకుంటున్న నియోజకవర్గాన్ని ఎంచుకోమని ఓటర్లను అడుగుతారు. ఆ తరువాత ఇతర ప్రాంతాల నుంచి ఓటును తొలగిస్తారు.

**కొత్త ఓటర్ కు ఫారం 6...**

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 18 సంవత్సరాలు నిండి ఓటర్లుగా నమోదు కాని వారికి ఫామ్ అందదు. దానికి బదులుగా వారు కొత్తగా ఓటరు నమోదు కోసం ఉద్దేశించిన ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. చిరునామా మారితే ఓటరు బదిలి చేయడానికి ఉద్దేశించిన 8 ఫారం ఉపయోగించి దరఖాస్తు చేసుకోవాలి. రాష్ట్రంలో ప్రస్తుతం ఓటర్లుగా నమోదై ఉన్నవారు శ్రమ కోర్చయినా ఫారాలు పొంది వాటిని బిఎల్ వో లకు అందచేసి ఓటు హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నది.. లేకుంటే ఓట్లు గల్లంతు.. ఉనికి ప్రశ్నార్థకం!

**ఉజ్జిని రత్నాకర్ రావు,** 9490952646

# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అసమ్మతి సెగ

పాకిస్థాన్ అధికార నియంత్రణలోని కశ్మీర్ మరోసారి దక్షిణాసియాలో రాజకీయంగా అత్యంత కల్లోల ప్రాంతంగా ఆవిర్భవించింది. విపరీతంగా పెరుగుతున్న విద్యుత్ బిల్లులు, ద్రవ్యోల్బణంపై, పరిపాలన తీరుపై బయలుదేరిన నిరసన విస్తృతమైన రాజకీయ ఉద్యమంగా రూపొందింది. ఇస్లామాబాద్‌కు ''ఆజాద్ జమ్మూ అండ్ కశ్మీర్'' గా తాము పిలుచుకునే భూభాగానికి మధ్య ఉన్న సంబంధాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జెఎఎసి) 38కోర్కెలతో ఇస్లామాబాద్‌కు జారీచేసిన 48గంటల అల్టిమేటం తాజా సంఘర్షణకు హేతువైంది. జులై 27న జరగనున్న ప్రాంతీయ ఎన్నికలకు ముందు ఇది ''మహత్తరమైన, అంతిమ'' పోరాటంగా ఆ ఉద్యమం హెచ్చరించింది. ఇది అనేక సంవత్సరాల్లో తొలిసారి స్థానిక నివాసితులకు, పాకిస్థాన్ ఫెడరల్ ప్రభుత్వానికి మధ్య అతి పెద్ద సంఘర్షణకు రంగం ఏర్పాటు చేసింది.

ఈ నిరసనలు ఎన్నికల రాజకీయాలకన్నా మిన్న. రాజ్యాంగ పరిమితులు, ఆర్థిక సాధకబాధకాలు, రాజకీయ ప్రాతినిధ్యం, పుష్కలంగా ఉన్న ప్రాంతీయ ప్రకృతి వనరుల పంపిణీ సమస్యలపై దశాబ్దాలుగా పేరుకుపోయిన నిరాశానిస్పృహను అది బహిర్గతం చేస్తున్నది. వివాదానికి తక్షణ ప్రేరణ – దేశ విభజన తర్వాత జమ్మూ–కశ్మీర్ నుంచి పాకిస్థాన్‌కు వలసవచ్చిన కాందిశీకులకు రిజర్వు చేసిన 12 శాసనసభ సీట్లు. ఈ ఏర్పాటు ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని వక్రీకరిస్తుందని జెఎఎసి వాదిస్తున్నది. పాకిస్థాన్ నియంత్రణలోని కశ్మీర్‌లో రమారమీ 33 లక్షలమంది నివసిస్తున్నారు. వారు 33మంది భౌగోళిక నియోజకవర్గ ప్రతినిధులను ఎన్నుకుంటారు. కాగా పాకిస్థాన్‌లో రిజిస్టర్ అయిన 4.36లక్షల మంది కాందిశీక ఓటర్లు 12మంది శాసనసభకు ఎన్నుకుంటా రు. ఇది తమ ప్రాంత రాజకీయాల్లో ఇస్లామాబాద్ పలుకుబడిని మీదుమిక్కిలి పెంచుతుందని ఉద్యమకారులు వాదిస్తున్నారు. ఈ (12) సీట్ల కు రాజ్యాంగ రక్షణ ఉందని, వాటిని అడ్మినిస్ట్రేటివ్ ఉత్తర్వుద్వారా రద్దు చేయటం సాధ్యం కాదని, సంస్కరణకు రాజ్యాంగ సవరణ ఒక్కటే మార్గమని పాకిస్థాన్ నియంత్రిత కశ్మీర్ సుప్రీంకోర్టు ఇటీవల రూలింగ్ ఇచ్చింది.

జెఎఎసికి సంబంధించి, ఇది పెద్ద ఫిర్యాదుకు సంకేతప్రాయ సమస్య అయింది. అది, తమ భౌగోళిక ప్రాంతాన్ని ప్రభావితం చేసిన కీలకమైన రాజకీయ నిర్ణయాలను ఈ ప్రాంతం వెలుపల తీసుకోబడుతున్నాయనే ఫిర్యాదు. జెఎఎసి సాపేక్షికంగా కొత్త సంస్థ–'' 2023 లో ఏర్పడింది. అయితే అది అత్యంత ప్రభావవంతమైన పౌర సమాజ వేదికగా శీఘ్రంగా పరివర్తన చెందింది. ప్రారంభంలో దాని కోర్కెలు – స్థానిక జలవిద్యుత్ ప్రాజెక్టులు ఉత్పత్తి చేస్తున్న విద్యుచ్ఛక్తి సబ్సిడీ రేటుకు సరఫరా చేయాలి, గోధుమల ధర తగ్గింపు, ద్రవ్యోల్బణం నుంచి ఉపశమనం. అది పెద్ద ఎత్తున సాగించిన ప్రదర్శనలు ఇస్లామాబాద్ నుంచి రాయితీలు రాబట్టింది. దాంతో సాధారణ ప్రజల్లో ఉద్యమం విశ్వసనీయత పొందింది.



తాజా 38 అంశాల కోర్కెల పత్రం గణనీయంగా ముందుకు వెళ్లింది. ఇతోధిక రాజకీయ స్వయంప్రతిపత్తి, రాజ్యాంగ సంస్కరణలు, ప్రకృతివనరులపై స్థానిక నియంత్రణ పెంపుదల, ఎన్నికల సంస్కరణలు, పరిపాలనలో జవాబుదారీతనం వాటిలో ఉన్నాయి. దీర్ఘకాలంగా ఉన్న రాజకీయ అసంతృప్తి, నిరాశలకు ఆర్థిక ఫిర్యాదులు తోడు కావటం ఉద్యమానికి ప్రజాదరణను పెంచినట్లు సూచిస్తున్నది.

పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని ''ఆజాద్'' లేదా ''స్వేచ్ఛాయుత'' కశ్మీర్‌గా అభివర్ణిస్తుంది. అయినా దానికున్న రాజ్యాంగ ప్రతిపత్తి అసాధారణంగా ఉంటుంది. పాకిస్తాన్‌లోని రాష్ట్రాలవలె తమ నియంత్రణలోని కశ్మీర్‌ను రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 ప్రకారం పాకిస్థాన్‌లో అధికారికంగా కలుపుకోలేదు. పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ లేదా సెనెట్‌లో దానికి ప్రాతినిధ్యం లేదు. అది దాని సొంత రాజ్యాంగ చట్రంలో పనిచేస్తుంది. అయితే రక్షణ, విదేశీ వ్యవహారాలు, పరిపాలనలో ప్రాముఖ్యతగల అంశాలు ఇస్లామాబాద్‌లో సంధానించబడిన సంస్థల కింద ఉంటాయి. మరో వివాదాస్పద నిబంధన ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఈ భౌగోళిక ప్రాంతం అంతిమంగా పాకిస్థాన్‌లో చేరేందుకు సమ్మతి తెలియజేయాలి. ఇది కశ్మీర్ వివాదంపై తన వైఖరిని ప్రతిబింబిస్తుందని పాకిస్థాన్ చెబుతుండగా, స్వాతంత్ర్యాన్ని, లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రతిపాదించేవారు ఇది చాలా సంకుచితమైన రాజకీయ జాగా అని వాదిస్తున్నారు.

ప్రజాస్వామిక క్రమాలను పద్ధతి ప్రకారం తారుమారు చేస్తున్నట్లు తమపై వస్తున్న ఆరోపణలను పాకిస్థాన్ తిరస్కరిస్తోంది. నిరసన ఉద్యమాలు తరచూ పెల్లుబకటానికి ప్రధాన కారణం స్థానిక సంస్థలకు పరిమిత స్వయం ప్రతిపత్తి మాత్రమే ఉందని స్థానిక ప్రజల్లో బలంగా ఉన్న భావన. ఆర్థిక సమస్యలపై ఇప్పుడున్నంత ఆగ్రహం మరోచోట కనిపించదు.

భారతదేశ భూభాగంగా ఉన్న జమ్మూ–కశ్మీర్ నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను వేరేచేసే వాస్తవాధీన రేఖ వెంట పాకిస్థాన్ పరిపాలనలోని కశ్మీర్ సున్నితమైన స్థానం కలిగి ఉంది. చారిత్రకంగా పాకిస్థానీ సైన్యం, భద్రత ఏజెన్సీల ఉనికి గణనీయంగా ఉంటుంది. రెండు ప్రాంతాల్లోనూ మానవహక్కుల ఉల్లంఘనలపై అంతర్జాతీయ మానవహక్కుల సంఘాలు దఫదఫాలుగా ఆందోళన వ్యక్తం చేస్తుంటాయి. భారత రాజ్యాంగం వైఖరిలో స్వాతంత్ర్యం నాటి నుంచీ ఎట్టి మార్పు లేదు. జమ్మూ అండ్ కశ్మీర్ సంస్థానం మొత్తాన్ని అనగా పాకిస్థాన్ నియంత్రణలో ఉన్న భాగం సహా భారత దేశంలో అంతర్భాగంగా న్యూఢిల్లీ పరిగణిస్తున్నది. భారత పార్లమెంటు 1994లో ఆమోదించిన తీర్మానంలో ఈ వైఖరిని ఏకగ్రీవంగా సుస్పష్టం చేసింది.బిజెపి అధికారంలోకి వచ్చాక, పాకిస్థాన్ నియంత్రిత కశ్మీర్ అంతిమంగా భారత పరిపాలన కిందకు తిరిగి వస్తుందని దాని నాయకులు పదేపదే వక్కాణిస్తు న్నారు.

**టి.ఎన్.అశోక్**

(ఐపిఎ న్యూస్ ఎనాలిసిస్ సౌజన్యంతో)

# NEET 2026 Results

శ్రీచైతన్య మైక్రో షెడ్యూల్స్...
క్లిష్టతరమైన ఫిజిక్స్, కెమిస్ట్రీలపై
తిరుగులేని పట్టు!
పక్కా ప్రణాళికతో NEET
2026లో ర్యాంకుల ప్రభంజనం
సృష్టించిన ఏకైక సంస్థ శ్రీచైతన్య!

## వేలాది ర్యాంకులతో విద్యార్థులను గెలిపించిన హైదరాబాద్ శ్రీచైతన్య



NEET 2026 టాప్ ర్యాంకులు సాధించిన తమ విద్యార్థులతో అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ బొప్పన, శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సీమ బొప్పన

## ఆలిండియా ఆల్ కేటగిరీల్లో టాప్ 10 లోపు ర్యాంకులు

- 2 RANK — RANVEER KUMAR, APPL.NO: 260410035204 (Gen-Ews) (DLP)
- 2 RANK — తెలంగాణ విద్యార్థి — PORIKA SUNNY, APPL.NO: 260410688632 (ST)
- ALL INDIA 3 RANK — UPLAKSHYA GOYAL (DLP), Appl No: 260410040821
- ALL INDIA 3 RANK — KETHAVATH PRANITH (ST), Appl No: 260410224962
- 5 RANK — ఆంధ్రప్రదేశ్ విద్యార్థి — BURA SAI SHARAN, Appl No: 260410265143
- 6 RANK — తెలంగాణ విద్యార్థి — K HANEESH, Appl No: 260410276126 (OBC-NCL)
- 9 RANK — GAURAV SINGH, Appl No: 260410079810 (DLP)

## ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1000 లోపు 85 ర్యాంకులు

| RANK | NAME | APP. NO. |
|---|---|---|
| 103 | K HARIKA DEVI SRI ANUHYA | 260410287893 |
| 108 | PRIYANSHU LAMBA | 260410653073(DLP) |
| 118 | ABHIRAM M | 260410873752 |
| 123 | D SHREEGOPAL AGRAWAL | 260410037261 |
| 126 | VADDEPALLI DUSHYANT | 260410770172 |
| 156 | K V MAHANT AKSHAJ REDDY | 260410218503 |
| 158 | MAMIDI CHAITANYA | 260410474980 |
| 159 | UNNATHI JONNALA | 260410253585 |
| 167 | RAGHURAM M | 260410875192 |
| 184 | SPARS GARG | 260410011215(DLP) |
| 214 | HARSH SINGH | 260410003723(DLP) |
| 223 | VANNALI SIRI CHANDANA | 260410856184 |
| 239 | THALARI SAAI KATHIK | 260410229656 |
| 244 | H VENKATESH SHOLAPURKAR | 260411356794 |
| 259 | SAFIYASH | 260410954332(DLP) |
| 271 | SAI JITESH GOLLA | 260410938692 |
| 276 | AYUSH PRASAD | 260410471726 |
| 277 | T AJAY GOUD | 260410984359 |
| 282 | KAMIREDDY GNANA VENKAT | 260411027168 |
| 283 | GORRELA SAMPATH DIKSHIT | 260410393054 |
| 287 | SELVANITHIESH N | 260410118301 |
| 291 | K S DHEVESH KARTHIK | 260410350590 |
| 292 | M VENKATA NAGASAI RUPAK | 260410293252 |
| 352 | SEELAVALASA UTTAMRAMSAI | 260410295190 |
| 359 | ATYAM SAKET | 260410297514 |
| 368 | AVANEESH C CHINIWAL | 260410168350 |
| 393 | SUDHARSAN MS | 260410847664 |
| 406 | YERRA ABHIGNA SREENIDHI | 260410448865 |
| 416 | DURGA BS | 260410077099(DLP) |
| 423 | JAVVAJI SIVA NISHANTH | 260410852525 |
| 436 | LIKHITH P GOWDA | 260410864203 |
| 472 | SAGAN J S | 260410735807 |
| 494 | PORIKA SUNNY | 260410688632 |
| 513 | SHAIK MOHAMMAD REHAN | 260410449604 |
| 521 | SRIKRISHNA S | 260410517939 |
| 533 | PAILLA REVANTH REDDY | 260410449523 |
| 549 | M MARUTHI SATYA SRIKAR | 260410805228 |
| 596 | HEMATEJ JANGAM | 260410425523 |
| 599 | N SASHIVADAN REDDY | 260410783943 |
| 610 | KETHAVATH PRANITH | 260410224962 |
| 621 | SAHITI GEETIKA GUNITHI | 260410461348 |
| 624 | SAMBANGI JASWANTH NAIDU | 260410378440 |
| 625 | VENUTHURLA JANVITHA | 260410331110 |
| 639 | GUDEPU KRISHNA ADVIKA | 260410366840 |
| 645 | VARSHITA SRI SAI VEMULAPALLI | 260410908906 |
| 658 | PERIKETI ANURAAG | 260410303523 |
| 663 | S M NOOR UL HASSAN | 260410299940 |
| 694 | KAPADIA DARSHIL VIMAL | 260410131865(DLP) |
| 711 | GODA ADITYA | 260410491232 |
| 754 | TARUN S S | 260410040567 |
| 759 | PAARTH KUMAR CHOUDHARY | 260410261254 |
| 764 | UPPALAPATI BHAVITHA | 260410250065 |
| 769 | DANDAMUDI JAGRUTHI | 260410451841 |
| 823 | NAGABOOPATHY A N | 260410450529 |
| 862 | J KRISHNA CHAITANYA | 260410257706 |
| 864 | SURYA S | 260411051017 |
| 873 | ERINA FARAZ FARISHTA | 260410719096 |
| 890 | NARRA NIKHIL | 260410254661 |
| 891 | LOHIT GANDRA | 260410257394 |
| 905 | AVULA HARSHITH | 260410229729 |
| 959 | DAYANITHA P | 260411326918 |
| 962 | KIRTI | 260410327306 |
| 965 | ELAVALA BHAVADEEP REDDY | 260410415225 |
| 966 | K SIDHARTH | 260410279457 |
| 967 | SRIPATHI VAISHNAVI | 260410784148 |
| 970 | KOTTANA SAI BHAVYA | 260410391615 |
| 992 | H SINGH SARANGDEVOT | 260411038488(DLP) |

*Congratulations to Students, Parents & Staff*

## WHILE OTHERS TEACH, WE TRANSFORM ASPIRANTS INTO TOPPERS

Sri Chaitanya's revolutionary **VAIDYAH Program** for NEET Long-Term aspirants has delivered unmatched success in NEET . With a focused curriculum, expert mentorship and rigorous training, 2 out of every 3 students have achieved their dream of entering top medical colleges!

LTC Vaidyah NEET -2027 Salient Features:
No of teaching periods in total Program:
Botany: 150 (Learning Phase) + 55 (Revision Phase) = 205
Zoology: 150 (Learning Phase) + 55 (Revision Phase) = 205
Physics : 315 (Learning Phase) + 110 (Revision Phase) = 425
Chemistry: 300 (Learning Phase) + 110 (Revision Phase) = 410
No of NEET tests in total program:
No of NEET Weekend Tests : 24
No of NEET Cumulative Tests: 6
No of NEET Module Tests (Revision): 15
No of NEET Part Tests (Revision) : 6
No of NEET Grand Tests : 15
No of NEET CBT (online) in IL meta app: 25
Total no of NEET Tests: 66 + 25 = 91
No of questions to be tested:
Botany: 4095, Zoology: 4095,
Physics: 4095 and Chemistry: 4095
Total no of questions: 16380

### Merit concessions based on NEET-2026 Marks in Telangana

| Marks range | % Concession on total fee |
|---|---|
| 395 and above | 90% |
| 385 to 394 | 75% |
| 375 to 384 | 50% |
| 365 to 374 | 40% |
| 355 to 364 | 30% |
| 345 to 354 | 25% |
| 325 to 344 | 20% |

Note: above concessions are applicable upto 24th July 2026

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback | *DLP / AITS

HYDERABAD: BOYS RESI : RV HOUSE A/C - 99890 65786 | PANANIYA - 9492352617 | AGASTYA SRI A/C 1- 9177345533, AGASTYA SRI A/C 2 - 9949436457, 9441015639, 9177538334. | SRI SAI DHARBAR -MIYAPUR: 8977002958 | HYDERABAD : GIRLS RESI: NAGOLE: 9177878635 | BANDLAGUDA - 8247008202 | VYDEHI BHAVAN - 9642395095 | SAI SOWDHAM 2 A/C-9177417654 | LAND MARK - 9177417654, 9177224151, 7702737417 | AKSHARA SR NAGAR : 9177564422, 9100264123 | HYDERABAD: DAYS: DSNR ZONAL - 9849999057 | NARAYANAGUDA & CHIKKADPALLY-9177561296, 9177561332/1372/376/554, 9154137370, 8977022932 | KPHB RAMAN BHAVAN (KUKATPALLY) - 9491881101, 9885172536 | KUKATPALLY - 9177711845, 9177210888 | SHANKARI BHAVAN MADINAGUDA- 9177221710, 7569819285 | RATAN TATA SANATH NAGAR - 9100263369, 9100066274 | DR BSRAO SOUDHAM, AMEERPET- 9100066270, 9177857862 | RAMAN BAHVAN: 9491881101 | SRINIVASA COMPLEX, KUKATPALLY: 9100066282, 9177525640, 9440178403 | HERITAGE GIRLS:8247008202 | UPPAL -PEERDHJIGUDA: 9492352617, 9177625854.

శ్రీచైతన్య విద్యాసంస్థలు

Scan the QR code for Registration

## Sri Chaitanya ACADEMY

India's Most Trusted **Result-Oriented Coaching Center!**

ADMISSIONS OPEN — NEET & IIT-JEE — 1 & 2 Years Courses

HYDERABAD: KUKATPALLY - 91778 67087 | KONDAPUR - 95151 11428 | SUCHITRA - 70931 27444 | TRIMULGHERRY - 91774 44837 | DILSUKHNAGAR - 91774 44326 | HIMAYATHNAGAR - 91774 44341 | AMEERPET - 95151 11054 | SHAIKPET - 91774 44350

## Know Your Place Among Crores of Students

Want to Know Your level for National Success? Discover the Only Way to Find Out...

India's largest scholarship amount — Get UPTO 100% SCHOLARSHIP*
- NASA Trips
- Gadgets
- Cash Prizes

SCORE 2026 — FOR GRADES 3-11 — INDIA'S LARGEST TALENT SEARCH EXAM — Sri Chaitanya Outstanding Achiever Reward Examination

For students of classes 3 to 11 (CBSE & STATE)
శ్రీచైతన్య స్కూల్ టెక్నో కరిక్యులమ్
ఐఐటీ, మెడికల్, ఒలింపియాడ్ & ఇతర పోటీ పరీక్షలకు సొలిడ్ ఫౌండేషన్ అందిస్తుంది

Sri Chaitanya Educational Institutions | Infinity Learn

రిజిస్ట్రేషన్లు జరుగుతున్నవి
Scan the QR code for Registration

**Exam Dates > 4 అక్టోబర్ & 11 అక్టోబర్ 2026**

SCHOOL: 040 7104 5045 | COLLEGE: 040-6606 0606 | SCORE: 1800 121 600 600 | INFINITY LEARN: www.infinitylearn.com/score




ఆధునిక చిత్రకళా రీతులు
రూ॥150/-
పేజీలు:150
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 228 | శనివారం | 18-07-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


### జలగం ప్రసాద్‌కి ఎదురుదెబ్బ

వ్యక్తిగత భద్రత శాశ్వత హక్కు కాదని, పరిస్థితులను బట్టి భద్రత కల్పిస్తారని హైకోర్టు స్పష్టం చేసింది. భద్రత ఉపసంహరణను సవాలు చేస్తూ మాజీ మంత్రి జలగం ప్రసాదరావు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది? క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న వ్యక్తి భద్రతను హక్కుగా కొనసాగించాలని కోరలేరని పేర్కొంది. తన తండ్రి ఉమ్మడి ఏపీ సీఎం గా నక్సలైట్ల ఉద్యమానికి వ్యతిరేకంగా పనిచేశారని కేంద్ర హోమ్ శాఖ మంత్రిగా పనిచేశారని, నేటికీ నక్సలైట్ల నుంచి ముప్పు ఉందంటూ జలగం ప్రసాదరావు పిటిషన్ దాఖలు చేశారు.

## ‘ధరణి’ లావాదేవీలపై
# విచారణకు సెట్

### రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం
### రాష్ట్రంలో 40 శాతం లోటు వర్షపాతం



- ఎల్‌నినో ప్రభావంపై క్షేత్రస్థాయిలో పరిస్థితులు అంచనావేసేందుకు ప్రత్యేక బృందాన్ని పంపాలని కేంద్రానికి విజ్ఞప్తి
- రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై లేఖ
- తాగు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేయాలి
- తాగునీటికి ఇబ్బందులు లేకుండా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి
- తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలు సాగుచేయాలి
- ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు
- 20న ఉమ్మడి జిల్లాల వారీగా జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాలకు నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్




రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్రం ఒక ప్రత్యేక బృందాన్ని రాష్ట్రానికి పంపించాలని, ఎల్‌నినో కంటింజెన్సీ ప్రణాళికల అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, పంటల సాగు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రభావం, తాగునీరు సాగునీటి ఇబ్బందులు, ఉపాధి కూలీల పరిస్థితులను సమగ్రంగా వివరిస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని మంత్రివర్గం తీర్మానించింది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ధరణి’ (టెండర్ల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి) ప్రస్తుత భూభారతి వరకు జరిగిన ప్రతి అంశంపై విచారణ చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు సంస్థను (స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ – సెట్) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ‘ఎల్‌నినో’ కరువు పరిస్థితుల్లో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను అధ్యయనం చేసేందుకు జిల్లా మంత్రులు, ఎంఎల్‌ఎలు, నిపుణులు, శాస్త్రవేత్తలతో కలిసి పర్యటించి, ఒక నివేదికను రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని, తెలంగాణ రాష్ట్రంలోని క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రత్యేక కేంద్ర బృందాన్ని రాష్ట్రానికి పంపించాలని, ఎల్‌నినో కంటింజెన్సీ ప్రణాళికల అమలుకు

తరువాయి 6లో

## కొత్త ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్
# ఉద్యోగులకు భరోసా

- ఎనిమిది లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులకు లబ్ధి
- రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్ నెట్‌వర్క్‌ల ఆసుపత్రుల్లో వైద్య సేవలు
- హెల్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ డీడ్, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ వెబ్‌పోర్టల్ ప్రారంభం




ప్రజాపక్షం/హైదరాబాద్

నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు పెండింగ్‌లో పెట్టిన బిల్లులను ప్రతినెలా రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేస్తున్నామని, ప్రతి 15 రోజులకోసారి తానే స్వయంగా దీనిని సమీక్షిస్తూ ఒక్క రూపాయి కూడా పెండింగ్ లేకుండా చూస్తున్నామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న నేపథ్యంలో ప్రతి ఉద్యోగి కూడా రెట్టింపు ఉత్సాహంతో, నిబద్ధతతో

తరువాయి 6లో

# 20 వరకు బతికే ఉంటా...

- సోనమ్ వాంగ్‌చుక్ స్పష్టీకరణ
- 20వ రోజూ కొనసాగిన నిరవధిక నిరాహారదీక్ష
- పర్యావరణ కార్యకర్త ఆరోగ్యం క్లిష్టదశకు చేరుకుందని డాక్టర్ల హెచ్చరిక
- దీక్షకు సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నేత పవన్ ఖేరా



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ గత 20 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. అయితే ఆయన ఆరోగ్యం క్లిష్ట దశకు చేరిందని డాక్టర్లు హెచ్చరించారు. అయినప్పటికీ తాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెల 20 వరకు ప్రాణాలతో ఉంటానని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ జంతర్ మంతర్ వద్ద ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సిజెపి) చేపట్టిన ఆందోళన శుక్రవారంతో 28వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా వాంగ్‌చుక్, ఇతర నిరసనకారులను కలిసి వారికి సంఘీభావం తెలిపారు. నిరసన ప్రదేశంలో మద్దతుదారులను ఉద్దేశించి వాంగ్‌చుక్ మాట్లాడుతూ తన శారీరక ఆరోగ్యం క్షీణిస్తున్న విషయాన్ని అంగీకరించినప్పటికీ, తన సంకల్పం మాత్రం చెక్కుచెదరలేదని పేర్కొన్నారు. ‘నేను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోపల మాత్రం చాలా దృఢంగా ఉన్నాను. మీరందరూ కూడా లోపలా, బయటా దృఢంగా ఉన్నారని నాకు నమ్మకం ఉంది. 20న మనం పార్లమెంటుకు శాంతియుత ర్యాలీని నిర్వహించాల్సి ఉంది, ఆ సమయానికి మనకు ఈ శక్తి అవసరం. మనం కలిసి వెళ్లి ప్రజాస్వామ్య దేవాలయంలో మన విన్నపాన్ని సమర్పిద్దాం’ అని ఆయన అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జులై 20 వరకు నేను ప్రాణాలతో ఉంటానని, ఒకవేళ మీరు రాకపోయినా, 20 నాటి కార్యక్రమం విజయవంతం కాకపోయినా, దెయ్యంలా తిరిగి వస్తాను అని ఆయన సరదాగా అనడంతో అక్కడి ప్రజలు హర్షధ్వానాలు చేశారు. గత 24 గంటల్లో వాంగ్‌చుక్ బరువు మరో 350 గ్రాములు తగ్గింది, దీంతో ఆయన మొత్తం బరువు తగ్గుదల సుమారు 9.5 కిలోలకు చేరింది. ఆయనకు చికిత్స అందిస్తున్న వైద్య బృందం విడుదల చేసిన ఆరోగ్య నివేదిక ప్రకారం, వాంగ్‌చుక్

తరువాయి 6లో

## నేటి నుంచి పాల్వంచలో గిరిజన సమాఖ్య
# రాష్ట్ర 3వ మహాసభలు

### ప్రారంభం సందర్భంగా నేడు 5వేల మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ, రేపు ప్రతినిధుల సభ

ప్రజాపక్షం/పాల్వంచ




నేటి నుండి రెండురోజుల పాటు తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) రాష్ట్ర 3వ మహాసభలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ కేంద్రంగా జరగనున్నాయి. 18,19 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి, అఖిలభారత ఆదివాసీ మహాసభ ఇన్‌చార్జ్ డి అనిరాజా, అఖిలభారత ఆదివాసీ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి పసుపతి కోల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుతో పాటు తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన అధ్యక్ష్య కార్యదర్శులు అజ్మీరా రామ్మూర్తి నాయక్, రమావత్ అంజయ్య, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేశ్ పాల్గొంటున్నారు. ఈ మహాసభల సందర్భంగా తొలిరోజు 18వ తేది శనివారం సభా ప్రాంగణమైన సోయం గంగులు, తాను నాయక్ ప్రాంగణం (లాటీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం) నుండి ఆర్‌డిఓ కార్యాలయం మీదుగా అమరజీవి సిద్ధి వెంకటేశ్వర్లు స్మారక విగ్రహం వరకు 5వేల మందితో భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం అదే ప్రాంతంలో భారీ బహిరంగ సభ జరగనుంది. మరుసటి రోజు 19వ తేది శనివారం సభా ప్రాంగణంలో 230 మందితో ప్రతినిధుల నిర్వహించనున్నారు. గిరిజనుల హక్కులు, ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో విస్తృతంగా చర్చించి కీలక తీర్మాణాలు చేయనున్నారు.

పత్రికా సమావేశాల్లో ప్రధాని మోదీ మాట్లాడకపోవటంపై విదేశాంగ అధికారుల సమర్థనకు ఎడిటర్స్ గిల్డ్ ఖండన 05



## పట్టాలెక్కిన
# తొలి హైడ్రోజన్ రైల్

### హర్యానాలోని జింద్‌లో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ
### ‘మేక్ ఇన్ ఇండియా’ ప్రచారానికి విజయవంతమైన ఉదాహరణగా అభివర్ణన

**జింద్ :** భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత రైలును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. హర్యానాలోని జింద్, సోనిపట్‌లను ఈ రైలు అనుసంధానిస్తుంది. జింద్, సోనిపట్ మధ్య ఉన్న 89 కిలోమీటర్ల దూరాన్ని ఈ రైలు రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. మార్గమధ్యలో 12 స్టేషన్లలో ఆగుతుంది. అయితే ఈ నూతన శకాన్ని పర్యావరణ అనుకూల రవాణా (గ్రీన్ మొబిలిటీ) దిశగా ఒక గొప్ప ముందడుగు అని, ‘మేక్ ఇన్ ఇండియా’ ప్రచారానికి విజయవంతమైన ఉదాహరణగా మోదీ అభివర్ణించారు. కాగా, కొత్త రైలు ప్రారంభోత్సవంతో హైడ్రోజన్‌ఆధారిత రైళ్లను నడుపుతున్న దేశాల సరసన భారత్ చేరింది. అలాగే రైల్వే రంగంలో స్వచ్ఛమైన, సుస్థిర రవాణా విధానాన్ని అవలంబించే దిశగా ఇది ఒక కీలక అడుగుగా భావిస్తున్నారు. కాగా, జింద్ నుండి రైలును ప్రారంభించిన తర్వాత, ప్రధాన మంత్రి రూ. 14,700 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడంతో పాటు వాటికి శంకుస్థాపన కూడా చేశారు. ఈ హైడ్రోజన్‌ఆధారిత రైలు ’ఆత్మనిర్భర్ భారత్’కు, స్వచ్ఛమైన, భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన రవాణా వ్యవస్థ పట్ల మనకున్న నిబద్ధతకు గర్వకారణమైన చిహ్నమని మోదీ అన్నారు. భారతీయ రైల్వే నేడు ఒక కీలక ముందడుగు వేసిందని, ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ రైలు అని ఆయన తదనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో గత కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వంపై మోదీ పరోక్ష విమర్శలు చేశారు. 2014కు ముందే ఇలాంటి పరిస్థితి తలెత్తి ఉంటే భారతీయ రైల్వే కార్యకలాపాలు స్తంభించిపోయేవని, ఎందుకంటే అప్పట్లో దేశంలోని చాలా ప్రాంతాల్లో రైళ్లు ప్రధానంగా డీజిల్‌తో నడిచేవని ఆయన అన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల గురించి ప్రస్తావిస్తూ

తరువాయి 6లో

## హైటెక్ సిటీ అమృత్ రైల్వే స్టేషన్
# జాతికి అంకితం

- 75 పునరాభివృద్ధి చెందిన స్టేషన్లను ప్రారంభించిన మోదీ
- తెలంగాణలో రూ.40 వేల కోట్ల రైల్వే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి : ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఆధునిక సౌకర్యాలతో పునరాభివృద్ధి చేసిన హైదరాబాద్ హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేశారు. దేశంలోని 20 రాష్ట్రాల్లో రూ.25 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు 75 అమృత్ రైల్వే స్టేషన్లను జలంధర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లలో భారత రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. తెలంగాణలో రూ.40 వేల కోట్లకు పైగా విలువైన రైల్వే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, రోడ్డు, రైలు, విమానయాన రంగాల్లో

తరువాయి 6లో

# హైకోర్టు అనుమతి

### నేడు బిఆర్‌ఎస్ యువ సంగ్రామ సదస్సు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించనున్న ‘యువ సంగ్రామ సదస్సు‘కు హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సభ నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసింది. సభను పూర్తిగా శాంతియుతంగా నిర్వహించాలని, జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, రహదారుల దిగ్బంధం లేదా ప్రజలకు అసౌకర్యం కలిగించే పరిస్థితులు తలెత్తకుండా నిర్వాహకులు చూసుకోవాలని ఆదేశించింది. అలాగే రెచ్చగొట్టే ప్రసంగాలు, విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని, చట్టంశాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు విధించే సహేతుకమైన అన్ని షరతులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవీ దేవి శుక్రవారం

తరువాయి 6లో

## పిఎం, సిఎంల తొలగింపు బిల్లు
# ఈ సమావేశాల్లో లేనట్టే!



**న్యూఢిల్లీ :** తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటూ 30 రోజులు జైల్లో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులను తొలగించే అంశానికి సంబంధించిన బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ సంయుక్త కమిటీ, తాను చేసిన సిఫార్సులపై ఒక్కొక్కటిగా ఓటింగ్ జరుగుతున్న తరుణంలో ముసాయిదా నివేదిక ఆమోదాన్ని వాయిదా వేయాలని నిర్ణయించడం ఒక నాటకీయ పరిణామంగా మారింది. 130 వ సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త కమిటీ, ఇటీవల సభ్యులకు పంపిణీ చేసిన తన ముసాయిదా నివేదికలో 5 సిఫార్సులను చేసింది. శుక్రవారం కమిటీ ప్రతీ సిఫార్సుపై విడివిడిగా ఓటింగ్ నిర్వహిస్తున్నప్పుడు భాగస్వాములతో మరిన్ని సంప్రదింపులు, సభ్యుల మధ్య మరిన్ని చర్చలు అవసరమనే నిర్ణయానికి వచ్చింది. ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాద్–ఉల్–ముస్లిమీన్ (ఎఐఎంఐఎం)కు చెందిన అసదుద్దీన్ ఒవైసీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌పవార్) ఎంపి సుప్రియా సూలే తమ అసమ్మతి పత్రాలను సమర్పించినప్పటికీ చివరి నిమిషంలో ఆమోదాన్ని వాయిదా వేయాలని ప్యానెల్ నిర్ణయించిన తర్వాత వాటిని

తరువాయి 6లో

## విద్యా సంస్థలపై ఏ రాజకీయ పార్టీ
# పెత్తనం ఉండొద్దు

### పేపర్ లీకేజీల సమస్యపై రాజకీయ ఏకాభిప్రాయం సాధించాలి
### డెహ్రాడూన్ ‘ఛాత్రోన్ కి గూంజ్’ ర్యాలీలో రాహుల్‌గాంధీ ఉద్ఘాటన



**డెహ్రాడూన్ :** విద్యా సంస్థలపై ఏ రాజకీయ పార్టీ లేదా సంస్థకూ పట్టు ఉండకూడదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. పేపర్ లీకేజీల సమస్యపై రాజకీయ ఏకాభిప్రాయం సాధించాలని, ఇది అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డెహ్రాడూన్‌లో జరిగిన ‘ఛాత్రోన్ కి గూంజ్’ (విద్యార్థుల గళం) ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు మొత్తం విద్యా వ్యవస్థే పేపర్ లీకేజీలలో భాగమైందని, దీనివల్ల ఇప్పటివరకు 7.5 కోట్ల మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. ‘కోచింగ్ సెంటర్లు, పరీక్షా కేంద్రాలు, ప్రశ్నపత్రం రూపొందించేవారు, అనువాదకులు,

తరువాయి 6లో

## ఐదు దేశాలపై అమెరికా
# 100 శాతం దిగుమతి సుంకం!




**వాషింగ్టన్:** అమెరికా సెనేట్‌లో రష్యాపై మరింత ఆర్థిక ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో కొత్త బిల్లు ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న ప్రపంచంలోని ప్రధాన ఐదు దేశాలపై ‘100 శాతం దిగుమతి సుంకం’ (టారిఫ్) విధించాలని ప్రతిపాదించారు. ఈ జాబితాలో భారత్, చైనా, స్లోవేకియా, హంగేరీ, అజర్‌బైజాన్ ఉన్నాయి. ఈ బిల్లుకు అమెరికా సెనేట్‌లో 60 మందికి పైగా సభ్యుల మద్దతు లభించింది. డెమొక్రటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెన్‌థాల్, ఇటీవల మరణించిన రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ కలిసి ఈ చట్ట ప్రతిపాదనను రూపొందించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రేన్ యుద్ధాన్ని కొనసాగించేందుకు పొందుతున్న చమురు ఆదాయాన్ని తగ్గించడమే దీని ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. అందుకోసం రష్యా రాజకీయ నాయకత్వం, ఆర్థిక సంస్థలు, ఇంధన రంగం, ఆంక్షలను తప్పించుకునే నెట్‌వర్క్‌లపై కఠిన ఆంక్షలు విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. అయితే రష్యా నుంచి సహజ వాయువు దిగుమతి చేసుకుంటున్న కొన్ని యూరోపియన్ దేశాలకు ఈ బిల్లు మినహాయింపు కల్పిస్తోంది. రష్యా మొత్తం

తరువాయి 6లో

# విద్య, వైద్యంపై పెట్టే ఖర్చు
# రాష్ట్ర ప్రగతికి పెట్టుబడి

● 247 స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలను అందజేసిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి వివేక్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్య, వైద్యరంగాలపై ప్రభు త్వం పెట్టే ఖర్చు కేవలం ఉచిత సంక్షేమం మాత్రమే కాదని, అది మన రాష్ట్ర స్థూల ఉత్పత్తిని పెంచేందుకు మానవ వనరులపై పెట్టే దీర్ఘకాలిక పెట్టుబడి అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన 247 మంది నర్సింగ్ ఆఫీసర్లకు బంజారాహిల్స్‌లోని సేవాలాల్ భవన్‌లో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి నియామక పత్రాలను డిప్యూటీ సిఎం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నియామక పత్రాలు అందుకున్న నర్సింగ్ అధికారులను అభినందిస్తూ, నర్సింగ్ అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, అది ఆపదలో ఉన్న దీన జనులకు ప్రేమతో సేవలు అందించే ఒక పవిత్రమైన సేవ అని కొనియాడారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రత్యేక దృష్టి సారించి, దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణను సాధించి జిఓలను విడుదల చేశారని కొనియాడారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం ఇఎస్ఐ సేవలు రాష్ట్రంలోని సుమారు 20 లక్షల మంది బీమా పొందిన కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు కలిపి దాదాపు 75 లక్షల మంది లబ్ధిదారులకు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఇఎస్ఐ ఆసుపత్రులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో కూడా ఈ అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తి శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గంగాధర్, ఇఎస్ఐ జాయింట్ డైరెక్టర్ క్రాంతి సాగర్‌తో పాటు ఇఎస్ఐ, కార్మిక శాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.



## నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్

● మరింత కట్టుదిట్టంగా రవాణశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్: మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత విస్తృతంగా చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. రవాణా కమిషనర్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఓవర్‌లోడింగ్ చేస్తున్న వాహనాలు, త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహనాలను అవసరమైతే సీజ్ చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టులు రద్దు చేసిన సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేసిన మంత్రి, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని మరింత సమర్థవంతంగా వినియోగించి తనిఖీలను పెంచాలని సూచించారు. జూన్ 8 నుండి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసిన మొబైల్ స్క్వాడ్‌ల పనితీరును సమీక్షించారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్య లు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, డిటిసిలు రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి, ప్రమీల, వాణి, సదానందం, అఫ్రిన్, ఓఎస్‌డి సైదులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు అందుబాటులో సమాచారం



● తెలంగాణ మీడియా అకాడమీలో డిజిటల్ ఆర్కీవ్స్‌పై చర్చ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ మీడియా అకాడమీ చేపడుతున్న డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి, ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందు కోసం శుక్రవారం మనసు ఫౌండేషన్ ప్రతినిధి బృందంతో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి చర్చలు జరిపారు. తెలంగాణ మీడియా అకాడమీ పాత తెలుగు, ఆంగ్ల, ఉర్దూ వార్తాపత్రికలను డిజిటలైజ్ చేసి జర్నలిస్టులు, పరిశోధకులు, విద్యార్థులు, ఇతర ఆసక్తిగల వారికి లక్షలాది పేజీల సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణకు సంబంధించిన సుమారు 8 లక్షల పేజీలు డిజిటల్ ఆర్కీవ్స్‌లో నిక్షిప్తమై ఉన్నాయి. ఈ విలువైన సమాచారాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సమాచార శోధనను సులభతరం చేయడం వంటి అంశాలపై మనసు ఫౌండేషన్ ప్రతినిధులతో విస్తృతంగా చర్చలు జరిగాయి. సమావేశంలో మనసు ఫౌండేషన్ చైర్మన్ రాయుడు, సభ్యులు చంద్రమౌళి, దాము బాలాజీ, వి.శేషతలపతి సాయి, ఎ.వి. రమణమూర్తి, జగన్, తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణచందర్ రావు, అకాడమీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనసు ఫౌండేషన్ దాదాపు 28 లక్షల పేజీల చారిత్రక వార్తా పత్రికలు, పుస్తకాలు, గెజిట్లు, మ్యాగజైన్లు, ఇతర విలువైన పత్రాలను డిజిటలైజ్ చేసి భద్రపరిచిన విశిష్ట సేవలను తెలంగాణ మీడియా అకాడమీ అభినందించింది. భవిష్యత్ తరాలకు చారిత్రక సమాచారాన్ని అందుబాటులో ఉంచేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అకాడమి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే డిజిటల్ ఆర్కీవ్స్‌ను మరింత విస్తరించే దిశగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, డిజిటలైజ్ చేసిన పత్రాలకు సమగ్ర ఇండెక్సింగ్, డాక్యుమెంటేషన్ నిర్వహించడం, ప్రత్యేక డిజిటల్ ఆర్కీవ్ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేయడం, డేటా భద్రత కోసం ప్రత్యామ్నాయ కాపీలను భద్రపరచడం, జాతీయ స్థాయి సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఉత్తమ విధానాలను అనుసరించడం వంటి అంశాలపై సూచనలు చేశారు. డిజిటల్ ఆర్కీవ్స్, ఆర్కీవ్ నిర్వహణ, మీడియా పరిశోధన, జర్నలిజం చరిత్ర, డాక్యుమెంటేషన్ తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు నిర్వహించాలని మనసు ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. చారిత్రక మీడియా సంపదను సంరక్షించడం, పరిశోధనకు ప్రోత్సాహం అందించడం, డిజిటల్ ఆర్కీవ్స్‌ను మరింత బలోపేతం చేయడం కోసం తెలంగాణ మీడియా అకాడమీ, మనసు ఫౌండేషన్ పరస్పర సహకారంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# దిల్‌సుఖ్‌నగర్‌లో మాంగళ్య షాపింగ్‌మాల్



● ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన నటి మీనాక్షి చౌదరి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది. ఈ క్రమంలో దిల్‌సుఖ్‌నగర్‌లో శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. రిబ్బన్ కటింగ్ అనంతరం నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ దిల్‌సుఖ్‌నగర్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉందని, వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుంది" అని అన్నారు. మాంగ ళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహ మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ "ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే మా విజయ రహస్యం" అని తెలిపారు. "తమ స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం" అని పేర్కొన్నారు. రూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిందని, ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోందని, ప్రజలు తమ తమ శుభ కార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్‌కు సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని డైరెక్టర్స్ కోరారు.

# ‘నీట్’లో బిసి గురుకుల విద్యార్థుల సత్తా

193 మందిలో 176 మంది అర్హత
25 మందికి ఎంబిబిఎస్ సీట్లు వచ్చే అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బిసి గురుకుల విద్యాసంస్థల విద్యార్థులు నీట్ 2026లో మెరుగైన ఫలితాలు సాధించారు. పరీక్షకు హాజరైన 193 మంది విద్యార్థుల్లో 176 మంది అర్హత సాధించారు. వీరిలో 25 మందికిపైగా ఎంబిబిఎస్, 70 మందికిపైగా బిడిఎస్, వెటర్నరీ, హోమియో, ఆయుర్వేద, యూనానీ కోర్సుల్లో సీట్లు లభించే అవకాశం ఉందని గురుకుల సొసైటీ తెలిపింది. విద్యార్థుల్లో బి.హిమణి (490), జి.సుప్రియ (485), ఎం.శివాత్మిక (473) అత్యధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులు, అధ్యాపకులను అభినందిస్తూ పేద బిసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నందుకే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు, ప్రిన్సిపల్ కార్యదర్శి (ఎఫ్ఎసి) బాలమాయ దేవి, గురుకుల కార్యదర్శి బడుగు సైదులు కూడా విద్యార్థులను అభినందించారు.

**నీట్‌లోగురుకుల విద్యార్థుల ప్రతిభ**
**333 మందికి సీట్లు వచ్చే అవకాశం**

నీట్ 2026లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు మరోసారి మెరుగైన ఫలితాలు సాధించారు. సుమారు 333 మంది విద్యార్థులకు ఎంబిబిఎస్, బిడిఎస్‌తో పాటు ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశాలు లభించే అవకాశం ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత, గురుకులాల్లో నాణ్యమైన బోధన, ప్రత్యేక కోచింగ్, ఆధునిక మౌలిక వసతులు, నిరంతర అకడమిక్ పర్యవేక్షణ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, అధికారులు, కోచింగ్ బృందాలను ఆయన అభినందించారు. వైద్య విద్యలో ప్రవేశం పొందనున్న విద్యార్థులు సమాజానికి సేవ చేసే ఉత్తమ వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

## పత్రికా సమావేశాల్లో ప్రధాని మోదీ మాట్లాడకపోవటంపై
# విదేశాంగ అధికారుల సమర్థనకు ఎడిటర్స్ గిల్డ్ ఖండన

**న్యూఢిల్లీ:** స్వదేశంలో లేదా విదేశాల్లో ముందస్తు సన్నాహం లేకుండా పత్రికా సమావేశాలు నిర్వహించటానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విముఖత చూపే వ్యవహారాన్ని ఒక విజయవంతమైన రాజకీయవేత్తగా ఆయన తన గ్రామీణ ఓటర్లతో నేరుగా సంభాషించడానికి ఇష్టపడతారంటూ విదేశాంగ మంత్రిత్వ శాఖలోని కొందరు అధికారులు సమర్థించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను ఎడిటర్స్ గిల్ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండించింది. ప్రధాని మీడియా నుండి ప్రశ్నలు ఎందుకు స్వీకరించడం లేదనే ప్రశ్నకు బదులుగా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారి చెప్పిన మాటల్లో తీవ్రమైన లోపాలు ఉన్నాయని పేర్కొంది. భావ ప్రకటనా స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛపై మరింత ప్రతికూల ప్రభావాన్ని చూపే తేలికపాటి పసలేని వాటికి దూరంగా ఉండాలని ఉన్నత పదవుల్లోని అధికారులను కోరింది. ఈ మేరకు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు సంజయ్ కపూర్, ప్రధాన కార్యదర్శి రాఘవన్ శ్రీనివాసన్, కోశాధికారి తెరిసా రెహమాన్‌ల పేరుతో గురువారం ఒక ప్రకటన విడుదలైంది.

పశ్చిమ ఆసియా యుద్ధం నేపథ్యంలో ప్రపంచం అపూర్వమైన ఇంధన సంక్షోభంలో కూరుకుపోయిన తరుణంలో ప్రధానమంత్రి అత్యవసర రాజకీయ, ఆర్థిక సమస్యల గురించి పట్టణ, గ్రామీణ ప్రజలకు నిత్యం సమాధానం చెప్పవలసి ఉంటుందని ఎడిటర్స్ గిల్డ్ గుర్తు చేసింది. అయితే, ఇలాంటి భారీ సంక్షోభంపై ప్రధాని తన అభిప్రాయాలను ఏ విధమైన మీడియాతోనూ పంచుకునేందుకు విముఖత చూపారనేది వాస్తవమని పేర్కొంది. ప్రజాస్వామ్య ప్రపంచంలో అధినేతలు మీడియాను విస్మరించకపోవటమే కాకుండా, భాగస్వామ్య ప్రక్రియలో ఒక అంతర్భాగంగా మీడియాతో క్రమం తప్పకుండా సంభాషిస్తూ, ప్రశ్నలను ఎదుర్కొంటారని గుర్తు చేసింది. సరైన రీతిలో పనిచేసే ప్రతి ప్రజాస్వామ్యంలోనూ ప్రజల తరపున మీడియా మాట్లాడుతుందని, ప్రభుత్వ పదవులలో ఉన్నవారి నుండి జవాబుదారీతనాన్ని కోరుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర, తీవ్రమైన సమస్యలపై స్పందనలను కోరుతుందని పేర్కొంది. ప్రధానంగా సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా జరిగే మందస్తు లిఖిత సమాచారం ఆధారంగా సాగే ఏకపక్ష సమాచార ప్రసారాలు, స్వతంత్ర మీడియాతో ప్రజల సంభాషణకు ప్రత్యామ్నాయం కాబోవని ఎడిటర్స్ గిల్డ్ స్పష్టం చేసింది.

## ‘నీట్’ ఫలితాల్లో ఆల్ ఇండియా
# అగ్రస్థానంలో శ్రీచైతన్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ 2026 ఫలితాల్లో శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ విద్యార్థులు దేశవ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో మొదటి ర్యాంకును శ్రీ చైతన్య విద్యార్థి ఆర్యన్ గుప్తా సాధించారు. అలాగే ఓపెన్ కేటగిరీలో టాప్10 ర్యాంకుల్లో తెలంగాణకు చెందిన 8 మంది శ్రీ చైతన్య విద్యార్థులు నిలిచి సంస్థకు మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం ఓపెన్ కేటగిరీలో 1వ ర్యాంక్ ఆర్యన్ గుప్తా, 3వ ర్యాంక్ ఉపలక్ష్య గోయల్, 5వ ర్యాంక్ బూరా సాయి శరణ్, 6వ ర్యాంక్ కె.హనీష్, 9వ ర్యాంక్ గౌరవ్ సింగ్ సాధించారు. అలాగే ఓపెన్ కేటగిరీలో టాప్ 10లో 8 ర్యాంకులు, టాప్20లో 6 ర్యాంకులు, టాప్ 50లో 12 ర్యాంకులు, టాప్ 100లో 18 ర్యాంకులు, టాప్ 1000లో 84 ర్యాంకులు శ్రీ చైతన్య విద్యార్థులు సాధించినట్లు సంస్థ తెలిపింది. తెలంగాణ రాష్ట్రం నుంచి టాప్ 10లో 8 ర్యాంకులు, టాప్ 100లో 67 ర్యాంకు లు శ్రీ చైతన్య విద్యార్థులకే దక్కినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా సంస్థ అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల నిబద్ధత, శాస్త్రీయ బోధన విధానాలు, నిరంతర పరీక్షల వ్యవస్థ, వ్యక్తిగత మార్గదర్శకత వల్లే ఈ ఘన ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

# రాష్ట్రంలో వేగంగా ‘సర్’

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎన్నికల జాబితా సవరణ, క్రమబద్ధీకరణ ప్రక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా కొనసాగుతోందని ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ఎలక్టోరల్ ఫారాల (ఈఎఫ్) డిజిటైజేషన్ పనులు ఇప్పటివరకు 61.05 శాతం పూర్తయ్యాయి. శుక్రవారం సాయంత్రం 6.01 గంటల వరకు ఈసిఐనెట్ డ్యాష్ బోర్డ్‌లో నమోదైన తాజా అధికారిక గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో మొత్తం ముందస్తు డ్రాఫ్ట్ ఓటర్ల సంఖ్య 3,38, 26,448 కి చేరింది. ఈ భారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు నియమించిన మొత్తం 35,984 మంది బూత్ లెవెల్ అధికారులకు వంద శాతం విజయవంతంగా శిక్షణ పూర్తి చేశారు. మొత్తం 2,06,52,577 ఫారాలు డిజిటలైజ్ చేయగా, 1,18,39,042 ఫారాలు (35 శాతం) ఇంకా డిజిటలైజ్ చేయాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,38,26,446 ఈఎఫ్‌లు ముద్రించగా, 3,38,26,421 ఫారాలను పంపిణి చేసి, దాదాపు వంద శాతం పంపిణీ పూర్తి చేశారు. ఈఎఫ్ పార్ట్‌లో 35,169 భాగాలు డౌన్‌లోడ్ అయ్యాయి. మరోవైపు 9,48,871 మంది ఓటర్లు (2.81 శాతం) తమ ఫారాలను స్వయంగా సమర్పించినట్లు డ్యాష్‌బోర్డ్ వెల్లడించింది. ఓటర్ల జాబితాలో చిరునామా, లింగం, ఇతర జనాభా వివరాల్లో వ్యత్యాసాలు (ఏఎస్‌డి) ఉన్న 1,54,907 మంది (0.46 శాతం) ఓటర్లను గుర్తించారు. అలాగే డూప్లికేట్ లేదా అనుమానాస్పద నమోదుల (డిఎస్ఈ) కింద 1,79,462 మంది



(0.53 శాతం) ఓటర్లు గుర్తింపునకు వచ్చారు. వీరిలో 12,153 ఫారాలను సేకరించలేనివిగా నమోదు చేయగా, 16,684 కేసుల్లో ఎలాంటి చర్య అవసరం లేదని ధృవీకరించారు. ఫారాలు సేకరించలేని కేటగిరీలో మొత్తం 13,34,829 కేసులు (3.95 శాతం) నమోదయ్యాయి. వీటిలో శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారిన వారు 6,39,503 మంది, మరణించిన వారు 4,64,210 మంది, ఇప్పటికే నమోదు అయిన వారు 1,73,115 మంది, చిరునామా లేనివారు లేదా గైర్హాజరైన వారు 53,324 మంది, ఇతర కారణాలతో 4,677 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో పాల్గొంటున్న 35,984 మంది బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓలు) అందరికీ శిక్షణ పూర్తి చేసినట్లు సమాచారం. ఓటర్ల జాబితాను పారదర్శకంగా, తప్పులు లేని విధంగా రూపొందించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ధృవీకరణ, డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మిగిలిన ఫారాల డిజిటలైజేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు చెప్పారు.

## నేటి నుంచి యాదగిరిగుట్టలో రాష్ట్రస్థాయి రైతుల శిక్షణా శిబిరం

● మూడు రోజుల శిబిరంలో పాల్గొననున్న వ్యవసాయ రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి రైతుల శిక్షణా శిబిరం యాదగిరిగుట్టలోని మున్నూరు కాపు సంఘం భవనంలో జరగనుంది. ఈ శిబిరంలో వ్యవసాయ రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు పాల్గొని వివిధ సమకాలీన అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీన ఉదయం 10.30 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య ఈ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు 'ఎల్ నినో పరిస్థితుల్లో వరికి బదులు మెట్ట పంటల సాగు' అనే అంశంపై ఆయన తొలి ప్రసంగం చేస్తారు. వివిధ అంశాలపై నిపుణులతో నిర్వహించనున్న ఈ శిక్షణా శిబిరంలో రైతులు, రైతు సంఘం నాయకులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం

● దేవాదాయశాఖలో 191 మందికి నియామక పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఆలయాల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, ఆగమ సంప్రదాయాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 47 ఆలయాల్లో ఖాళీగా ఉన్న అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, మృదంగం, డోలు, సన్నాయి, శృతి, తాళం తదితర విభాగాల్లో ఎంపికైన మొత్తం 191 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా మంత్రి కొండా సురేఖ అందజేశారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దేవాదాయశాఖ చరిత్రలో తొలిసారిగా ఒకేసారి 191మందికి నియామకపత్రాలివ్వడం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని పేర్కొన్నారు. దేవాలయ ఉద్యోగాన్ని కేవలం ఉపాధి లేదా ప్రభుత్వ ఉద్యోగంగా కాకుం డా భగవంతుని సేవ చేసే పవిత్ర బాధ్యతగా భావించాలని కొత్తగా నియమితులైన ఉద్యోగులకు సూచించారు. అలాగే పనితీరు ఆధారంగా ఆలయాల విభాగాల ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవిం ద హరి, సిటా డైరెక్టర్ విజయ రాఘవాచార్యులు, ఆర్‌జెసి రామకృష్ణారావు, డిసి కృష్ణ ప్రసాద్, ఆలయాల ఈవోలు, దేవాదాయశ శాఖ అధికారులు, ఉద్యోగసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



**వరుణయాగాలు నిర్వహించాలి**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని ఆలయాల్లో త్వరలో వరుణయాగాలు నిర్వహించాలని మంత్రి కొండా సురేఖ తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేయాలని సూచించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న గ్రేడ్– 1, గ్రేడ్– 2 ఈవోల పదోన్నతులు పూర్తి చేశామని, త్వరలో గ్రేడ్– 3 ఈవోల పదోన్నతులు కూడా చేపడుతామని మంత్రి వెల్లడించారు.

## రవాణా అనుసంధాన కేంద్రంగా తెలంగాణ

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను దేశంలోనే అత్యాధునిక రవాణా అనుసంధాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సచివాలయంలో శుక్రవారం ప్రతిపాదిత హైదరాబాద్ పూణే ముంబై, భారత్ ఫ్యూచర్ సిటీ బెంగళూరు, భారత్ ఫ్యూచర్ సిటీ అమరావతి చెన్నై హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్లపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కారిడార్ల అనుసంధాన అవకాశాలు, భవిష్యత్ రవాణా అవసరాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రతిపాదిత కారిడార్ల సాధ్యాసాధ్యాలు, రాష్ట్ర అభివృద్ధిపై వాటి ప్రభావం, వేగవంతమైన రవాణా వ్యవస్థ ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా సమీక్షించినట్లు మంత్రి వెల్లడించారు.

## సెమికాన్ 2.0తో తెలంగాణకు భారీ అవకాశాలు

● కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సెమికాన్ 2.0 పథకం ద్వారా భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.1.27 లక్షల కోట్లతో అమలు కానున్న ఈ పథకం ద్వారా చిప్ తయారీ, డిజైన్, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే సెమికాన్ 1.0 కింద ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల (ఈఎంసిలు) ఏర్పాటుకు కేంద్రం రూ.724 కోట్ల ప్రాజెక్టులు మంజూరు చేసిందని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఐటి హైదరాబాద్ సహా 27 విద్యాసంస్థల్లో సెమీకండక్టర్ డిజైన్‌కు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. రూ.62,500 కోట్ల మొబైల్ ఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ స్కీమ్ ద్వారా హైదరాబాద్‌కు మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. చిప్ డిజైన్, ఫ్యాబ్రికేషన్, ప్యాకేజింగ్ వంటి రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని, తెలంగాణ యువత ప్రపంచస్థాయి ఉద్యోగాలు, స్టార్టప్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ఇజ్రాయెల్ పార్లమెంటు రద్దు

### అక్టోబర్ 27న సాధారణ ఎన్నికలు



**టెల్ అవీవ్:** ఇజ్రాయెల్ పార్లమెంట్ (నెస్సెట్) అక్టోబర్ 27న జరగనున్న సాధారణ ఎన్నికల కారణంగా రద్దయింది. దీంతో పార్లమెంట్ వేసవి విరామం తర్వాత తిరిగి సమావేశం కాకుండానే ఎన్నికలకు వెళ్తుంది. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని ప్రభుత్వం అధికారాన్ని నిలబెట్టుకునేందుకు చివరి క్షణాల్లో పలు వివాదాస్పద బిల్లులను ఆమోదించుకుంది. వీటిలో 'అల్ట్రాఆర్థడాక్స్' యూదులకు సైనిక సేవ నుంచి మినహాయింపు కల్పించే బిల్లులు, న్యాయవ్యవస్థ అధికారాలను తగ్గించే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. అయితే తాజా సర్వేలు ప్రతిపక్ష పార్టీలకు ప్రజాదరణ పెరుగుతోందని సూచిస్తున్నాయి. 2023 అక్టోబర్ 7 దాడి తర్వాత కొనసాగుతున్న యుద్ధం, రాజకీయ అస్థిరత నేపథ్యంలో ఈ ఎన్నికలు ఇజ్రాయెల్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టంగా భావిస్తున్నారు.

# ఒకే దేశ పెత్తనం ఉండొద్దు

### ఏఐపై చైనా స్పష్టీకరణ

**షాంఘై:** చైనాలోని షాంఘైలో ప్రారంభమైన 2026 వరల్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్ (డబ్ల్యుఏఐసి)లో అధ్యక్షుడు క్సీ జిన్‌పింగ్ కృత్రిమ మేధస్సు (ఏఐ) అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ ఒకే దేశం ఆధిపత్యం చెలాయించే 'సోలో ప్రదర్శన' కాకూడదని, ప్రపంచ దేశాలన్నీ కలిసి రూపొందించే 'సంగీత సమ్మేళనం' (సింఫనీ)లా ఉండాలని ఆయన పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ మానవాళి సంక్షేమానికి ఉపయోగపడేలా అంతర్జాతీయ ఏకాభిప్రాయం, మానవ విలువల ఆధారంగా దాని అభివృద్ధి జరగాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మద్దతుగా వచ్చే ఐదేళ్లలో 5,000 ఏఐ పరిశోధన ప్రాజెక్టులు, శిక్షణ కార్యక్రమాలు, సదస్సులు, సహకార కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చైనా ప్రకటించింది. ఈ సహకారం ఆసియాన్, బ్రిక్స్, ఆఫ్రికన్ యూనియన్, అరబ్ లీగ్, షాంఘై సహకార సంస్థ, లాటిన్ అమెరికా దేశాలకు అందించనుంది. అదే సందర్భంగా 29 దేశాలు కలిసి 'వరల్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్' (డబ్ల్యుఏఐసిఒ)' అనే కొత్త అంతర్జాతీయ సంస్థను స్థాపించేందుకు ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీని ప్రధాన కార్యాలయం షాంఘైలో ఉంటుంది. ఇలావుండగా, ఈ ప్రకటనలు ప్రపంచ ఏఐ రంగంలో చైనా తన నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా భావిస్తున్నారు. అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్




వంటి దేశాలతో తీవ్ర సాంకేతిక పోటీ నెలకొన్న నేపథ్యంలో, ఏఐ, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ సాంకేతికతల్లో భారీ పెట్టుబడులు పెట్టి ప్రపంచ సాంకేతిక శక్తిగా ఎదగాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. కాగా, చైనాలోని షాంఘైలో జరిగిన డబ్ల్యుఏఐసి సందర్భంగా పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, కృత్రిమ మేధస్సు (ఏఐ), విజ్ఞాన-సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని వారు నిర్ణయించారు. అలాగే చైనా-పాకిస్తాన్ ఆర్థిక కారిడార్ (సిపిఇసి) 2.0 రెండో దశను వేగవంతం చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఏఐ సహకార సంస్థ (డబ్ల్యుఏఐసిఒ) ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాన్ని కూడా పాకిస్తాన్ సమర్థించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏఐ సాంకేతిక సమానంగా అందుబాటులో ఉండేలా అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయాలని పాకిస్తాన్ పునరుద్ఘాటించింది.

## హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ (4వ పేజీ తరువాయి)

**ఉత్తర్వులు జారీ చేశారు.** సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వెనుక మైదానంలో నిర్వహించనున్న యువ సంగ్రామ సదస్సుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సభ అనుమతి కోసం సమర్పించిన దరఖాస్తుపై పోలీస్ కమిషనర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసి అత్యవసర విచారణ కోరారు. పిటిషనర్ తరఫున కోర్టుకు సమర్పించిన వాదనల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకే ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సభ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, వాహనాల పార్కింగ్, 25 సీసీటీవీ కెమెరాలు, 15 మొబైల్ మరుగుదొడ్లు, అగ్నిమాపక భద్రతతో పాటు స్టేడియం అద్దె, ఇతర ఫీజులన్నీ చెల్లించినప్పటికీ పోలీసులు అనుమతి ఇవ్వలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.ప్రభుత్వం తరఫున శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, తెలంగాణ నిర్మాణ జేఏసీకి చెందిన వివిధ విద్యార్థి సంఘాల నాయకులు సభకు హాజరయ్యే అవకాశమున్నందున జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలిగే ప్రమాదం ఉందని, ఇంటెలిజెన్స్ నివేదికలు కూడా ఇదే విషయాన్ని సూచిస్తున్నాయని కోర్టుకు వివరించారు.అయితే ప్రభుత్వ వాదనలను హైకోర్టు అంగీకరించలేదు. కేవలం ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగా లేదా కొందరు వ్యక్తులపై గతంలో నమోదైన కేసులను ఆధారంగా చేసుకుని ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే రాజకీయ సభకు అనుమతి నిరాకరించడం సమంజసం కాదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రతి పౌరుడికి, ప్రతి రాజకీయ పార్టీకి శాంతియుతంగా సమావేశాలు నిర్వహించే హక్కును కల్పించిందని, తగిన ఆధారాలు లేకుండా ఆ హక్కును పరిమితం చేయలేమని పేర్కొంది. అదే సమయంలో ప్రజా శాంతి, భద్రత దృష్ట్యా పోలీసులు విధించే సహేతుకమైన షరతులను తప్పనిసరిగా పాటించాలని ఆదేశిస్తూ బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు నిర్వహణకు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది.

## తొలి హైడ్రోజన్ రైల్ (4వ పేజీ తరువాయి)

'గత కొన్ని నెలలుగా పశ్చిమాసియాలో, ఇరాన్, గల్ఫ్ ప్రాంతాలతో కూడిన హార్ముజ్ జలసంధి ప్రాంతం అంతటా యుద్ధం జరుగుతుందని, హార్ముజ్ మీదుగా సాగే ఈ సముద్ర మార్గం ద్వారానే భారత్ భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి గ్యాస్, రైతులకు అవసరమైన ఎరువులను పొందుతుందన్నారు. కానీ గత మూడు నాలుగు నెలలుగా, ఈ మార్గం నిరంతరం యుద్ధ క్షేత్రంగా, సంక్షోభం మధ్యలో ఉండిపోయిందన్నారు. ' హైడ్రోజన్ ఆధారిత రైలును నడిపే సామర్థ్యం కేవలం మూడు లేదా నాలుగు దేశాలకు మాత్రమే ఉన్నందున, 21వ శతాబ్దపు ఈ సాంకేతికతలో భారతీయ రైల్వే ఒక పెద్ద ముందడుగు వేసిందని ఆయన అన్నారు.ఈ రైలు 3200 హార్స్‌పవర్ సామర్థ్యాన్ని కలిగి ఉందని, ఇది అత్యంత శక్తివంతమైనదే కాకుండా అత్యంత పొడవైనది (10 కోచ్‌లు) కూడా అని మోదీ పేర్కొన్నారు. 'ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో, హైడ్రోజన్ రైలుకు కేవలం 3 లేదా 4 కోచ్‌లు మాత్రమే ఉంటాయి. కానీ భారతదేశం లో, ఈ రైలు 10 కోచ్‌లను కలిగి ఉంది,' అని ఆయన చెప్పారు. 10 కోచ్‌ల హై డ్రోజన్ రైలును నడపడం ద్వారా, భారతదేశం ప్రపంచ వేదికపై తన ఉనికిని చాటుకుందని ఆయన అన్నారు. హైడ్రోజన్ ఆధారిత రైలును ప్రారంభించిన తర్వాత, మోదీ రూ. 14,700 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను దేశానికి అంకితం చేశారు. ఇవి రోడ్డు అనుసంధానత, ఆరోగ్య సంరక్షణ, సాంస్కృతిక వారసత్వాన్ని బలోపేతం చేయడంలో దోహదపడతాయి. ఈ ప్రాజెక్టులలో సుమారు రూ. 9,680 కోట్ల వ్యయంతో నిర్మించిన, 157.92 కిలోమీటర్ల పొడవైన, 4 లేన్ల, పూర్తి నియంత్రిత ప్రవేశం కలిగి న 'ఢిల్లీ—అమృత్‌సర్—కత్రా ఎక్స్‌ప్రెస్‌వే' ఉంది.

# ఇరాన్ మౌలిక సదుపాయాలపై అమెరికా విస్తృత దాడులు

- హోర్ముజ్ జలసంధిపై ఒత్తిడి పెంచే ప్రయత్నం

**దుబాయ్:** అమెరికా—ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున అమెరికా ఇరాన్‌పై వైమానిక దాడులను విస్తరించి, హోర్ముజ్ ప్రావిన్స్‌లోని పలు వంతెనలు, విద్యుత్ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంది. అలాగే ఒమన్ గల్ఫ్ తీరంలోని వ్యూహాత్మక ప్రాధాన్యం గల చాబహార్ నౌకాశ్రయంలోని ఒక టవర్‌ను కూల్చివేసింది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యాన్ని సడలించేందుకు ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో నే ఈ దాడులు చేపట్టినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ఖతార్, బహ్రెయిన్, కువైట్‌లపై క్షిపణి దాడులు చేసింది. యుద్ధంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఖతార్‌లో క్షిపణి హెచ్చరికలు జారీ చేయగా, గగనతల రక్షణ వ్యవస్థలు అనేక క్షిపణులను అడ్డుకున్నాయి. కువైట్‌లో విద్యుత్ ఉత్పత్తి, సముద్రజలాలను తాగునీటిగా మార్చే డీశాలినేషన్ కేంద్రంపై జరిగిన దాడితో భారీ నష్టం సంభవించింది. ఎడారి దేశమైన కువైట్‌లో తాగునీటి అవసరాల్లో దాదాపు 90 శాతం ఈ కేంద్రాలపైనే ఆధారపడటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అమెరికా దాడుల్లో ఇరాన్ దక్షిణంలోని బందర్ ఖమీర్ ప్రాంతంలోని వంతెనలు ధ్వంసమయ్యాయి. దీంతో ఇరాన్ ప్రధాన ఓడరేవు బందర్ అబ్బాస్‌కు రహదారి, రైల్వే అనుసంధానాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ మౌలిక సదుపాయాలపై కూడా దాడులు జరిగినట్లు ఇరాన్ తొలిసారిగా అధికారికంగా అంగీకరించింది. దక్షిణ ప్రావిన్సుల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించింది. ఇదిలా ఉండగా, చాబహార్ నౌకాశ్రయం భారత్ సహకారంతో అభివృద్ధి చెందుతు న్న కీలక వాణిజ్య కేంద్రం కావడం గమనార్హం. అక్కడి టవర్ కూలిపోవడంతో వాణిజ్య కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇరాన్ ఆరోగ్య శాఖ ప్రకారం తాజా అమెరికా దాడుల్లో కనీసం 38 మంది మరణించగా, 400 మందికిపైగా గాయపడ్డారు. మరోవైపు, హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న





ఒక చమురు ట్యాంకర్‌పై కూడా దాడి జరిగినట్లు బ్రిటన్ సముద్ర వాణిజ్య పర్యవేక్షణ కేంద్రం వెల్లడించింది. నౌకకు స్వల్ప నష్టం జరిగినప్పటికీ సిబ్బందికి ఎలాంటి హాని జరగలేదని తెలిపింది. ప్రపంచ చమురు, సహజవాయు సరఫరాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం అమెరికా, ఇరాన్ మధ్య పోటీ మరింత ముదురుతోంది. ఈ మార్గంలో సరుకు రవాణా ఇప్పటికే గణనీయంగా తగ్గిపోగా, పెరుగుతున్న భద్రతా ముప్పుతో అనేక చమురు నౌకలు ప్రయాణాలను నిలిపివేయడం లేదా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం ప్రారంభించాయి. దీంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో మరోసారి అనిశ్చితి నెలకొంది.

## విచారణకు 'సెట్' (4వ పేజీ తరువాయి)

అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర మంత్రివర్గం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అనంతరం రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి పౌర సబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో దాదాపు 40 శాతం వర్షపాతం లోటు ఉన్నదని, తాగు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖలు ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని మంత్రివర్గం ఆదేశించింది. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు చేసే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని మంత్రివర్గం ఆదేశించింది. ఒక్క నిమిషం కూడా విద్యుత్ కోత లేకుండా నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు అవసరమైన విద్యుత్తు ఉత్పత్తితో పాటు కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించింది. అన్ని ప్రాజెక్టులలో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

**ఆరుతడి పంటలనే సాగు చేయండి**

ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగును రైతులు నివారించాలని, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేయాలని మంత్రివర్గం రాష్ట్ర రైతులకు విజ్ఞప్తి చేసింది. ఎల్ నినో ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని, ఇందుకు రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి సారథ్యంలో వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావంపై ప్రత్యేక నివేదిక రూపొందించాలని మంత్రివర్గం సూచించింది. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన పంటలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటలతో పాటు పశువుల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలతో నివేదికను అందించాలని కోరింది.

అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను వెంటనే చేపట్టాల్సిన చర్యలను తెలుసుకునేందుకు అత్యవసర సమీక్ష సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెల 20వ తేదీ సోమవారం ఉమ్మడి జిల్లాల వారీగా జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో అక్కడి ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి జిల్లా ఇన్ ఛార్జీ మంత్రితో పాటు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారికి ఈ బాధ్యతలను అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్రకృతి గండం నుంచి గట్టెక్కేందుకు అన్ని శాఖలు సన్నద్ధంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ, సమన్వయంతో పనిచేసి వర్షాభావ సంక్షోభాన్ని అధిగమించాలని రాష్ట్ర మంత్రివర్గం సూచించింది.

**'ధరణి' అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణకు 'సెట్'**

భూముల రికార్డులు, భూముల క్రయ విక్రయాలకు సంబంధించి ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2020 అక్టోబర్ 29 నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిందని, అప్పటి నుంచి రాష్ట్రంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా జరిగిన అన్ని అనుమానాస్పద లావాదేవీలను లోతుగా పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికే చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో దాదాపు 10 వేలకుపైగా అనుమానాస్పద లావాదేవీలున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందుకే భూముల లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ రికార్డులు, లాగిన్ వివరాలు, రికార్డుల్లో చేసిన మార్పులు, అధికారుల అనుమతులు, భూముల వర్గీకరణ మార్పులు, లబ్ధిదారుల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించింది.ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన (ఐఎల్,ఎఫ్ఎస్) పాత్రతో పాటు, పోర్టల్ నిర్వహణ సంస్థ ఎంపిక, టెండర్ ప్రక్రియ, వెండర్‌కు కాంట్రాక్టు కేటాయింపు, పోర్టల్ రూపకల్పన, సిస్టమ్ ఆర్కిటెక్చర్, డేటా భద్రతలో ఉన్న లోపాలపై విచారణ జరపాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ధరణిలో పోర్టల్ తర్వాత కొన్ని మాడ్యుల్స్ మార్చి రైతులకు ఉపయోగంగా ఉండేలా తమ ప్రభుత్వం భూభారతి అమల్లోకి తెచ్చిందని, ఇప్పటికీ ఆనాడు సాఫ్ట్ వేర్ రూపకల్పన చేసిన పోర్టల్ లో ఉన్న లోపాలతో అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయని, అందుకే ధరణి వ్యవహారంలో బాధ్యులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు

### మంత్రివర్గం నిర్ణయాలు

– రాష్ట్రంలోని మున్సిపల్ కార్పోరేషన్ల ఎన్నికైన సంస్థల్లో ట్రాన్సెజెండర్లను కోఆప్టెడ్ సభ్యులుగా నామినేట్ చేసేందుకు తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం2019ను సవరించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గ్రామ పంచాయతీల నిధుల నిర్వహణకు సంబంధించి తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం గ్రామపంచాయతీలకు అందే నిధులను ట్రెజరీలో జమ చే సే విధానం ఉంది. ఈ నిబంధనను మార్చి సమీపంలో ఉన్న జాతీ య బ్యాంకులు, సహకార బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో ఈ నిధులను జమ చేసుకునేలా ప్రతిపాదించిన సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018లో సవరణకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.హైదరాబాద్ నుంచి ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలకు ప్రతిపాదించిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల అలైన్మెంట్లు, స్టేషన్ల స్థానాలను ఆర్ అండ్ బీ విభాగం రాష్ట్ర క్యాబినెట్ కు తెలియజేసింది. శంషాబాద్ సమీపంలో రైల్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్‌పుణెముంబైకి ఒక రూట్, హైదరాబాద్‌బెంగుళూరు మరో రూట్, హైదరాబాద్అమరావతితిరుపతిచెన్నై మరో రూట్ బుల్లెట్ రైళ్లకు కేంద్రం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ముక్తేశ్వర్ ఎత్తిపోతల పథకం (చిన్న కాళేశ్వరం) పూర్తి చేసేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గోదావరి నదిపై కన్నెపల్లి నుంచి 4.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసి మంథని నియోజకవర్గంలో 45 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ఈ పథకం పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయిచింది. ఇప్పటికే పూర్తయిన పనులను అంచనా వేసుకొని, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలిపింది.

## దిగుమతి సుంకం! (4వ పేజీ తరువాయి)

గ్యాస్ ఎగుమతుల్లో వాటి దిగుమతులు 15 శాతానికి లోపే ఉండి, వాటిని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్న దేశాలకు ఈ సడలింపు వర్తిస్తుంది. అలాగే ప్రతి 180 రోజులకు ఒకసారి రష్యా చమురు కొనుగోలు చేస్తున్న అగ్ర ఐదు దేశాల జాబితాను పునఃసమీక్షించి, అవసరమైతే టారిఫ్‌లను సవరించాలని కూడా బిల్లు సూచిస్తోంది. అమెరికా అణు విద్యుత్ కేంద్రాలు, వైద్య అవసరాల కోసం రష్యా నుంచి యురేనియం కొనుగోలు చేయడాన్ని, అలాగే అణు, అంతరిక్ష రంగాల్లో అమెరికారష్యా సహకార కార్యక్రమాలను ఈ బిల్లు మినహాయించింది. 'లిండ్సే ఓ. గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా చట్టం—2026' పేరుతో ప్రవేశపెట్టిన ఈ బిల్లు, లిండ్సే గ్రాహమ్ స్మారకార్థంగా రూపొందించారు. గతంలో ఇదే ప్రతిపాదనలో రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై '500 శాతం టారిఫ్' విధించాలని సూచించినప్పటికీ, తాజా బిల్లులో దానిని 100 శాతానికి తగ్గించారు. ఈ బిల్లు చట్టంగా మారితే, మరొక దేశ యుద్ధానికి ఆర్థిక సహాయం చేస్తున్న దేశాలను శిక్షించేందుకు టారిఫ్‌లను భౌగోళికరాజకీయ ఆయుధంగా ఉపయోగించేందుకు అమెరికా కాంగ్రెస్ స్పష్టంగా అధికారం ఇచ్చిన తొలి సందర్భంగా నిలుస్తుంది.

## జాతికి అంకితం (4వ పేజీ తరువాయి)

అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజల అవసరాలకు అనుగుణంగా రైల్వే మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నట్లు చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రారంభమైన 75 అమృత్ స్టేషన్లలో హైటెక్ సిటీ స్టేషన్ ఒకటిగా నిలవడం దక్షిణ మధ్య రైల్వేకు గర్వకారణమన్నారు.

## బతికే ఉంటా... (4వ పేజీ తరువాయి)

ప్రస్తుత బరువు 56.55 కిలోలు. ఆయన రక్తపోటు 108/68 ఎంఎం హెచ్‌జి, రక్తంలో చక్కెర స్థాయి 80 ఎంజి/ డిఎల్, నాడి వేగం నిమిషానికి 72 సార్లు, ఆక్సిజన్ స్థాయి 96 శాతంగా నమోదయ్యాయి. ఆయనలో స్వల్ప నిర్జలీకరణ (డీహైడ్రేషన్) లక్షణాలు కనిపించినప్పటికీ, మానసికంగా చురుకుగా ఉన్నారని వైద్యులు తెలిపారు. దీర్ఘకాలిక నిరాహార దీక్ష కారణంగా ఆయన ఆరోగ్యం క్లిష్ట దశకు చేరిందని, దీక్ష కొనసాగితే అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, తదుపరి దశ ఆందోళనకరంగా మారవచ్చని వైద్యులు గురువారం నాడు హెచ్చరించారు. అయితే, ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకుండా దీక్షను విరమించడం తప్పుడు సంకేతాన్ని పంపుతుందని పేర్కొంటూ వాంగ్‌చుక్ దీక్షను ఆపేందుకు నిరాకరించారు. 20న జరగబోయే పార్లమెంటు ర్యాలీని విజయవంతం చేయడంపైనే ఇప్పుడు దృష్టి సారించాలని ఆయన నొక్కి చెప్పారు. ఈ వ్యవహారం ఢిల్లీ హైకోర్టుకు కూడా చేరింది; వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని ప్రతి రోజూ పర్యవేక్షించాలని, ఒకవేళ ఆయన పరిస్థితి విషమిస్తే వైద్య సహాయం అందించాలని కోర్టు అధికారులను ఆదేశించింది.

## ఉద్యోగులకు భరోసా

(4వ పేజీ తరువాయి)

పనిచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే నిజమైన వారధులు ప్రభుత్వ ఉద్యోగులేనన్నారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మాతో కలిసి నూతన 'ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్''ను డిప్యూటీ సిఎం హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ డీడ్, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక భరోసాను, నమ్మకాన్ని కలిగిస్తూ, ఎలాంటి భయాందోళనలు లేని ఒక చక్కటి ఆరోగ్య భద్రతా వ్యవస్థను అందించాలనే సదుద్దేశంతోనే ప్రజా ప్రభుత్వం కొత్త 'ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'ను ప్రవేశపెట్టిందన్నారు. 'ఉద్యోగులు కూడా మన కుటుంబ' సభ్యులేనని, వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ సబ్ కమిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సుదీర్ఘంగా చర్చించి, పకడ్బందీ విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నామని, దీని ప్రతిరూపమే నూతన'' ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'' అని వివరించారు. సుమారు 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లతో పాటు వారిపై ఆధారపడిన 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 886 ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రుల ద్వారా ఉద్యోగులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఉచిత ఇన్‌పేషంట్ వైద్య సేవలు పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సిజిహెచ్ఎస్ ) ప్యాకేజీ రేట్లకు అనుగుణంగా 1,816 రకాల వైద్య, శస్త్ర చికిత్సలను ఈ పథకం కవర్ చేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు తమ ఆరోగ్య భద్రత కోసం సకల జనుల సమ్మెతో సహా ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం శూన్యమన్నారు.

**త్వరలో 24 వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు..మంత్రి దామోదర రాజనర్సింహ:** మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు.ప్రతి వెల్‌నెస్ సెంటర్‌ను గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్‌తో అనుసంధానిస్తామని, అక్కడ పనిచేసే స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్ వైద్యుల సేవలను వెల్‌నెస్ సెంటర్లలో అందుబాటులో తీసుకొస్తామన్నారు. గతంలో అమలులో ఉన్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌లో ప్యాకేజీ రేట్లు తక్కువగా ఉండటంతో అనేక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ భాగస్వామ్యం కావడం లేదన్నారు. నూతన పథకం ద్వారా రాష్ట్రంలోని మొత్తం 17,88,336 మంది లబ్ధిదారులకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామని, వీరిలో 4,38,594 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 3,61,955 మంది పెన్షనర్లు, సుమారు 9.88 లక్షల మంది కుటుంబ సభ్యులు ఉన్నారని ఆయన వివరించారు. ప్రతి పైసాను ఈహెచ్ఎస్ అమలు కోసమే వినియోగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, విద్యా శాఖ కార్యదర్శి యోగిత రాణా, జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్‌హర్ మహేష్ దత్ ఎక్కా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉద్యోగ సంఘాల నాయకులు ఏలూరి శ్రీనవాస్‌రావు, వి.లచ్చిరెడ్డి,మారంజగదీశ్వర్,జి. సదానందంగౌడ్, చావారవి,వంగ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యోగ సంఘాలు హర్షం:** ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను ప్రారంభించడం పట్ల ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ చైర్మన్ లచ్చిరెడ్డి,ఎస్‌టియు,టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సదానందం గౌడ్, ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు.దేవర కొండ సైదులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచయ్య,పెన్షనర్ల అసోసియేషన్ చైర్‌పర్సన్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆదర్శప్రాయమని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

## లేనట్టే..!

(4వ పేజీ తరువాయి)

ఉపసంహరించుకున్నారు. 'సంబంధిత వర్గాలతో మరిన్ని సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉందని సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏకగ్రీవంగా చెప్పింది' అని ప్యానెల్ చీఫ్ అపరాజితా సారంగి (బిజెపి) తెలియజేశారు. సమావేశానికి హాజరైన సభ్యులు మాట్లాడుతూ, రెండు సిఫార్సులపై ఓటింగ్ ఇప్పటికే పూర్తి అయ్యిందని, మూడవదానిపై చర్చలు జరుగుతుండగా ముసాయిదా నివేదిక ఆమోదాన్ని వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఆసక్తికరంగా, అధికార పార్టీకి చెందిన కొందరు సభ్యులు కూడా మొదటి రెండు సిఫార్సులకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అయినప్పటికీ ఇవి మెజారిటీ ఓట్లతో ఆమోదించబడ్డాయి.తీవ్రమైన నేరారోపణలపై ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులను వరుసగా 30రోజుల పాటు నిర్బంధిస్తే, న్యాయపరమైన విచారణ ఫలితం వెలువడే వరకూ వారిని శాశ్వతంగా పదవుల నుంచి తొలగించకుండా సస్పెండ్ చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. ఒకవేళ అలాంటి వ్యక్తులు నిర్దోషులుగా విడుదలైనా లేదా నిర్దిష్ట కాలపరిమితిలోగా విచారణ ముందుకు సాగకపోయినా నిర్ణయాన్ని స్వయంచాలకంగా రద్దు చేసే నిబంధనను కూడా కమిటీ ప్రతిపాదించింది. అవినీతిని అరికట్టడం, రాజకీయాలను నేరమయంగా కాకుండా నిరోధించడం అనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చిందని అపరాజితా సారంగి తెలియజేశారు. ఇది జాతీయ సమస్య అని, ఆలోచనలోనూ, భావవ్యక్తీకరణలోనూ ఏకాభిప్రాయం ఉండాలని, దేశానికి మేలు చేసే పని కోసం అన్ని పార్టీలు ఏకం కావాలని ఆమె అన్నారు. గత ఆగస్టులో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ప్రకారం ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలగని పక్షంలో వారిని నిర్బంధించిన 31వ రోజున స్వయంచాలకంగా పదవి నుంచి తొలగించవచ్చు. చాలా ప్రతిపక్ష పార్టీలు బిల్లును పరిశీలిస్తున్న కమిటీ నుంచి వైదొలిగాయి. డ్రాఫ్ట్ రిపోర్ట్ తీవ్రమైన నేరాలను కూడా నిర్వచించింది. ఈ పదం 5 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ జైలుశిక్ష విధించదగిన నేరాలను సూచించాలని పేర్కొంది. కోర్టులు నిర్దోషులుగా తేల్చిన వారికి, ఈ రక్షణ చర్య పున: నియామకాన్ని నిర్ధారిస్తుందని, వారి సస్పెన్షన్ శాశ్వతం కాదని ప్యానెల్ పేర్కొంది. ప్రభుత్వాన్ని జైలు నుండి నడపకుండా ఉండేలా చూడాలనే లక్ష్యంతో ఈ బిల్లును ప్రవేశపెట్టాయి. సిఫార్సులు ఆమోదం పొందితే, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదిత సవరణలతో కేంద్ర మంత్రివర్గాన్ని సంప్రదిస్తుంది. ఆ తర్వాత లోక్‌సభలో అధికారిక సవరణలను తీసుకువస్తుంది.

## పెత్తనం ఉండొద్దు

(4వ పేజీ తరువాయి)

రవాణాదారులు, విక్రేతల నుంచి మొదలుకొని ఎన్‌టిఎ, అత్యున్నత స్థాయిలో ఉన్న విద్యాశాఖ వరకు మొత్తం వ్యవస్థ ఇందులో భాగమైంది' అని ఆయన ఆరోపించారు. ఈ 'అవినీతిమయ వ్యవస్థ' కారణంగా పేపర్ లీకేజీ ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, దోషులపై ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని లేదా వారికి శిక్ష పడేలా చేయలేదని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. 'మన విద్యా సంస్థలు స్వతంత్రంగా ఉండాలి. ఏ రాజకీయ పార్టీ లేదా సంస్థకూ మన విద్యా సంస్థలపై పట్టు ఉండకూడదు. వైస్‌ఛాన్సలర్లు ఒక నిర్దిష్ట సంస్థకు చెందినవారై ఉండకూడదు, అలాగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) బాధ్యులు రాజకీయ సంస్థకు చెందినవారై ఉండకూడదు' అని ఆయన అన్నారు. పేపర్ లీకేజీలకు అడ్డుకట్ట వేయాలని, అన్ని పార్టీల మధ్య దీనిపై ఏకాభిప్రాయం కుదరవచ్చని, ఆ ఏకాభిప్రాయాన్ని అమలు చేయడం అందరి బాధ్యతన్నారు. దేశంలోని 9 కోట్ల మంది అభ్యర్థులలో, కేవలం 6 లక్షల మంది మాత్రమే వివిధ పరీక్షలలో విజయం సాధిస్తున్నారు, అంటే ప్రతి 150 మంది యువకులలో ఒకరు మాత్రమే విజయం రుచి చూస్తున్నారు' అని ఆయన పేర్కొన్నారు. దీంతో విద్యార్థుల ముందు కేవలం రెండు మార్గాలు మాత్రమే మిగిలి ఉన్నాయని, అవి ఒకటి నిజాయితీ, మరొకటి అవినీతి, ఇంకొకటి పేపర్ లీక్‌లు అని రాహుల్ అన్నారు. రెస్టారెంట్లలో ఆహార పదార్థాల మెనూ కార్డుల మాదిరిగానే, వివిధ పేపర్ల కోసం కూడా మెనూ కార్డులు ఉండేంతగా పేపర్ లీక్‌లు పెరిగిపోయాయని ఆయన పేర్కొన్నారు.

WANAPARTHY DISTRICT GAZETTE
EXTRAORDINARY
PUBLISHED BY AUTHORITY
WANAPARTHY

Gazette No. 43/2026 DATE: 06.07.2026
File No: G/484/2026

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (కేంద్ర చటం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) మరియు రాష్ట్ర రూల్ 25(1) నుసరించి)

ఫారం VI

ప్రాథమిక ప్రకటన

తెలంగాణ ప్రభుత్వానికి మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం /క్రింద land acquired for the purpose of MGKLIS - Minor - 15R on Kamaluddinpur Major on Ghanpur Branch canal from K.M 0.171 to K.M 2.512 వరకు భూమి **ఎకరములు 11-38 గుంటలు** వనపర్తి జిల్లాలో ఘనపూర్ మండలం లో గల తిరుమాలయిపల్లి గ్రామం పరిమితిలో అవసర
నిమిత్తం సేకరించనైనది పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు భూసేకరణ పునరుపాది పు .. చట్టం 2013 సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీ చేయనైంది. పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం వనపర్తి జిల్లా ఘనపూర్ మండలంలో గల తిరుమాలయిపల్లి గ్రామములో నిర్దేశించిన కొలతల ప్రకారం వచ్చిన విస్తీర్ణం **ఎకరములు 11-38 గుంటల** భూమి భూసేకరణ నిమిత్తం ఈ క్రింది చూపిన విధముగా కలదు.

షెడ్యూల్

గ్రామము: తిరుమాలయిపల్లి మండలం: ఘనపూర్ జిల్లా: వనపర్తి

| క్ర.సం. | సర్వే నం. | [illegible] | [illegible] | [illegible] | పట్టాదారు / అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు శ్రీ/శ్రీమతి/కుమారి | సరిహద్దులు ఉ | ద | తూ | ప |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | మెట్ట | పట్టా | 00.12 | బాల కాశన్న తండ్రి తిరుమలయ్య | 3 | 17 | 13 | 01 |
| 2 | 3 | మెట్ట | పట్టా | 00.11 1/2 | పానుగంటి మంగమ్మ భర్త రాములు | 06 | 02 | 04 | 303 |
| 3 | 3 | మెట్ట | పట్టా | 00.11 1/2 | పానుగంటి జానకమ్మ భర్త బుచ్చన్న | 06 | 02 | 04 | 303 |
| 4 | 3 | మెట్ట | పట్టా | 00.11 1/2 | బుడగ జంగం కర్రెన్న తండ్రి పెద్ద రాములు | 06 | 02 | 04 | 303 |
| 5 | 3 | మెట్ట | పట్టా | 00.11 1/2 | బుడగ జంగం అశోక్ తండ్రి పెద్ద రాములు | 06 | 02 | 04 | 303 |
| 6 | 6 | మెట్ట | పట్టా | 00.2 | బోగిని తిరుపతయ్య తండ్రి చిన్నతిరుమలయ్య | 07 | 03 | 05 | 303 |
| 7 | 7 | మెట్ట | పట్టా | 00.18 | బోగిని చిన్న వెంకటయ్య తండ్రి చిన్నతిరుమలయ్య | VB | 06, 05 | 08 | 303 |
| 8 | 13 | మెట్ట | పట్టా | 00.20 | మల్లు లక్ష్మీ నరసింహా రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | 04 | 14, 15 | 12 | 02 |
| 9 | 13 | మెట్ట | పట్టా | 00.15 | సి. సురేంద్ర కుమార్ తండ్రి బస్వ లింగం | 04 | 14, 15 | 12 | 02 |
| 10 | 13 | మెట్ట | పట్టా | 00.03 | ఎంపరాల మూర్తి తండ్రి పెంటయ్య | 04 | 14, 15 | 12 | 02 |
| 11 | 13 | మెట్ట | పట్టా | 00.03 | జంగం మన్నెమ్మ భర్త జంగం గోపాల్ | 04 | 14, 15 | 12 | 02 |
| 12 | 13 | మెట్ట | పట్టా | 00.02 | జంగం తిరుపతమ్మ భర్త తిరుపతయ్య | 04 | 14, 15 | 12 | 02 |
| 13 | 14 | మెట్ట | పట్టా | 00.14 | మొల్గర బాలమ్మ భర్త తిరుపతయ్య | 13 | 28 | 54 | 15 |
| 14 | 54 | మెట్ట | పట్టా | 00.23 | రాఘవేంద్ర తండ్రి మాసయ్య | 12 | 51 | 55 | 14 |
| 15 | 54 | మెట్ట | పట్టా | 00.07 | హరిజన పెంటమ్మ భర్త కాశన్న | 12 | 51 | 55 | 14 |
| 16 | 54 | మెట్ట | పట్టా | 00.10 | మొల్గూర పెద్ద బద్రయ్య తండ్రి చిన్న రామయ్య | 12 | 51 | 55 | 14 |
| 17 | 54 | మెట్ట | పట్టా | 00.09 | హరిజన మొల్గర పోశన్న తండ్రి చిన్న రామయ్య | 12 | 51 | 55 | 14 |
| 18 | 54 | మెట్ట | పట్టా | 00.05 | M.శేఖర్ తండ్రి మన్నేమయ్య | 12 | 51 | 55 | 14 |
| 19 | 54 | మెట్ట | పట్టా | 00.02 | హరిజన బుద్ధయ్య తండ్రి రామయ్య | 12 | 51 | 55 | 14 |
| 20 | 55 | మెట్ట | పట్టా | 00.13 | యాపచెట్టు ఈశ్వరయ్య తండ్రి పెద్ద బాలయ్య | 12 | 53 | 56 | 54 |
| 21 | 55 | మెట్ట | పట్టా | 00.13 | యాపచెట్టు రాఘవేంద్ర తండ్రి నరసింహులు | 12 | 53 | 56 | 54 |
| 22 | 56 | మెట్ట | పట్టా | 00.12 | కుర్వ మణెమ్మ భర్త నడిపి నాగన్న | 12 | 71 | 57, 69 | 55 |
| 23 | 56 | మెట్ట | పట్టా | 00.08 | సబావత్ కిషన్ తండ్రి అము | 12 | 71 | 57, 69 | 55 |
| 24 | 56 | మెట్ట | పట్టా | 00.07 1/2 | సబావత్ దేవ్లా తండ్రి అము | 12 | 71 | 57, 69 | 55 |
| 25 | 56 | మెట్ట | పట్టా | 00.07 1/2 | సబావత్ శంకర్ తండ్రి అము | 12 | 71 | 57, 69 | 55 |
| 26 | 56 | మెట్ట | పట్టా | 00.07 1/2 | సబావత్ మాన్య తండ్రి అము | 12 | 71 | 57, 69 | 55 |
| 27 | 56 | మెట్ట | పట్టా | 00.07 1/2 | సబావత్ బిక్యా తండ్రి అము | 12 | 71 | 57, 69 | 55 |
| 28 | 56 | మెట్ట | పట్టా | 00.02 | రోడ్ | 12 | 71 | 57, 69 | 55 |
| 29 | 71 | మెట్ట | పట్టా | 00.07 1/2 | కుర్వ మణెమ్మ భర్త నడిపి నాగన్న | 56 | 73 | 70 | 53 |
| 30 | 71 | మెట్ట | పట్టా | 00.07 1/2 | చిన్న నాగయ్య తండ్రి కర్రె బీరయ్య | 56 | 73 | 70 | 53 |
| 31 | 71 | మెట్ట | పట్టా | 00.07 1/2 | కుర్వ జాక్క మన్నెమ్మ భర్త చిన్న యెల్లయ్య | 56 | 73 | 70 | 53 |
| 32 | 71 | మెట్ట | పట్టా | 00.07 1/2 | చింతల వెంకటయ్య తండ్రి చిన్న బుచ్చన్న | 56 | 73 | 70 | 53 |
| 33 | 71 | మెట్ట | పట్టా | 00.14 | మన్నెమ్మ భర్త లక్ష్మా రెడ్డి | 56 | 73 | 70 | 53 |
| 34 | 73 | మెట్ట | పట్టా | 00.30 | సబావత్ రవి తండ్రి హర్యా | 71 | 74 | 74 | 48 |
| 35 | 73 | మెట్ట | పట్టా | 00.10 | C. సురేందర్ కుమార్ తండ్రి బసవ లింగం | 71 | 74 | 74 | 48 |
| 36 | 73 | మెట్ట | పట్టా | 00.10 | ముంత చంద్రశేకర్ తండ్రి M. మల్లయ్య | 71 | 74 | 74 | 48 |
| 37 | 74 | మెట్ట | పట్టా | 00.15 | కేశిరెడ్డి సత్యశీల రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | 73 | 81 | 78 | 48 |
| 38 | 74 | మెట్ట | పట్టా | 01.00 | కేశిరెడ్డి మురలీధర్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | 73 | 81 | 78 | 48 |
| 39 | 78 | మెట్ట | పట్టా | 00.04 | మొల్గార మన్నెమయ్య తండ్రి పెద్ద నరసయ్య | 77 | 79 | VB | 80, 82 |
| 40 | 78 | మెట్ట | పట్టా | 00.20 | రాములు తండ్రి చిన్న నరసన్న | 77 | 79 | VB | 80, 82 |
| 41 | 79 | మెట్ట | పట్టా | 00.10 | K.చందర్ తండ్రి పూర్య | 78 | VB | VB | 80, 82 |
| 42 | 79 | మెట్ట | పట్టా | 00.06 | లంబాడి మంగమ్మ భర్త గోపాల్ | 78 | VB | VB | 80, 82 |
| మొత్తం విస్తీర్ణం (ఎ-గుం.లు) | | | | 11.38 | | | | | |

| చెట్లు & ఇతరాలు | |
|---|---|
| సర్వే నెం. 73 | (35) మామిడి చెట్లు |

'భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013 (కేంద్ర చట్టం సంఖ్య 30/2013)' మరియు సెక్షన్-II (1) ప్రకారం లభించిన మినహాయింపునకు అనుగుణంగా, సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించే ఉద్దేశంతో ఈ ప్రకటన జారీ చేయబడింది.

పని సమయములో ఏదైనా పని రోజున జిల్లా కలెక్టర్, వనపర్తి, భూ సేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, యల్.ఎ. ఆర్.యల్.ఐ.పి.11 పెబ్బైర్ కార్యాలయంలో భూమి యొక్క ప్రణాళికను పరిశీలించవచ్చు.

తెలంగాణ ప్రభుత్వం తగిన ప్రభుత్వం ఆఫీసర్ - కమ్ - కలెక్టర్ / భూ సేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, యల్.ఎ. ఆర్.యల్.ఐ.పి. పెబ్బైర్ వద్ద మరియు అతని సిబ్బందికి భూమిపైకి ప్రవేశించడానికి మరియు భూమిని ప్రవేశపెట్టడానికి, ఏదైనా భూమిని తీసుకోవటానికి, త్రవ్వటానికి అధికారం ఇవ్వడానికి సంతోషిస్తున్నాము మరియు చెప్పిన చట్టంలోని సెక్షన్ 12 అమలు చెయ్యడానికి పేర్కొన్న విధంగా వారి పనిని సరిగ్గా అవసరమైన అన్ని చర్యలను చెయ్యండి.

చట్టం యొక్క సెక్షన్ 11(4) ప్రకారం, ఏ వ్యక్తి ఎటువంటి లావాదేవీలు చేయకూడదు లేదా భూమి యొక్క ఏదైనా లావాదేవీకి కారణం కాదు, అమ్మకం డదు లేదా ముందస్తు అనుమతి కొనుగోలు మొదలైనవి చేయకూ / లేకుండా అటువంటి నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి అటువంటి భూమిపై ఏదైనా ఆక్రమణలను సృష్టించకూడదు.

అధీకృత అధికారి చట్టం యొక్క ఏదైనా ఉంటే సముపార్జనకు అభ్యంతరాలు, మరియు వారి భూముల పరిష్కారం కోసం ఆసక్తి ఉన్న డి వచ్చిన వాదనలు ప్రభావితమైన వ్యక్తుల నుండి / ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై రోజులు కింద భూసేకరణ 15లోపు భూమిపై ఆసక్తి ఉన్న వ్యక్తి భూసేకరణ చట్టంలోని సెక్షన్) అధికారికి తెలియజేయగలరు .

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ ఆర్.ఎల్.ఐ. ఎస్.పి., యూనిట్-2 పెబ్బైర్
సం/- అదనపు కలెక్టర్, వనపర్తి
సం/- జిల్లా కలెక్టర్, వనపర్తి

DIPR RO NO. 502/LA/PP/Advt/Pub/2026-27


## సిఇసి జ్ఞానేష్ కుమార్

# 'సర్'లో 'భారీ విధ్వంసక ఆయుధం'

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శ




**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ మండిపడింది. దేశంలో ఓటర్ల జాబితాల విషయంలో జ్ఞానేష్ కుమార్ ఒక 'సంపూర్ణ విధ్వంసక ఆయుధం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సంఘం అధిపతిగా ఆయనను తొలగించాలని ప్రతిపక్షాలు ఒత్తిడి చేస్తాయని కూడా ఆయన పేర్కొన్నారు. కుమార్‌ను తొలగించాలని కోరుతూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు ఏప్రిల్ 24న రాజ్యసభలో ఒక కొత్త నోటీసును సమర్పించాయి. అయితే ఈ నోటిసుపై చర్య తీసుకోవాలని ప్రతిపక్షాలు ఒత్తిడి చేస్తాయా ప్రశ్నించగా, రమేశ్ పిటిఐతో మాట్లాడుతూ 'దానిపై మేమేమీ వినలేదు. కచ్చితంగా, మేము ఒత్తిడి చేయాలి. ఓటర్ల జాబితాల విషయంలో ఆయన ఒక సంపూర్ణ విధ్వంసక ఆయుధం' అని పేర్కొన్నారు. 'జ్ఞానేష్ కుమార్‌పై అత్యంత తీవ్రమైన ఆరోపణ ఒక సీనియర్ ఐఎఎస్ అధికారి నుండి వచ్చింది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియాకు మొదటి డైరెక్టర్ జనరల్‌గా పనిచేసి, సాంస్కృతికంగా చాలా ముఖ్యమైన పేరున్న రామ్ సేవక్ శర్మ. ఈ మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంత నష్టదాయకంగా, వినాశకరంగా మారిందో వివరిస్తూ ఆయన ఒక వ్యాసం రాశారు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. అందువల్ల ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ చెబుతున్నది లేదా తృణమూల్ కాంగ్రెస్ చెబుతున్నది మాత్రమే కాదు అని రమేశ్ అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని కోరుతూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి ప్రతిపక్ష పార్టీలు ఏప్రిల్ 24న ఒక నోటీసును సమర్పించాయని ఆయన గుర్తు చేశారు. జ్ఞానేష్ కుమార్ కేవలం హోంమంత్రి (అమిత్ షా) చెప్పిన పనిని మాత్రమే చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20న ప్రారంభమై ఆగస్టు 13న ముగియనున్నాయి.

## డీలిమిటేషన్‌పై బిల్లుపై

# మెరిట్స్ ఆధారంగా నిర్ణయం

### డిఎంకె వర్గాలు వెల్లడి

**చెన్నై :** పార్లమెంటులో ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లు ప్రవేశపెట్టినప్పుడు దానిని పరిశీలించి, తమిళనాడు ప్రయోజనాలను కాపాడేందుకు అనుగుణంగా 'అంశాల యథార్థత' (మెరిట్స్) ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని డిఎంకె శుక్రవారం తెలిపింది. ఆ బిల్లు పరిధి, లక్ష్యాలు వెల్లడైన వెంటనే, వాటిని విశ్లేషించి నిర్ణయం తీసుకుంటామని పార్టీ వర్గాలు పిటిఐకి తెలిపాయి. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించే విషయంలో డిఎంకె స్వతంత్రంగా, ఆయా అంశాల యథార్థత ఆధారంగా నిర్ణయం తీసుకుంటుందని, ఈ ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లు ఇతర సంబంధిత చట్టాల సమూహంలో భాగంగా కాకుండా, ఒక ప్రత్యేక చట్టంగా ఉండే అవకాశం ఉందని పార్టీకి సమాచారం అందిందని వర్గాలు పేర్కొన్నాయి. సీట్ల సంఖ్యను 50 శాతం పెంచడం, రాష్ట్రాల మధ్య ప్రస్తుత సీట్ల పంపిణీ నిష్పత్తిని యథాతథంగా కొనసాగించడం వంటి అంశాలు చర్చలో ఉన్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. 16న జరిగిన పార్టీ ఎంపిల సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలలో డీలిమిటేషన్ కూడా ఒకటి. లండన్‌లో ఉన్న డిఎంకె అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. గతంలో ప్రతిపాదించిన డీలిమిటేషన్ ప్రక్రియను డిఎంకె తీవ్రంగా వ్యతిరేకించింది. దీనికి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో పార్లమెంటులో వీగిపోయింది. అయితే తమిళనాడులో డిఎంకె అధికారాన్ని కోల్పోయిన తర్వాత, ఆ పార్టీ దీర్ఘకాల మిత్రపక్షమైన కాంగ్రెస్ పార్టీ డిఎంకెను వదిలి టివికె కూటమి వైపు వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో డిఎంకె డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీని సంప్రదించకుండా స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటుందని వర్గాలు సూచించాయి. రాష్ట్ర హక్కులను కాపాడటానికి, రాజ్యాంగం గౌరవం, విలువలను నిలబెట్టడానికి తమిళనాడు ప్రజల భావాలను ప్రతిబింబించేలా పార్టీ ఎంపిల గళం పార్లమెంటులో వినిపిస్తుందని డిఎంకె అధికార పత్రిక 'మురసోలి' శుక్రవారం పేర్కొంది.




# ఎల్‌డిఎఫ్‌లో ఓటింగ్ ద్వారా నిర్ణయాలు సరికాదు

### కూటమిలో సత్సంబంధాలు కొనసాగించేందుకు సిపిఐ ప్రయత్నిస్తుంది : బినోయ్ విశ్వం



**తిరువనంతపురం :** కేరళలోని ఎల్‌డిఎఫ్ కూటమిలో ఎప్పుడూ సత్సంబంధాలను కొనసాగించేందుకే తమ పార్టీ ప్రయత్నించిందని, అయితే ఓట్ల లెక్కింపు లేదా సంఖ్యాబలం ఆధారంగా వామపక్ష కూటమిలో నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని ఆ రాష్ట్ర సిపిఐ రాష్ట్ర కార్యదరి బినోయ్ విశ్వం అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష ఉప నాయకుడు పదవిని సిపిఐకి దక్కకుండా చేసేందుకు సిపిఐ(ఎం) ఇతర కూటమి భాగస్వాముల మద్దతు కోరుతోందన్న వార్తల నేపథ్యంలో బినోయ్ విశ్వం శుక్రవారం స్పందించారు. 'ఎల్‌డిఎఫ్‌లో విషయాలను ఓటింగ్ ప్రక్రియ లేదా సభ్యుల సంఖ్య ఆధారంగా నిర్ణయించడం ఆరోగ్యకరమైన లేదా సరైన విధానం కాదు. దానికి బదులుగా, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం మంచిది' అని ఆయన పేర్కొన్నారు. డిప్యూటీ ప్రతిపక్ష నాయకుడి పదవి విషయంలో తమ పార్టీ మొండిగా వ్యవహరించడం లేదని, అలాగే తమ అత్యంత సన్నిహిత మిత్రపక్షం అయిన సిపిఐ(ఎం)పై ఎటువంటి నిందలు వేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై అడిగిన ప్రశ్నలకు సమాధానంగా, చర్చల కోసం సిపిఐ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. వామపక్ష కూటమిలో ఐక్యత ప్రాముఖ్యతను సిపిఐ గుర్తిస్తుందని, ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఎల్‌డిఎఫ్‌ను ముందుకు తీసుకెళ్లడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తుందన్నారు. 'మేము ఎటువంటి వివాదాన్ని సృష్టించాలనుకోవడం లేదు, కానీ మాకంటూ ఒక వైఖరి ఉంది. ఆ విషయం అందరికీ తెలిసిందే' అని ఆయన అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ఓటమి తర్వాత సిపిఐ అసెంబ్లీలో ప్రతిపక్ష ఉప నాయకుడు పదవిని డిమాండ్ చేస్తూ వస్తోంది, అయితే సిపిఐ(ఎం) ఆ డిమాండ్‌ను అంగీకరించలేదు. ఈ పదవి తమ పార్టీకి దక్కాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా గురువారం నాడు పేర్కొన్నారు. ఎల్‌డిఎఫ్‌లో ఒక ముఖ్యమైన భాగస్వామిగా ఉన్నందున, ప్రతిపక్షంలో మరింత క్రియాశీల పాత్ర పోషించాలనుకుంటున్నందున సిపిఐ ఈ పదవిని కోరుతోందని ఆయన చెప్పారు. అలాగే, ఎడిజిపి (శాంతిభద్రతలు) పదవిని చేపట్టడానికి ఐపిఎస్ అధికారి ఎం.ఆర్. అజిత్‌కుమార్ అర్హుడు కాదన్న సిపిఐ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని విలేకరులతో మాట్లాడుతూ విశ్వం స్పష్టం చేశారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయని, ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ నాయకులతో ఆయన జరిపిన రెండు సమావేశాలు, 2024లో త్రిస్సూర్ పూరం ఉత్సవాలకు ఆటంకం కలిగించడంలో ఆయన ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు రావడం ప్రధాన కారణాలని ఆయన పేర్కొన్నారు.

## ఎపి రాజధానిలోనూ సిఆర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం



**విజయవాడ :** హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో 5 ఎకరాల విస్తీర్ణంలో చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించబడిన వృద్ధాశ్రమం దేశంలోనే ఆదర్శప్రాయమైన వృద్ధుల సేవా కేంద్రంగా నిలిచిందని ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డా. కె. నారాయణ అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో, మానవీయ విలువలతో నిర్వహించబడుతున్న ఈ వృద్ధాశ్రమం అనేకమందికి ఆశ్రయం, ఆదరణ కల్పిస్తోందన్నారు. అయితే రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో సిఆర్ ఫౌండేషన్ సేవా సంస్థ లేకపోవడం ఒక వెలితిగా భావించామని, ఈ నేపథ్యంలో ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి రాజధాని ప్రాంతంలో ఫౌండేషన్‌కు భూమి కేటాయించాలని విజ్ఞప్తి చేశామని డాక్టర్ కె. నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి, సంబంధిత మంత్రి నారాయణను అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని చెప్పారు. ఈ ప్రక్రియ త్వరలో సాకారమై ఎపి రాజధాని ప్రాంతంలో కూడా చంద్ర రాజేశ్వరరావు ఆశయాలకు అనుగుణంగా వృద్ధుల సేవా కార్యక్రమాలు విస్తరించనున్నాయని ఆశిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి సిఆర్ ఫౌండేషన్ కార్యకలాపాలు, వృద్ధాశ్రమాల విస్తరణ ప్రణాళికలు, ఆంధ్రప్రదేశ్‌లో కొత్త వృద్ధాశ్రమాల స్థాపనపై వివరాలు అందజేశామని చెప్పారు.

## నిరసనకారుల డిమాండ్లు వినడం ప్రభుత్వాల విధి

### కాంగ్రెస్ నేత పవన్ ఖేరా

**న్యూఢిల్లీ :** ప్రజల సమస్యలపై పౌరులు దీక్షలు చేస్తున్నప్పుడు వారి డిమాండ్లు వినడం ప్రభుత్వాల విధి అని కాంగ్రెస్ పేర్కొంది. కానీ ఈ ప్రభుత్వం ఉదాసీనతను ఎంచుకుందని మండిపడింది. పరీక్షలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఇక్కడ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, బొద్దింక జనతా పార్టీ (సిజెపి)కి చెందిన ఇతర సభ్యులకు కాంగ్రెస్ శుక్రవారం సంఘీభావం తెలిపింది. ప్రభుత్వానికి దాని 'రాజధర్మాన్ని' గుర్తుచేసింది. కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా నిరసన ప్రదేశంలో వాంగ్‌చుక్, ఇతర సిజెపి సభ్యులను కలిశారు. పౌరులు నిరసన తెలిపినప్పుడు వారి మాట వినడం ప్రభుత్వ విధి అని ఆయన అన్నారు. వాంగ్‌చుక్, నిరసన చేస్తున్న యువత మాట వినకుండా ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరి ప్రజాస్వామ్యానికి తగని అహంకారాన్ని ప్రదర్శిస్తోందని ఖేరా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సోనమ్ వాంగ్‌చుక్, నిరసనకారులను ఆరోగ్యం క్షీణిస్తున్న దృష్ట్యా నిరాహార దీక్షను విరమించుకోవాలని వారిని కోరానన్నారు. ప్రజలను కోల్పోవడం వల్ల ఉద్యమం బలపడదని, మరో రోజు పోరాడటానికి బతికే ఉండాలని ఖేరా ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన అనేది రాజ్యాంగ హక్కు అని ఆయన అన్నారు. 'తమ వాణిని వినిపించాలని పౌరులు నిరాహార దీక్ష చేపట్టినప్పుడు, ప్రభుత్వం వారి మాట వినాలి, చూసీచూడనట్లు వదిలేయకూడదు. అదే రాజధర్మం' అని ఖేరా అన్నారు. '1984లో ఇందిరా గాంధీజీ చేసింది అదే. 2011లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వం చేసింది కూడా అదే. విభేదాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వ మొదటి బాధ్యత ప్రజలతో మమేకమవ్వడమేనని వారు అర్థం చేసుకున్నారు' అని ఆయన తెలిపారు. ఇటువంటి ఉదాసీనత కేవలం అహంకారమే కాదు, అది కఠినమైనది, ప్రజాస్వామ్యానికి ఏమాత్రం తగనిదని ఖేరా అన్నారు.

## రామమందిరం విరాళాల చోరీపై

# 20న సిట్ మధ్యంతర నివేదిక



లక్నో : రామ మందిరంలో విరాళాల చోరీ ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సోమవారం మధ్యంతర నివేదికను సమర్పించే అవకాశం ఉందని శుక్రవారం వర్గాలు తెలిపాయి. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందిన విరాళాలకు సంబంధించిన ఆర్థిక అవకతవకలపై దర్యాప్తును పూర్తి చేయడానికి సిట్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని మరింత సమయం కోరే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. విరాళాల చోరీఆరోపణలపై నిష్పక్షపాతంగా, కాలపరిమితితో కూడిన దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతూ, దర్యాప్తు స్థితిపై నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు సిట్‌ను ఆదేశించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్, ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కిరణ్ ఎస్, ప్రత్యేక కార్యదర్శి (ఆర్థిక) నీల్ రతన్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల సిట్ బృందాన్ని, ట్రస్ట్ అభ్యర్థన మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ఏర్పాటు చేసింది. దర్యాప్తును పూర్తి చేయడానికి మొదట 15 రోజుల గడువు ఇచ్చారు, కానీ ఆ తర్వాత దాని గడువును మరో 15 రోజులు పొడిగించారు. జూన్ 23న సిట్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన తొమ్మిది పేజీల ప్రాథమిక నివేదిక, ఎఫ్ఐఆర్ నమోదు, ఎనిమిది మంది నిందితుల అరెస్టు, ఆలయ విరాళాల నుండి అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు ఉన్న నగదును స్వాధీనం చేసుకోవడం, మాజీ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రాల రాజీనామాలతో సహా పలు చర్యలకు దారితీసింది. తుది నివేదిక ఆలయ పరిపాలన, విరాళాల లెక్కింపు వ్యవస్థలో సంస్కరణలను సిఫార్సు చేస్తుందని భావిస్తున్నారు. ఈ నివేదికలోని అంశాలు, సాధ్యమయ్యే దిద్దుబాటు చర్యలపై చర్చించడానికి ట్రస్ట్ జులై 22న అయోధ్యలో సమావేశం కానుంది. ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై కోర్టు పర్యవేక్షణలో సిబిఐ దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆడిట్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆడిట్ కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే సిట్ తన విచారణను ప్రారంభించిన తీరును పిటిషనర్లు ప్రశ్నించడంతో పాటు, ఆరోపిత దుర్వినియోగంపై కాలపరిమితితో కూడిన దర్యాప్తు జరపాలని కోరారు.

## 'నీట్' టాపర్లు

# ఆర్యన్‌గుప్తా, ప్రన్షుల్ భన్సాల్

### హనుమకొండ విద్యార్థి సహ్యాకు ఆల్ ఇండియా 13వ ర్యాంకు



**న్యూఢిల్లీ :** నీట్ యుజి రీ టెస్ట్ – 2026 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గురువారం రాత్రి విడుదల చేసింది. అందులో 19 మంది విద్యార్థులు 720 మార్కులకుగానూ 700 మార్కులు సాధించారు. పంజాబ్‌కు చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానాకు చెందిన ప్రన్షుల్ భన్సాల్ 715 మార్కులు సాధించి ఈ పరీక్షలో టాపర్లుగా నిలిచారు. ఫలితాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా సత్తా చాటారు. తెలంగాణకు చెందిన హనుమకొండ విద్యార్థి వీరయ్యగారి సహ్యా 720 మార్కులకు గాను 705 మార్కులు సాధించి ఆల్ ఇండియా 13వ ర్యాంకు దక్కించుకున్నారు. బూర సాయిచరణ్ 19వ ర్యాంకు, కందగట్ల అనిష్ 21వ ర్యాంకుతో నిలిచారు. ఇక ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నామాల ప్రేరణ ఆల్ ఇండియా 36వ ర్యాంకు, గ్రంధి హనీష్ 74వ ర్యాంకు సాధించి తెలుగు రాష్ట్రాలకు గుర్తింపు తీసుకొచ్చారని ఎన్‌టిఎ వెల్లడించింది. కాగా, 1492 మంది విద్యార్థులు 650పైగా మార్కులు పొందారు. 10,160 మందికి 600 అంతకంటే ఎక్కువ, 90,780 మందికి 500+ మార్కులు వచ్చాయి. గతనెల 21న నీట్ రీ ఎగ్జామ్ జరిగింది. 20 లక్షలకుపైగా విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 11.21 మంది అడ్మిషన్లకు అర్హత సాధించినట్లు ఎన్‌టిఎ వెల్లడించింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. అయితే అర్హత సాధించిన వారిలో 58 శాతానికి పైగా అమ్మాయిలే ఉన్నారు. అయితే ఈ ఫలితాలు సకాలంలోనే విడుదలవ్వడంతో అభ్యర్థుల వైద్య కోర్సుల అడ్మిషన్లు, కౌన్సెలింగ్‌కు సంబంధించిన షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది.

**మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ**

ఇదిలా ఉండగా ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసిసి) నిర్వహించనుండగా, రాష్ట్ర కోటా సీట్ల కౌన్సెలింగ్‌ను ఆయా రాష్ట్రాల కౌన్సెలింగ్ సంస్థలు చేపట్టనున్నాయని నీట్ తెలిపింది. అభ్యర్థుల స్కోర్ కార్డులు, టాపర్ల జాబితా, కటాఫ్ మార్కులను కూడా విడుదల చేసినట్లు వెల్లడించింది. ఫైనల్ ఆన్సర్ కీని ఎన్‌టిఎ విడుదల చేసిన కొద్ది గంటల్లోనే ఫలితాలను ప్రకటించింది. ఈ ఏడాది నీట్ పరీక్షలో 139 మంది విద్యార్థులు 720 మార్కులకు గాను 690కు పైగా స్కోరు సాధించారు. వీరిలో 93 శాతం మంది తొలిసారిగా నీట్ రాసిన అభ్యర్థులే. అలాగే, ఈ టాప్ స్కోరర్లు దేశంలోని 66 నగరాల నుంచి రావడం విశేషం. ఈ ఏడాది మే 3న తొలుత నీట్ యూజీ పరీక్ష నిర్వహించారు. అయితే ప్రశ్నపత్రం లీక్ అవ్వడంతో ఆ పరీక్షను ఎన్‌టిఎ రద్దు చేసింది. మళ్లీ జూన్ 21న దేశ వ్యాప్తంగా రీఎగ్జామ్ నిర్వహించింది. ఈ పరీక్షకు 20 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే ఈ పరీక్షకు సంబంధించి జులై 13న ఎన్‌టిఎ ఎఆర్ షీట్లు విడుదల చేసింది. గురువారం ఫైనల్ కీ వెబ్‌సైట్‌లో ఉంచింది. ఆ తర్వాత కొద్ది గంటల్లోనే ఫలితాలు వెల్లడించింది.

# భారీ ఉగ్రకుట్ర భగ్నం

### ఐదుగురు జైషే మహమ్మద్ టెర్రరిస్టులు అరెస్టు

**అహ్మదాబాద్:** పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌కు చెందిన ఐదుగురు ముష్కరులను గుజరాత్ ఎటిఎస్ అధికారులు అరెస్టు చేశారు. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో వీరందరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్డియాగా గుర్తించారు. నిందితులను మెహసానా జిల్లాలోని జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా ముందు గుజరాత్ ఎటిఎస్ అధికారులు హాజరుపర్చారు. ఈ ఐదుగురిని ఈనెల 24 వరకు గుజరాత్ ఎటిఎస్ కస్టడీకి ఆర్.ఎం భాటియా అప్పగించారు. గుజరాత్‌లో ఉగ్ర నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు యత్నిస్తూ ఈనెల 3న ఎటిఎస్ చేతికి 8 మంది ఉగ్రవాదులు చిక్కారు. ఆ ఎనిమిది మంది ముష్కరులను విచారించగా ఈ ఐదుగురి పేర్లు బయటకొచ్చాయి. నిందితుల్లో ఒకరు క్రూడ్ టైమ్ బాంబును తయారు చేసి, దాన్ని పరీక్షించేందుకు విఫలయత్నం చేసినట్లు గుజరాత్ ఎటిఎస్ అధికారులు తెలిపారు. ముందుగా అరెస్టైన ఎనిమిది మందిలోని ఒకరు ముష్కరుడు ఈ ముఠాకు బాంబు తయారీ సామగ్రిని అందించినట్లు గుర్తించామని వెల్లడించారు. జైషే మహ్మద్ తన ఉగ్ర కార్యకలాపాలను మరింతగా వ్యాప్తి చేయడానికి గుజరాత్‌లో ఒక క్రియాశీల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు నిందితులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నిందితులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా)లోని సెక్షన్లు 13, 17, 18, 38, 39, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 148, 61 కింద కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు. అరెస్టైన ఐదుగురిలో ఒకరు టైమ్ బాంబును తయారు చేయడానికి ప్రయత్నించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిఆర్ దంతానీ కోర్టుకు తెలిపారు. అందుకే నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించాలని ఎటిఎస్ కోరుతోందని చెప్పారు. బాంబు తయారీ సామగ్రి, ఉర్దూ భాషలో ఉన్న జైషే మహ్మద్ ప్రచార సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉందని అన్నారు. నిందితులు ఒక సాధారణ టైమ్ బాంబును పరీక్షించడానికి ప్రయత్నించారని, అయితే ఆ ప్రయత్నం విఫలమైందని వెల్లడించారు. వారు బాంబు తయారీ సామగ్రిని ఎక్కడ సేకరించారు? దానిని ఎక్కడ దాచిపెట్టారు? జైషే మహ్మద్ పుస్తకాలను నిందితులు ఎలా పొందారు? అనే అంశాలపై ఏటీఎస్ దర్యాప్తు చేస్తోందన్నారు.


IN THE COURT OF THE HON'BLE PRL. DISTRCT AND SESSION JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR

Crl. M.P.No. 58 of 2026
In
Crl.Appeal No. of 2026
(Crl. Appeal SR No. 3782 of 2023)

Between:-
K. Madhava Reddy ...Petitioner/Appellant
Vs
P. Rajendra Kumar & others ...Respondents/Respondents

To
R2. P. Venkat Reddy, S/o.P. Tatabai Reddy, Aged 65 years, Occ: Business, R/o. Flat No. 202, Rajeshwari Nilayam, Indian Airlines Colony, Thirumalagiri, Secunderabad.
R3. P. Devalakshmi, W/o. P. Venkat Reddy, Aged 60 years, Occ: Housewife, R/o. Flat No. 202, Rajeshwari Nilayam, Indian Airlines Colony, Thirumalagiri, Secunderabad.
(R-1 is not necessary party in this petition/appeal)

Please take notice that the above-named Petitioner/Appellant has filed Crl. Appeal SR No. 3782/2023 originally against both of you and your son P. Rajendra Kumar and a Crl. MP.No. 58/2026 to condone the delay in resubmitting the Crl. Appeal. The said Crl. MP.No. 58/2026 stands posted to 11-08-2026 for your appearance, for the reason the notices sent by the Hon'ble Court returned and permitting the Petitioner/Appellant to take out substitute service of publication the notice in daily news paper on filing the petition.

Therefore, Pleasetake notice in Crl.M.P.No.58 of 2026 and appear before the Hon'ble Court on **11-08-2026** before the Hon'ble PRL. District and Session Judge, R.R. District at: L.B.Nagar at **10-30 A.M.** either in person or through an Advocate. Otherwise, the matter will be heard and decided in your absenceas per the material available on record.

(ISSUED UNDER THE ORDERS OF THE HON'BLE PRL. DIST. DIST. AND SESSIONS JUDGE, R.R. DISTRICT, AT : L.B.NAGAR)

P. SARITHA,
D.K.MURTHY
Advocates
Off: Flat No.2103, My Home Raka, Madinaguda, Serilingampally, Ranga Reddy District-49.
Mob: +91 80999 05353



తెలంగాణ ప్రభుత్వం
పంచాయత్‌రాజ్ ఇంజనీరింగ్ శాఖ
జిల్లా పి.ఆర్. ఇంజనీర్ కార్యాలయం, పిఐయు ఖమ్మం.

ఈ దిగువ సంతకందారుచే DMFT, CRR(SCP), SDF-2023-24 & MPLADS (LS)-2024-25 పథకము కింద మంజూరైన 08 అభివృద్ధి పనులకు గాను అంచనా విలువ రూ. 63.35 లక్షలు ఆన్‌లైన్ టెండర్స్ రిజిస్టర్డ్ కాంట్రాక్టర్స్ నుండి పిలువబడుతున్నవి. **NIT No. 01/2026-27 To 04/2026-27 (1st Call), 05/2026-27 To 07/2026-27 (2nd Call) & 08/2026-27 (6th Call).** ECV, EMD ఇతర వివరములు, https://tender.telangana.gov.in/ నందు ది:20.07.2026 నుండి లభించును. భవిష్యత్తులో ఏవైనా సవరణలు, నిబంధనలలో మార్పులు వున్నచో వెబ్‌సైట్ నందు మాత్రమే ప్రచురించబడును.

సం/- జిల్లా పి.ఆర్. ఇంజనీర్, పిఐయు ఖమ్మం.

DIPR R.O. No. : 6211-PP/CL/ADVT/2026-27, Date: 17-07-2026

## కల్తీ నెయ్యి తయారీలపై దాడులు..

# 850 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం

- డాక్టర్ సంగీత సత్యనారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేపట్టింది. రెండు రోజుల పాటు పోలీసుల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఫుడ్ సేఫ్టీ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు. కొన్ని లైసెన్స్ పొందిన సంస్థలు తయారు చేసిన నెయ్యిలో ఇతర కొవ్వులు కలిపినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారని, మరికొన్ని సంస్థలు ఎలాంటి లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండానే నెయ్యి తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించామని సంగీత సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా సంస్థల నుంచి సేకరించిన నెయ్యి నమూనాలు పరీక్షల నిమ్మితం పంపించామని, పరీక్షల ఫలితాల ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్ట్స్ రెగ్యులేషన్స్ ప్రకారం నెయ్యిలో 99.5 శాతం పాల కొవ్వు ఉండాలని, తేమ శాతం 0.5 శాతానికి మించకూడదని, నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి వృక్షజన్య కొవ్వులను కలపడం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం 2006 ప్రకారం నిషేదమని ఆమె వివరించారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 14 సంస్థల్లో తనిఖీలు చేపట్టగా, 15 నెయ్యి శాంపిల్స్‌ను సేకరించగా, వినియోగానికి పనికిరాదని గుర్తించిన 60 కిలోల నెయ్యి అక్కడికక్కడే ధ్వంసం చేసినట్టు వివరించారు. 850 కిలోల అనుమానాస్పద కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఉత్పత్తులను ప్రయోగశాల నివేదికలు వచ్చే వరకు భద్రపరిచి, నివేదికల్లో కల్తీ నిర్ధారనైతే సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యానారాయణ స్పష్టం చేశారు. వివిధ జిల్లాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 65 సంస్థలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లను పరిశీలించారు. మొత్తం 91 నెయ్యి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. వినియోగదారులు లైసెన్స్ ఉన్న, విశ్వసనీయ సంస్థల నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని సంగీత సత్యనారాయణ సూచించారు. కొనుగోలు చేసే ముందు ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్ నంబర్, మాన్యుఫాక్చరింగ్ లేబుల్ తప్పనిసరిగా పరిశీలించాలని ఆమె సూచించారు.




# మహిళల భద్రత కోసం 'స్టాండ్ విత్ హర్'

- అధ్యాపకులకు మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళలపై లింగ ఆధారిత హింసను అరికట్టేందుకు పురుషులు, యువకుల్లో బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ పోలీసుల మహిళా భద్రత విభాగం చేపట్టిన 'స్టాండ విత్ హర్' రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల అధ్యాపకుల కోసం ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా భద్రత విభాగం డైరెక్టర్ జనరల్ చారు సిన్హా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పరిమళ హనా నూతన్, ఐపీఎస్, విద్యాశాఖ సంయుక్త డైరెక్టర్ డా.రాజేంద్ర సింగ్, పాఠశాల విద్యాశాఖకు చెందిన డా. సౌందర్య జోసెఫ్, మహిళా భద్రత విభాగం శిక్షణ విభాగాధిపతి ఆసియా షెర్వానీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చారు సిన్హా మాట్లాడుతూ మహిళలపై హింసను నివారించాలంటే పురుషులు, యువకుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, సమాజంలో సానుకూల మార్పుకు విద్యాసంస్థలే పునాది అని అన్నారు. డాక్టర్ రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సమానత్వం, ఆత్మగౌరవం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని చెప్పారు. ఆసియా షెర్వానీ నేతృత్వంలో నిర్వహించిన శిక్షణలో లింగ సున్నితత్వం, అనుచిత ప్రవర్తనను గుర్తించడం, బాధితులకు అండగా నిలిచే విధానాలు, శిక్షణా నైపుణ్యాలు, ఉన్నత విద్యాసంస్థల్లో ప్రచార కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసే పద్ధతులపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు.

## ఫీజుల పేరుతో సర్టిఫికెట్లను ఆపితే

# కళాశాల గుర్తింపు రద్దు చేస్తాం

- ప్రైవేటు జూనియర్ కళాశాలలకు ఇంటర్ బోర్డ్ హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫీజు బకాయిల సాకుతో విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయవద్దని తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమన్యాలను ఆదేశించింది. ఉన్నత విద్యా అడ్మీషన్ల ప్రక్రియ జరుగుతున్న ఈ నేపథ్యంలో ఫీజుల పేరుతో ఇంటర్‌విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే ప్రైవేటు జూనియర్ కళాశాలల పట్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డుపడే విధంగా వ్యవహారించే కళాశాల యాజమాన్యాలకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని, సదరు కళాశాలల అనుబంధ గుర్తింపును రద్దు చేస్తామని, లేదా ఆ కళాశాలను పూర్తిగా మూసి వేస్తామని తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి అభిలాష అభినవ్ హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు, ప్రిన్సిపాల్స్‌కు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులకు ఇంటర్ బోర్డ్ ఆదేశాలను జారీ చేసింది. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దని, రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, డిగ్రీ, అగ్రికల్చర్, ఫార్మసీ, నర్సింగ్ తదితర ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం వెబ్ కౌన్సెలింగ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రస్తుతం ముమ్మరంగా సాగుతోంది. ఈ కీలక సమయంలో ఫీజు బకాయిలు ఉన్నాయనే కారణంతో కాలేజీలు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఆపివేయడం వల్ల వేలాది మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేకపోతున్నారని ఇంటర్ బోర్డు ఆందోళన వ్యక్తం చేసింది. ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరిన వెంటనే బదిలీ పత్రం (టిసి), స్టడీ, కాండక్ట్, బోనఫైడ్ ఒరిజినల్ సర్టిఫికెట్లను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే అందజేయాలని ఇంటర్ బోర్డ్ స్పష్టం చేసింది. ఫీజులకు సంబంధించిన ఏమైన వివాదాలు ఉంటే వాటిని తల్లిదండ్రులతో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సంప్రదింపుల ద్వారా విడిగా పరిష్కరించుకోవాలని యాజమన్యాలకు బోర్డ్ సూచించింది. విద్యార్థులను ఫీజుల పేరుతో ఇబ్బంది పెట్టకుండా ఇంటర్ జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకు జిల్లా స్థాయిలో జిల్లా హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని ఇంటర్‌బోర్డ్ ఆదేశించింది.

# తెలంగాణ విద్యుత్‌కు సింగరేణి భరోసా

- రాష్ట్ర అవసరాలకే తొలి ప్రాధాన్యం
- ప్రస్తుతం తెలంగాణ విద్యుత్ కేంద్రాలకు 72 శాతం బొగ్గు సరఫరా
- ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా మరింత బొగ్గు సరఫరాకు కార్యాచరణ
- సింగరేణి జెన్‌కో సమన్వయ సమావేశంలో సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా జరుగుతున్నప్పటికీ ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మరింత ప్రాధాన్యత క్రమంలో ఇంకా ఎక్కువ బొగ్గు రవాణా చేయాలని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్ కో సిఎండి డాక్టర్ హరీష్ ప్రస్తుత విద్యుత్ డిమాండ్, బొగ్గు ఉత్పత్తి, రవాణా తదితర అంశాలపై తమ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు.
సమావేశంలో సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినందున, రాష్ట్ర థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో తగినంత బొగ్గు నిల్వలు ఉండేలా ఇరు సంస్థల సంబంధిత అధికారులు మరింత సమన్వయంతో పనిచేయాలన్నారు. నిరంతరాయ బొగ్గు రవాణాపై పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తామన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు, రామగుండం ఎన్‌టిపిసి, సింగరేణి థర్మల్ ప్లాంట్ కోసం సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 72 శాతాన్ని సరఫరా చేస్తున్నట్లు సింగరేణి మార్కెటింగ్ విభాగం అధికారులు సిఎండి దృష్టికి తీసుకొచ్చారు. అయితే విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తెలంగాణ విద్యుత్ కేంద్రాల అవసరాలకు మరింత ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే బొగ్గు నుంచి సర్దుబాటు చేయాలని స్పష్టం చేశారు.
విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల అవసరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, బొగ్గు ఉత్పత్తి, రవాణా, రైల్వే రేకుల లభ్యత, రోడ్డు రవాణా తదితర అంశాల్లో సింగరేణి, జెన్‌కో అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్షాకాలంలో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా వివిధ ఏరియాల జిఎంలు చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్పత్తి తగ్గొద్దని, నాణ్యత లోనూ రాజీ పడకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ జెన్‌కో సిఎండి డాక్టర్ హరీష్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ జెన్ కో థర్మల్ కేంద్రాల వద్ద బొగ్గు నిల్వల వివరాలను తెలిపారు. బొగ్గు రవాణాలో ఉన్న ఇబ్బందులపై స్థానిక ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పరిష్కరించేలా చూడాలన్నారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్‌వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఎం.తిరుమలరావు, ఈడి (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జిఎం(కోఆర్డినేషన్, మార్కెటింగ్)టి.శ్రీనివాస్, జెన్‌కో డైరెక్టర్లు నాగ్య, రాజశేఖర్, సిఈలు బిచ్చన్న, లక్ష్మయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు టెక్నాలజీ కీలకం

- నూతన ఆర్‌టిఒలకు పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించాలంటే టెక్నాలజీ ఆధారిత ఎన్‌ఫోర్స్‌మెంట్, సమర్థవంతమైన చట్ట అమలు, ప్రజల్లో విస్తృత అవగాహన అనే మూడు అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ పేర్కొన్నారు. ప్రతి మూడు నిమిషాలకు దేశంలో ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. తెలంగాణ రవాణా శాఖకు చెందిన ముగ్గురు రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్లకు (ఆర్‌టిఒలు) మే 18 నుంచి జూలై 17 వరకు రెండు నెలలపాటు నిర్వహించిన ఇండక్షన్ శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా శుక్రవారం అకాడమీలో జరిగిన వాలెడిక్టరీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి రవాణా శాఖ అడిషనల్ కమిషనర్ సి.రమేష్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసిన డి.జగదీష్, పి. భూషి రెడ్డి, చై సాయి చరణ్‌లకు అభిలాష్ బిస్త్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనిఫాం సర్వీసులో ప్రతి నిర్ణయం ప్రజల ప్రాణాలు, భద్రతతో ముడిపడి ఉంటుందని, మోటార్ వెహికల్స్ చట్టం, నిబంధనలపై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని సూచించారు. వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ, డ్రైవింగ్ లైసెన్సుల మంజూరులో నాణ్యతా ప్రమాణాలు పాటించడం, సమర్థవంతమైన తనిఖీలు నిర్వహించడం ద్వారా అనేక రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు.ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అనే మూడు స్తంభాలపై దృష్టి సారించి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తే రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. అకాడమీలో పొందిన శిక్షణ ప్రజలకు మరింత బాధ్యతాయుతమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అడిషనల్ కమిషనర్ సి. రమేష్ మాట్లాడుతూ గతంలో ఏఎంవీఐలకు అందించిన శిక్షణ ఫీల్డ్ స్థాయిలో మంచి ఫలితాలు ఇచ్చిందని, ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసిన ఆర్‌టిఒలు కూడా చట్టపరమైన అంశాలు, అమలు విధానాలపై సమగ్ర అవగాహనతో మరింత సమర్థంగా విధులు నిర్వహిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అధికారులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం తమలో సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ప్రజా సేవ పట్ల అంకితభావాన్ని పెంపొందించిందని చెప్పారు. ముఖ్యంగా అవుట్‌డోర్ శిక్షణ, ఫిజికల్ ఫిట్‌నెస్ కార్యక్రమాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. కోర్సు కోఆర్డినేటర్ వేమా శ్రీనివాస రెడ్డి రెండు నెలల శిక్షణ విశేషాలను వివరించగా, ఔట్‌డోర్ ఏడీ రాంబాబు శిక్షణ విజయవంతానికి సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్. చేతన, కవిత, వెంకటేశ్వర్లు, శ్రీరామమూర్తి, కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, ఆర్‌టీఓ రఘునాథ్ గౌడ్ ఎంవిఐ శీతల్, డిఎస్‌పి రామారావు, ఆర్ఐ రామకృష్ణతో పాటు అకాడమీ, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో పత్తి చేలు ఎండిపోతున్నాయి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎపి,కర్నాటక,మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలు మంచిగా నీళ్లు వాడుకుంటుంటే, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం పత్తి చేలు ఎండిపోతున్నాయని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎల్ నినో పైనే చర్చ జరుగుతోందని, వరి నార్లకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు నింపుతున్నారన్నారు. పంటలు పండితే రైతు బంధు,బోనస్ ఇవ్వాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని, అందుకే రైతుల గొంతు కోస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా సరఫరా లేదని, ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితి ఎప్పుడూ లేదన్నారు. ప్రపంచంలో అప్పులు చేయని దేశం ఎక్కడా లేదన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి గజ్వేల్‌లో మీటింగ్ పెట్టినా తాము అనుమతి ఇచ్చామని, కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత సరూర్ నగర్‌లో బిఆర్‌ఎస్ నిర్వహించే సమావేశానికి అనుమతి ఇవ్వకపోతే న్యాయస్థానం నుంచి అనుమతి తీసుకోవాల్సి వచ్చిందని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

## టిజి-20 లీగ్ ఆడిట్ ఖాతాలు వెంటనే బహిర్గతం చేయాలి

- టిసిఎ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజి20 లీగ్‌కు సంబంధించిన ఆడిట్ చేసిన ఆర్థిక ఖాతాలు, బ్యాలెన్స్ షీట్లు, వార్షిక నివేదికలు, పరిపాలనా రికార్డులను బిసిసిఐ, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) రాజ్యాంగంలోని రూల్ 37(2) ప్రకారం వెంటనే హెచ్‌సిఎ అధికారిక వెబ్‌సైట్‌లో బహిర్గతం చేయాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు హెచ్‌సిఎ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న సింగిల్ మెంబర్ కమిటీ (ఎస్‌ఎంసి) చైర్మన్ జస్టిస్ పి. నవీన్ రావుకు అధికారిక వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ధరం గురువారెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆమోదించిన బిసిసిఐ, హెచ్‌సిఎ రాజ్యాంగంలోని రూల్ 37(2) ప్రకారం ప్రతి క్రికెట్ సంఘం తన ఆడిట్ చేసిన ఆర్థిక లెక్కలు, వార్షిక నివేదికలు, కీలక పరిపాలనా పత్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం తప్పనిసరి అయినప్పటికీ, టిజి20 లీగ్ విషయంలో హెచ్‌సీఏ ఈ నిబంధనను అమలు చేయలేదని ఆరోపించారు. గతంలో టిసిఎ లేవనెత్తిన ప్రశ్నలకు ఇప్పటి వరకు సమాధానం ఇవ్వకపోవడంతో పాటు, రూల్స్ 28, 30 ప్రకారం అవసరమైన బిసిసిఐ అనుమతులు, హెచ్‌సిఎ జనరల్ బాడీ, అపెక్స్ కౌన్సిల్ ఆమోదాలకు సంబంధించిన పత్రాలను కూడా వెల్లడించలేదన్నారు. ఈ నేపథ్యంలో రూల్ 31 ప్రకారం చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కోరినట్లు తెలిపారు.

# మహిళల భద్రతకు 'ప్రాజెక్ట్ సేఫ్ స్టే'

- హాస్టళ్లు, పీజీల నమోదు తప్పనిసరి
- సురక్ష నివాస్-1.0 మార్గదర్శకాల ఆవిష్కరణ..
- భద్రతా ప్రమాణాలు పాటించని వసతి గృహాలపై చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగాలు, ఉన్నత విద్య కోసం హైదరాబాద్‌కు వచ్చే మహిళలు, విద్యార్థినుల భద్రతకు మరింత భరోసా కల్పించేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సిఎస్‌సి), యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థలతో కలిసి 'ప్రాజెక్ట్ సేఫ్ స్టే' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా రూపొందించిన 'సురక్ష నివాస్1.0' మార్గదర్శకాల బ్రోచర్‌ను శుక్రవారం బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసి ఆడిటోరియంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాస్టళ్లు, పిజి నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మహిళా భద్రతకు సంబంధించిన నూతన నిబంధనలను వివరించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి మహిళా హాస్టల్, పిజి నిర్వాహకులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన రిజిస్ట్రేషన్, రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం ఫామ్‌ఏను పూర్తి చేసి స్థానిక పోలీసులకు సమర్పించాలని సూచించారు. నగరంలోని 447 మహిళా హాస్టళ్లలో నిర్వహించిన సర్వేలో పలు భద్రతా లోపాలు బయటపడ్డాయని తెలిపారు. 97.5 శాతం హాస్టళ్లలో సిసిటివి కెమెరాలు ఉన్నప్పటికీ, కేవలం 43 శాతం హాస్టళ్లకే సరైన కాంపౌండ్ వాల్ ఉందని వెల్లడించారు. అలాగే అగ్నిమాపక పరికరాలు కేవలం 38.9 శాతం వసతి గృహాల్లో మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఈ లోపాలను సరిదిద్దేందుకే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని, హాస్టల్ యాజమాన్యాలను ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. త్వరలోనే మహిళా హాస్టళ్ల భద్రత కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ పి.ఉదయ్ కుమార్, అదనపు సిపిలు శ్రీనివాసులు, తఫ్సీర్ ఇక్బాల్, డిసిపిలు రక్షిత కృష్ణమూర్తి, శిల్పవల్లి, చైతన్య కుమార్, రమణారెడ్డి, డాక్టర్ లావణ్యతో పాటు పలు శాఖల అధికారులు, హాస్టల్ నిర్వాహకులు పాల్గొన్నారు.


## నేడు ఆరుట్ల 'టిపిఎస్'కు మంత్రి మహ్మద్ అజారుద్దీన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను (టీపీఎస్) రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖ మంత్రి, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ శనివారం సందర్శించనున్నారు. విద్యార్థులతో మమేకమవుతూ, క్రీడా స్ఫూర్తిని పెంపొందించే విధంగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ప్రపంచ క్రికెట్ వేదికలపై తన అద్భుతమైన మణికట్టు షాట్లతో భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన అజారుద్దీన్, టీపీఎస్ విద్యార్థులకు క్రీడల్లో రాణించేందుకు అవసరమైన మెలకువలు, క్రమశిక్షణ, ఫిట్‌నెస్, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలపై సూచనలు చేయనున్నారు. విద్యార్థులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలలోని తరగతి గదులు, డైనింగ్ హాల్స్, ప్లే గ్రౌండ్స్, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులు, పరిశుభ్రత, ఇతర మౌలిక సదుపాయాలను మంత్రి స్వయంగా పరిశీలించనున్నారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను మంత్రి నేరుగా అడిగి తెలుసుకోనున్నారు. మధ్యాహ్న భోజన వసతులు, పరిశుభ్రత ప్రమాణాలు, తాగునీటి సౌకర్యాలు, క్రీడా సామగ్రి అందుబాటుపై కూడా మంత్రి అజారుద్దీన్ సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే ఆయన విద్యార్థులతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించనున్నారు. వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, క్రీడల పట్ల ఆసక్తి, కెరీర్ అవకాశాలపై చర్చిస్తూ విలువైన సూచనలు చేయనున్నారు.

## రాజకీయపార్టీల హామీలకు వ్యతిరేకంగా దాఖలైన..

# 'పిల్'ను విచారించాలని 'సుప్రీం'కు వినతి

- విచారణకు జాబితా చేయాలని కోరిన న్యాయవాది-పిటిషనర్ అశ్వినీ ఉపాధ్యాయ్



**న్యూఢిల్లీ :** ఎన్నికలకు ముందు 'అహేతుకమైన ఉచిత పథకాలను' వాగ్దానం చేసే, లేదా పంపిణీ చేసే రాజకీయ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని, లేదా వాటి ఎన్నికల గుర్తును స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని (పిల్) విచారణకు జాబితా చేయాలని శుక్రవారం సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ముందు తన వాదనలు వినిపిస్తూ, తన 'పిల్'పై కేంద్రానికి, ఎన్నికల సంఘానికి 2022లోనే నోటీసులు జారీ చేశారని న్యాయవాది–పిటిషనర్ అశ్వినీ ఉపాధ్యాయ్ తెలియజేశారు. ఈ విషయాన్ని విచారణకు జాబితా చేయాలని ఆయన ధర్మాసనాన్ని కోరారు. ఈ పిటిషన్‌ను గతంలో ఫిబ్రవరి 5న అత్యవసర విచారణకు ప్రస్తావించారని, మార్చిలో 'పిల్'ను విచారించేందుకు కోర్ట్ అంగీకరించిందని అశ్వినీ ఉపాధ్యాయ్ చెప్పారు. దీనిపై స్పందించిన సిజెఐ సూర్యకాంత్ మాట్లాడుతూ 'ప్రస్తుతం మా వద్ద కేసుల తాకిడి ఎక్కువగా ఉంది. ఈ విషయంపై విచారణకు మీరు వేచి ఉండాల్సి ఉంటుంది' అని అన్నారు. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంపై త్వరిత విచారణ కోరుతూ అశ్వినీ ఉపాధ్యాయ్ చేసిన ప్రయత్నానికి సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మద్దతు తెలిపారు. 2022 జనవరి 5న అప్పటి ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి.రమణ ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీల 'అహేతుకమైన ఉచిత పథకాలను' వాగ్దానం చేసే లేదా పంపిణీ చేసే రాజకీయ పార్టీ గుర్తును స్వాధీనం చేసుకోవాలని, లేదా గుర్తింపును రద్దుచేయాలని ఆదేశాలు కోరుతూ దాఖలైన 'పిల్'పై కేంద్రం, ఎన్నికల సంఘం నుంచి స్పందనలు కోరింది. ధర్మాసనం దీనిని 'తీవ్రమైన సమస్య'గా అభివర్ణించింది. కొన్నిసార్లు ఉచిత బడ్జెట్ సాధారణను బడ్జెట్‌ను మించి పోతున్నదని ధర్మాసనం పేర్కొంది. ఎన్నికలకు ముందు పబ్లిక్ ఫండ్స్ నుంచి 'అహేతుకమైన ఉచితాల వాగ్దానం' ఓటర్లను అనుచితంగా ప్రభావితం చేస్తుందని, సమాన అవకాశాలకు భంగం కలిగిస్తుందని, ఎన్నికల పవిత్రతను దెబ్బతీస్తుందని ప్రకటించాలని పిటిషన్‌లో కోర్టును కోరారు. ప్రత్యామ్నాయంగా న్యాయవాది అశ్వినీకుమార్ దైబే దూబే ద్వారా దాఖలు చేసిన పిటిషన్‌లో ఈ విషయమై ఒక చట్టాన్ని రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరారు. 'ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీలు ఉచితాలు అందించి ఓటర్లను ప్రభావితం చేస్తున్న ఇటీవలి ధోరణి ప్రజాస్వామ్య విలువల మనుగడకు అతిపెద్ద ముప్పు మాత్రమే కాకుండా రాజ్యాంగానికి కూడా హాని కలిగిస్తుందని పిటిషనర్ సమర్పిస్తున్నారు' అని పిటిషన్ సమర్పించారు. కొన్ని రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు పలు రాజకీయ పార్టీలు చేస్తున్న వాగ్దానాలను పిటిషన్ ప్రస్తావించింది. ప్రజాస్వామ్యానికి ఎన్నికల ప్రక్రియే మూల స్తంభమని, అయితే, ఎన్నికలను పలుమార్లు రద్దు చేయడంతో డబ్బు పంపిణీ, ఉచిత వాగ్దానాలు హద్దులు దాటాయని పిటిషన్ సమర్పించింది.

## రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

- పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం రాహుల్‌గాంధీని దేశ ప్రధానమంత్రిగా చేయడమేనని తెలంగాణ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పార్టీ ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 14 లోక్‌సభ స్థానాలన్నింటినీ కాంగ్రెస్ గెలుచుకోవాలని, భవిష్యత్తులో డీలిమిటేషన్ జరిగి 20 స్థానాలు ఏర్పడితే వాటినీ కైవసం చేసుకునే లక్ష్యంతో పార్టీ ముందుకు సాగాలని అన్నారు. ఇందుకోసం ఎంపి ఎన్నికలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రతిపాదించారు. తన ప్రతిపాదనలను ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సమక్షంలో వివరించినట్లు చెప్పారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించకుండా సిసిరోడ్డు నిర్మాణం చేపట్టడంపై బాగ్‌లింగంపల్లి డివిజన్ పరిధిలోని వెజిటెబుల్ మార్కెట్ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న బిఆర్‌ఎస్ నేత ముఠా జైసింహ సంబంధిత ప్రాంతం సందర్శించి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, ముందుగా డ్రైనేజీ సమస్యను పూర్తిగా పరిష్కరించిన అనంతరం మాత్రమే సీసీ రోడ్డు పనులు చేపట్టాలని కోరారు.

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు






## ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి; ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆటో అండ్ ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంబి గార్డెన్‌లో తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ మోటార్ ఓనర్స్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఎనిమిదవ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు ముందు వందలాది ఆటోలతో ర్యాలీని ఎఐటియుసి జాతీయ సమితి సభ్యుడు బిజి క్లెమెంట్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మహాసభలకు సూచికంగా ఏర్పాటు చేసిన జెండాను వెంకటేశం ఆవిష్కరించారు. అనంతరం ఎండి జాకీరుద్దీన్, రావుల శ్రీనివాస్ అధ్యక్ష వర్గంగా జరిగిన సభలో వెంకటేశం మాట్లాడుతూ రాష్ట్రంలో 2025–26 ఆర్థికసంవత్సరంలో 69వేల నూతన ఆటోలు రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు. ఒక ఆటోకు రూ.15వేల నుండి రూ.20వేలు ట్యాక్స్ రూపంలో చెల్లిస్తున్నారని, వాటిలో కేవలం పది శాతం కూడా ఆటో కార్మికుల సంక్షేమం కోసం వెచ్చించడం లేదన్నారు. ప్రతి ఏడాది రూ.3,600 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి సంస్థకు ఇస్తుందని, అందులో సగం ఆటో కార్మికులకు ఇచ్చిన వారి జీవితాలు బాగుపడతాయన్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టే సమయంలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చి రెండున్నర ఏళ్లు అవుతున్నా ఆ హామీని నేటికి ఎందుకు నెరవేర్చలేదో సమాధానం చెప్పాలన్నారు. ఓలా, ఉబర్, రాపిడో వంటి సంస్థలు ఏడాదికి వేల కోట్ల రూపాయలు కమిషన్ రూపంలో దండుకుంటున్నారని, అదే యాప్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తే ప్రతి ఏడాది మూడువేల కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి వస్తుందని వెంకటేశం సూచించారు. రాష్ట్రంలోని ఆటో స్టాండ్లలో ఆటో కార్మికులకు కనీస వసతులు కల్పించాలని, ట్రాఫిక్ పోలీసుల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, సిఎన్‌జి ఆటోలను 50శాతం సబ్సిడీతో ఇవ్వాలని, రూ.10లక్షల లైఫ్ ఇన్సూరెన్స్‌తో పాటు ఐదు లక్షల హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఆటో కార్మికులకు ప్రభుత్వమే ఇవ్వాలని, ఆటో కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు జారీ చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ. 12 వేలు వారి ఖాతాల్లో జమ చేయాలని వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి సభలో మాట్లాడారు. మహాసభలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శులు నిమ్మటూరి రామకృష్ణ, చెరుకూరి వెంకటేశ్వరరావు, గుండెపోంగు మల్లేష్, ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# బిల్లులు రాక ‘మధ్యాహ్న’ కార్మికుల ఇబ్బందులు

## ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఓమయ్య



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** బిల్లులు రాక మధ్యాహ్న భోజన కార్మికుల ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే వారికి బకాయిలు అందజేసి ఆదుకోవాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఓమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. పౌష్టికాహారంలో భాగంగా మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు కోడిగుడ్లు పెట్టాలని నిబంధన ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆరు రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ.9లు ఉండటంతో ఒక విద్యార్థికి గుడ్డు పెట్టాలంటే మూడు రూపాయలు అదనంగా ఏజెన్సీ నిర్వాహకులపై పడుతుందన్నారు. విద్యార్థులకు కోడిగుడ్డుకు బదులు అరటిపండు, పల్లిపట్టి ఇవ్వడానికి అవకాశం కల్పించాలని కోరారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు ఎలాంటి తప్పు చేయకున్నా స్థానిక హెడ్మాస్టర్ కక్ష్యగట్టి జూన్ 15 నుంచి పనికి రావద్దన్నారని, కార్మికురాలు ఎలాంటి పొరపాటు లేకున్నా, జక్రాన్‌పల్లి మండల ఎంఇఒ, తహసీల్దార్లకు చెప్పినా వినకుండా వద్దని చెప్పటంతో నిర్వాహకురాలు రోడ్డున పడిందన్నారు. ఆమెను విధుల్లోకి తీసుకోవటానికి హెడ్మాస్టర్ ఆదేశించాలని కోరారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన డిఇఒ కోడిగుడ్డుకు బదులుగా అరటిపండు పెట్టాలని ఆదేశిస్తామని, ఏజెన్సీ విషయమై హెడ్మాస్టర్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

# 21న ఆర్‌టిసి కార్గో హమాలీ కార్మికుల సదస్సు

## ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టి.సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాష్ట్రంలోని టిజిఆర్‌టిసి కార్గోలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 21న ఎంజిబిఎస్. హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్న సందర్భంగా కరీంనగర్ కార్గో డిపో ఎదుట సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టి.సమ్మయ్య హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని డిపోల్లో కార్గోలో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని, కార్గోలను ప్రైవేటీకరణ చేయొద్దని, ఏజెన్సీలకు అప్పగించవద్దని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ హమాలీ కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, ఆర్‌టిసి హాస్పిటల్లో ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. బస్టాండ్లలో రెస్టు రూములు ఏర్పాటు చేసి, కార్మికుల లైసెన్సులను, బస్సు పాస్‌లను ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయాలని తదితర డిమాండ్లపైన సదస్సు నిర్వహిస్తున్నందున సదస్సుకు కార్గో హమాలీ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, లంక దాసరి లక్ష్మణ్, టి.నరేష్, చిట్టి పోశయ్య, పప్పు శ్రీనివాస్, సతీష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలి



సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/మణుగూరు :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధంకావాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె,సాబీర్ పాషా పిలుపునిచ్చారు. శుక్రవారం మణుగూరు మండలం రామంజివరం గ్రామంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశానికి బాడిస సతీష్, నోముల రవి అధ్యక్షత వహించగా సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తూ విబిఆర్ పథకాన్ని తీసుకురావడం సరేంది కాదని, 44 కార్మిక చట్టాలను, నాలుగు కోడులుగా విభజించి కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నీరు ఈ ప్రాంత అన్ని మండలాలకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ నిర్వహించనున్న పాదయాత్రకు సహకరించాలని సాబీర్ పాషా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మి కుమారి, సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, నాయకులు జంగం మోహన్‌రావు, సొందే కుటుంబరావు, రామంజవరం సర్పంచ్ బాడిశ కల్పన, సాంబయ్యగూడెం సర్పంచ్ చీదం ఉషారాణి, ఎస్కే సర్వర్, గడ్డం వెంకటేశ్వర్లు, తోట రమేష్, ఉపసర్పంచ్ పులిగిల్ల రమేష్, వేర్పుల నరేష్, కొత్తపల్లి సీతారాములు, ఆధర్ల రాములు, వజ్జా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/మర్రిగూడ :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగాపాల్గొని మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికే రైతులు పెట్టుబడులు పెట్టి పత్తి, ఇతర పంటల విత్తనాలను పొలాల్లో విత్తినా, అక్కడక్కడా కురిసిన స్వల్ప వర్షాలతో మొలకలు సరిగా రాక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలపై పెట్టిన పెట్టుబడులు తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వాలు అత్యవసర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కష్టాలు కళ్లముందే కనిపిస్తున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దురదృష్టకరమని విమర్శించారు. వర్షాభావ పరిస్థితులను అధికారికంగా గుర్తించి రైతులకు ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి నష్టపరిహారం చెల్లించడంతో పాటు, పంట రుణాల రీషెడ్యూలింగ్, కొత్త వడ్డీ రహిత రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులు రుణభారంతో ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలవాలని సూచించారు. శివన్నగూడెం ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురైన రైతులు, నిర్వాసితులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఆర్‌అండ్ఆర్ (పునరావాసం, పునర్నిర్మాణం) ప్యాకేజీ అందలేదని, వారికి తక్షణమే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ హక్కులను కాలరాసే విధానాలను వీడనాడి వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. ఎరుకలి నిరంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షంరెడ్డి, మండల కన్వీనర్ బుర్ర శేఖర్, ఆకుల రఘుమయ్య, చెల్లం పాండురంగారావు, జక్కల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.




# దక్కన్ ప్రాంతంలో అజేయ యోధుడు తుర్రేబాజ్ ఖాన్

## రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్కన్ ప్రాంతంలో అజేయ యోధుడిగా పేరుగాంచిన తుర్రేబాజ్ ఖాన్ పోషించిన పాత్రను మరువలేమని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. హైదరాబాద్, కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ‘ స్టార్మింగ్ ధ బ్రిటిష్ రెసిడెన్సీ ‘ అనే అంశంపై శుక్రవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు టి.వివేక్, చరిత్ర ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మ రచించిన ‘తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం సంక్షోభ సంవత్సరాలు‘ అనే పుస్తకాన్ని చిన్నారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ 1857 జూలై 17న తుర్రేబాజ్ ఖాన్ దేశభక్తి గల కొంతమంది ధైర్యవంతుల బృందానికి నాయకత్వం వహించి, బ్రిటీష్ రెసిడెన్సీపై దాడి చేశారని గుర్తు చేశారు. ఇది డెక్కన్‌లో జరిగిన ప్రసిద్ధ సిపాయిల తిరుగుబాటుకు ప్రతిధ్వనిగా నిలిచిందని, ఈ సంఘటనను ఇప్పటికి జరుపుకునేందుకు కారణం గతం నుండి స్ఫూర్తి పొందడం కోసమేనని అన్నారు. గతంలో ఇలాంటి కార్యక్రమాలను అనుమతించలేదని ఆయన గుర్తు చేశారు. నల్లగొండకు చెందిన మౌల్వి అల్లావుద్దీన్‌తో కలిసి తుర్రేబాజ్ ఖాన్ స్వాతంత్ర పోరాటంలో అనేక పోరాటాలు చేశాడని, బ్రిటిష్ రెసిడెన్సీపై దాడి చేశారని చిన్నారెడ్డి వివరించారు. 2009–2014 సంవత్సరాల మధ్య జరిగిన, రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలకమైనవిగా పరిగణించబడే అనేక నమోదు కాని వాస్తవాలు, సంఘటనలను ‘తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం సంక్షోభ సంవత్సరాలు‘ పుస్తకంలో పొందుపర్చడాన్ని చిన్నారెడ్డి పుస్తక రచయితలను అభినందించారు. ఈ సదస్సు లో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్ క్యాప్టెన్ (డాక్టర్) ఎల్.పాండురంగారెడ్డి, మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సూర్య ధనుంజయ, పుస్తక రచయితలు టి.వివేక్, డాక్టర్ కె.పద్మ, చరిత్ర ప్రొఫెసర్, డాక్టర్ పి.అరుణ, చరిత్ర విభాగాధిపతి, ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ ప్రసంగించారు. సదస్సులో మాజీ ఎంపి ఆర్.సురేందర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.

# నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదు

## ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిరుద్యోగుల సమస్యలపై బిఆర్ఎస్ నేతలు మాట్లాడడం ‘దయ్యాలు వేదాలు వల్లించినట్లు, సంపినోడే వచ్చి సంతాపం తెలిపినట్లు ఉంది’ అని ప్రభుత్వవిప్ బల్మూర్ వెంకట్ వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదని వెంకట్ విమర్శించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పేపర్ లీకులు, పరీక్షల వాయిదాలు, నియామకాల జాప్యాలతో అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన విమర్శించారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన బిఆర్ఎస్ రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని, బిఆర్ఎస్ నేతల ఉచ్చులో నిరుద్యోగులు పడవద్దని విజ్ఞప్తి చేశారు. సిఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల, హుజూరాబాద్, సిరిసిల్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సునీల్ నాయక్, మహేశ్, అశోక్, భాష, షబ్బీర్, ప్రవల్లిక తదితర నిరుద్యోగుల మరణాలకు బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలే కారణమని ఆయన ఆరోపించారు. కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించని బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు నిరుద్యోగులపై కపట ప్రేమ చూపించడం విడ్డూరమన్నా రు. హైదరాబాద్‌లో నిరుద్యోగి ప్రవల్లిక మృతిని కూడా రాజకీయంగా వాడుకున్న చరిత్ర బిఆర్ఎస్‌దేనని ఆరోపించారు. పదేళ్లలో నిరుద్యోగులకు జరిగిన అన్యాయాలు, పేపర్ లీకులు, విద్యార్థి నాయకులపై కేసులు, వేధింపులను గుర్తుంచుకోవాలని సూచించారు.

# కెటిఆర్ మాటలను తెలంగాణ యువత విశ్వసించే పరిస్థితి లేదు

## బిఆర్ఎస్ నిర్వహిస్తున్నది ‘యువ సంగ్రామ సభ కాదు విద్రోహ సభ’ : చనగాని దయాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాటలను తెలంగాణ యువత విశ్వసించే పరిస్థితి లేదని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. బిఆర్ఎస్ నిర్వహించనున్న ‘యువ సంగ్రామ సభ’ను యువత కోసం నిర్వహిస్తున్న సభగా కాకుండా, నిరుద్యోగులకు అన్యాయం చేసిన పార్టీ నిర్వహిస్తున్న ‘విద్రోహ సభ’గా భావించాలని విమర్శించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక అర్హత కెటిఆర్‌కు లేదని, ఆయన వెంటనే తెలంగాణ యువతకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో గ్రూప్1 పరీక్షను సక్రమంగా నిర్వహించలేకపోయారని, ఉద్యోగ నియామకాల విషయంలో యువతను తీవ్ర నిరాశకు గురిచేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4, డిఎస్‌సి, ఎస్ఐ, కానిస్టేబుల్, ఎఇఇ, నర్సింగ్, ఆరోగ్య శాఖ తదితర పోస్టుల భర్తీ ప్రక్రియలను పూర్తి చేసి ఉద్యోగాల కల్పనకు కృషి చేసిందని తెలిపారు. అలాగే ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్ రంగాల్లోనూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చనగాని దయాకర్ పేర్కొన్నారు.





## 'సర్' జాబితా వివరాలను వేగవంతం చేయాలి

కొప్పునూర్‌లో పర్యటించిన తహసీల్దార్ కె.శ్రీనివాస్

**ప్రజాపక్షం/చిన్నంబావి :** చిన్నంబావి మండలంలోని ఓటరు జాబితా ప్రత్యేక సవరణను వేగవంతం చేయాలని అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎస్ఐఆర (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియను పూర్తి చేయాలని తాహసీల్దార్ కె.శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని కొప్పునూర్ గ్రామ పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా తాహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, డిజిటలైజేషన్ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన, తప్పులు లేకుండా పూర్తి చేయాలని బీఎల్ఓలు, జీపీఓలకు సూచించారు. ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. పరిశీలనలో మండల గిర్దావర్ కురుమూర్తి, సూపర్‌వైజర్ శివప్రసాద్, బీఎల్ఓలు, జీపీఓ రాములమ్మ, గ్రామ ప్రజలు, ఓటర్లు పాల్గొన్నారు.

## పెబ్బేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బెంచీల విరాళం

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా, పేదల డాక్టర్ జిల్లెల మాధవరెడ్డి జ్ఞాపకార్థం వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంచీలను కళాశాల యాజమాన్యానికి అందించారు. విద్యార్థుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని ఏర్పాటు చేసిన బెంచీలను పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సహకారాన్ని అందించడంలో ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, అయ్యవారిపల్లి సర్పంచు కురుమయ్య, రాంపురం సహదేవుడు, సత్యనారాయణ రెడ్డి, కృపాకర్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సునీల్‌రెడ్డి, ఆనంద్ సాగర్, పాతపల్లి చంద్రశేఖర్, తిప్పాయిపల్లి నవీన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన 8 కుటుంబాలకు రూ.6లక్షల చొప్పన ఎక్స్‌గ్రేషియా

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** జిల్లాలో పిడుగుపాటు ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో రూ.6 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పిడుగుపాటు ఘటనల్లో మృతి చెందిన వారి ఎక్స్ గ్రేషియా సహాయాన్ని సంబంధిత లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఈనెల 13న ఎలక్ట్రానిక్ క్లియరెన్స్ సిస్టమ ద్వారా వారి ఖాతాలకు నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, బాధితులకు తక్షణ ఆర్థిక ఉపశమనం కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నిబంధనల మేరకు ఎక్స్‌గ్రేషియా సాయాన్ని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా నష్టపోయిన అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు సత్వర ఆర్థిక సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని కలెక్టర్ తెలియజేశారు.

## వర్షం కోసం ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సస్యశ్యామలం కావాలని ఆకాంక్షిస్తూ ఉట్కూర్ మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో శుక్రవారం మౌలానా ముఫ్తీ మొహ్మద్ ఇర్షాద్ ఖాస్మీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్ (వర్ష ప్రార్థన) నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా ముఫ్తీ మొహ్మద్ ఇర్షాద్ ఖాస్మీ మాట్లాడుతూ, వర్షాభావం కారణంగా ప్రజలు, రైతులు, పశుపక్ష్యాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

**ప్రజాపక్షం/నారాయణపేట :** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించడం లక్ష్యంగా జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధ్యక్షతన, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సమక్షంలో జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై అవసరమైన హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ లిమిట్ బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలల పరిసరాలను స్కూల్ సేఫ్టీ జోన్‌లుగా అభివృద్ధి చేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఫుట్‌పాత్‌లపై అక్రమణలను తొలగించి పాదచారులకు సౌకర్యవంతమైన మార్గం కల్పించాలని, ప్రధాన రహదారులపై పార్కింగ్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలోని రోడ్డు భద్రతా పనులపై నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్, మైనర్లు వాహనాలు నడపడం, ఫిట్‌నెస్ లేని వాణిజ్య వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన చర్యలను వివరించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో రవాణాశాఖ, పోలీస్ శాఖ, రోడ్లు, భవనాల శాఖ, జాతీయ రహదారుల అధికారులు, ఆర్టీసీ, 108 అంబులెన్స్ సేవలు, విద్యాశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధన్వాడ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, వారెంట్ల అమలును సమీక్షించి, కేసులను శాస్త్రీయ ఆధారాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా పోలీసు సేవలు అందించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో బీట్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మరికల్ సిఐ భగవంత్‌రెడ్డి, ధన్వాడ ఇంచార్జి ఎస్సై మహేశ్వరి, స్టేషన్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుండాల ఏకలవ్య గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/వెల్దండ :** గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం, భద్రత కల్పించడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని వెల్దండ మండలం గుండాల గ్రామంలోని తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మికంగా సందర్శించి విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు. పాఠశాల, భోజనశాల, డైనింగ్ హాల్‌ను, విద్యార్థులకు అందిస్తున్నా అల్పహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, నాణ్యత, మెనూ అమలు పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. వంటశాలలో ఆహార పదార్థాల నిల్వ, తాగునీటి వినియోగం, వంట ప్రక్రియలను స్వయంగా తనిఖీ చేసి నాణ్యమైన ఆహారం అందేలా నిరంతం పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ఆరోగ్యం సంక్షేమానికి సబంధించిన అంశాల్లో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు.అనంతరం విద్యార్థుల డార్మిటరీలను సందర్శించిన కలెక్టర్ పడకల ఏర్పాటు గదుల పరిశుభ్రత, విద్యుత్ సౌకర్యాలు, మరుగుదొడ్లు, స్నానపు గదుల తాగునీటి వసతి వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన అనంతరం భోజన తీరును పరిశీలించిన ఆయన ఉపాధ్యాయుల భోదనా విధానాలు డిజిటల్ లెర్నింగ్ వినియోగం, విద్యార్థుల హాజరు విద్యా ఫలితాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు ఏ గ్రామాలు, ఏ మండలాలకు చెందిన వారో తెలుసుకున్నారు. ఉవిద్యార్థులకు పలు సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని అంచన వేసిన కలెక్టర్ సిబిఎస్ఇ సిలబస్‌కు అనుగుణంగా భోదన మరింత సమర్థవంతంగా కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్‌రెడ్డి, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు జక్కుల శీరీషవెంకట్, మట్ట యాదమ్మవెంకటయ్యగౌడ్, కంఠం మమతలక్ష్మ ఐ స్వామి, ఎంపిడిఒ సులోచన, ఇన్‌చార్జి ఎంపిఒ గిరిగౌడ్, ఏఓ శోభ,ఎంఈఓ చంద్రుడు నాయక్, ఎపిఎం జయమాలిని, ఎపిఒ ఈశ్వర్‌జీ, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ సుమన్‌కుమార్, ఎఇ పల్లవీ, ఇసి దేవేందర్,టిసి సత్యనారాయణలతో తదితరులు పాల్గొన్నారు



## రాజనీతి కోవిదుడు మహేంద్రనాథ్ - భగవేణి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** పేదల కొరకు జీవితాన్ని అంకితం చేసిన మహానేత నీతి, నిజాయితీ గల రాజకీయ దురంధరుడు పుట్టపాక మహేంద్రనాథ్ అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భగవేణి నర్సింహులు అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం క్రీ.శే.పుట్టపాగ మహేంద్రనాథ్ వర్ధంతి వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ భగవేణి నర్సింహులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భగవేణి నర్సింహులు మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి మండలంలోని జొన్నల బోగుడ గ్రామంలో మహేంద్రనాథ్ జన్మించారని, మహేంద్ర నాథ్ న్యాయవాదిగా, రాజకీయ నేతగా, ఎదిగి అంబేద్కర్ అడుగుజాడలలో, గాంధీ సిద్ధాంతాలతో ఈ ప్రాంతంలో బడుగు బలహీన వర్గాలకు అగ్రవర్ణ పేదలకు అవసరమైన చోటు విద్యాలయాలు, హాస్టల్లో నెలకొల్పారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విజయ్‌కుమార్, కురుమయ్య, అల్తాఫ్, యాదయ్య, రవీందర్‌రెడ్డి, శివకుమార్, పురుషోత్తమ రావు, శివలీల, సౌజన్య, బోధ నేతల సిబ్బంది హబీబ్, అనూష , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందడానికి మరో అవకాశం

ప్రిన్సిపాల్ జి.సుకన్య



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని డాక్టర్ బిఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందడానికి మరో సువర్ణావకాశం కల్పిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం పొందాలనుకునే ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు మరో సువర్ణావకాశం లభించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) జడ్చర్ల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య తెలిపారు. దోస్త్ స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో, విద్యార్థులు జూలై 20, 2026 నుండి జూలై 26, 2026 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే జూలై 20 నుండి జూలై 27 2026 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం జూలై 30, 2026న సీట్ల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు తమ ఆసక్తికి, భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకుని ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాలలో ఉపాధి ఆధారిత కోర్సులను కూడా ప్రవేశపెట్టామని తెలిపారు. వాటిలో బికాంలో రిటైల్ ఆపరేషన్, బిఎస్సీలో ఫార్మాన్యూటికల్ మాన్యుఫాక్చరింగ్ అండ్ క్వాలిటీ , బిఎస్సిలో హార్టికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మా కళాశాలలో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక సౌకర్యాలు, ఉపాధి ఆధారిత కోర్సులు మెరుగైన కేరీర్ ఆధారిత కోర్సులు మెరుగైన కెరీర్ అవకాశాలు అందుబాటులో ఉన్నందున, విద్యార్థులు తమ దోస్త్ వెబ్ ఆప్షన్లలో ఈ కళాశాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య, దోస్త్ కన్వీనర్ రాఘవేంద్ర రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# యాభై సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికుడికీ రూ.5000 ఫించన్ ఇవ్వాలి

మారేడు శివశంకర్
ఎఐటియుసి
జిల్లా ప్రధాన కార్యదర్శి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా లోడింగ్ అన్లోడింగ్, కార్మికులకు 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి రూ.5000 ఫించన్ ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండు చేశారు. తిమ్మాజీపేట గ్రామ ఎఐటియుసి లోడింగ్ అన్‌లోడింగ్ కార్మికుల ఆర్.యాదయ్య, అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండు చేశారు. తిమ్మాజీపేట గ్రామ ఎఐటియుసి లోడింగ్ అన్‌లోడింగ్ కార్మికుల ఆర్.యాదయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కొట్లాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని కార్మికులకు అనేక చట్టాలు రద్దు చేయడం జరిగింది. కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా 5వేల రూపాయలు పింఛన్ ఇవ్వాలని డిమాండు చేశారు. కార్మికుల కుటుంబాల పిల్లలకి కానుపుకు లక్ష రూపాయలు మ్యారేజ్ గిఫ్ట్ కింద లక్ష రూపాయలు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి, ఎస్కే కాజా మహిమద్దీన్, ఎఐటియుసి అనుబంధం, లోడింగ్ అన్‌లోడింగ్ తిమ్మాజిపేట గ్రామ కార్మికులు దేవేందర్, పి.మాసయ్య, శ్రీను, ఆంజనేయులు, అశోక్, ఎ.యాదయ్య, నర్సింగరావు, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నిర్లక్ష్యానికి తావులేదు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ప్రభుత్వ పాఠశాలల్లో నిర్లక్ష్యానికి తావు లేదని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులకు గాను అనధికారికంగా గైర్హాజరైన ముగ్గురు ఉపాధ్యాయులు శంకర్, లావణ్య, మానసలపై సస్పెన్షన్‌కు సిఫారసు చేయాలని డిఇఒకు కలెక్టర్ ఆదేశించారు. వెంటనే నివేదిక అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, విద్యా ప్రమాణాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయుల బాధ్యత అత్యంత కీలకమని, విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల విశ్వాసం రోజురోజుకు పెరుగుతోందని, అలాంటి సమయంలో ఉపాధ్యాయులు తమ బాధ్యతలను మరింత నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. అదే విధంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వారానికి ఒకరోజు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా డ్రైడే పాటించాలని పిలుపునిచ్చారు. వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యాధులను నివారించేందుకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల్ని ప్రజలందరూ నిర్వహించాలని అన్నారు. వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యాసంస్థలు, ఇళ్లల్లో, కార్యాలయాలు, వ్యాపార సంస్థల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్, తాహసీల్దార్ ఇబ్రహీం, మున్సిపల్ చైర్మన్ రత్నామాల, కమిషనర్ మహమూద్ షేఖ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శివరాం, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## సోనం వాంగ్‌చు నిరాహార దీక్షపై స్పందించాలి

తక్షణమే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేసి, సోనమ్ వాంగ్‌చుక్ ప్రాణాలు కాపాడాలి
నిరాహార దీక్ష చేపట్టే 19 రోజులు గడుస్తున్నా స్పందించని బిజెపి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం
మక్తల్ నియోజకవర్గం డా.బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం

**ప్రజాపక్షం/మక్తల్ :** స్థానికంగా ఐబి దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంబేద్కర్ యుజన సంఘం మక్తల్ నాయకులు మాట్లాడుతూ గత 20 రోజుల క్రితం కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఇటీవల నీట్ వంటి జాతీయ పరీక్షలు వరుసగా లీకులవుతుండటంతో విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక సూసైడ్ చేసుకుని ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ చేపట్టిన ధర్నాలో పాల్గొన్న సైంటిస్ట్, సామాజికవేత్త కోసం హంగుచుక్ విద్యార్థుల ఆత్మహత్యలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో నిరాహార దీక్ష చేపట్టి నేటికి 20వ రోజు అవుతున్నప్పటికీ కేంద్రంలోని ప్రధాని మోదీ బిజెపి ప్రభుత్వం కనీస స్పందన లేకుండా దున్నపోతు మీద వానపడ్డట్టు వ్యవహరిస్తుండటం సిగ్గుచేటని, తక్షణమే బిజెపి నరేంద్ర మోదీ ప్రభుత్వం స్పందించాలన్నారు. అదేవిధంగా సోనం వాంగ్‌చుక్ సైంటిస్ట్‌గా, పర్యావరణవేత్తగా, సామాజికవేత్తగా తాను పుట్టిన గడ్డ అయిన లడక్ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేలా కరిగిపోయే కృత్రిమ మంచు పర్వతాలు సృష్టించడం, లడక్ ప్రజల అటవీ సహజ వనరుల హక్కుల కోసం పోరాడుతూ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రామన మెగసెసె వంటి అవార్డులతో దేశానికి గొప్ప పేరును తీసుకోచ్చాడన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి ప్రాణాలు కాపాడుకోవాలని దేశ వ్యాప్తంగా ప్రజలు సోషల్ మీడియా, ఇతర మార్గాల ద్వారా మద్దతు తెలుపుతూ ఎడ్యుకేషనల్ మినిస్టర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ బిజెపి మోదీ ప్రభుత్వం కళ్లుండి చూడలేని గుడ్డి వారిలా నడుచుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కావున వెంటనే విద్యార్థుల బలవన్ మరణానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్రతో రాజీనామా చేయించి సోనమ్ వాంగ్‌చుక్ ప్రాణాలను కాపాడాలన్నారు.
ఈ కార్యక్రమంలో డా.బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు పృథ్వీరాజ్, అంబేద్కర్ యువజన సంఘం కీలక సభ్యులు తల్వార్ నరేష్, సందీప్, నాగేష్ గోలపల్లి తదితరులు పాల్గొన్నారు.

## వేలోడ్రమ్ సైకిలింగ్ అకాడమీలో ప్రవేశం కోసం సైకిల్ పోటీలు

**ప్రజాపక్షం/మక్తల్ :** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వారి ఆదేశాల మేరకు, నారాయణపేట జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో ఈనెల 19న ఆదివారం ఉదయం 9 గంటలకు మక్తల్ ఎల్లమ్మకుంట కొత్త గార్లపల్లి రోడ్డులో 14,15,16 సంవత్సరాలు బాలురకు మాత్రమే, పోటీలు నిర్వహిస్తున్నామని, వీరు 2010 జూలై నుండి 2012 జూన్ మధ్యన జన్మించిన అర్హులు అయిన వారు మాత్రమే హైదరాబాద్‌లో గల వేలోడ్రమ్ సైకిలింగ్ అకాడమీలో ప్రవేశం కొరకు, నిర్వహించె సైకిలింగ్ పోటీల అకాడమీలో ప్రవేశం కొరకు, నిర్వహించ సైకిలింగ్ పోటీలలో పాల్గొనాలని జిల్లా సైకిలింగ్ అధ్యక్షుడు తాన్‌సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆసక్తి గల బాలురు బోనోఫైడ్, సొంత సైకిల్‌తో, క్రీడా దుస్తులు ధరించి పాల్గొనాలని వారు తెలిపారు.
సైకిలింగ్ పోటీలలో క్రీడా ప్రతిభను చాటిన బాలురను (సైకిలింగ్ రైడర్స్) ను ఎంపిక చేసి, ఈనెల 20న హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీలో గల వేలోడ్రమ్ సైకిలింగ్ అకాడమీలో తెలంగాణ సైకిలింగ్ కోచ్ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగు రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపుతామని బి.గోపాలం తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర మణికంఠ గౌడ్, ఉపాధ్యక్షుడు జి.శివకుమార్, నిర్వాహణ కార్యదర్శి లు అమ్రేన్, దామోదర్ పాల్గొన్నారు. మిగతా వివరాలకు సెల్ నెంబర్ 7702713139ను సంప్రదించాలని తెలిపారు.



## గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజపక్షం/గట్టు :** మండలంలోని చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో శుక్రవారం నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మాజీ ఎంపీపీ విజయకుమార్, సర్పంచు దేవేందర్ తో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం సర్పంచు మాట్లాడుతూ పంచాయితీ భవన నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.20 లక్షలు నిధులు మంజూరు కావడం జరగడంతో నిర్మాణానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. వీలైనంత తొందరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేస్తామని చెప్పారు.

## ఉత్తనూర్, సంకాపూర్, ఈడిగోనిపల్లి గ్రామ రైతులందరికీ ముఖ్య సూచన

**ప్రజాపక్షం/అయిజ :** ఈనెల 28వ తారీకు నుంచి భారత ప్రభుత్వం చే తయారు చేయబడిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే ఎరువుల అమ్మకాలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో యూరియాతో పాటుగా డిఏపీ, సింగిల్ సూపర్ ఫాస్ట్, పోటాషి, ఇతర కాంప్లెక్స్ ఎరువులు అన్నీ కూడా రైతులు నమోదు చేసుకోవాల్సింది. ఈ యాప్ లో ప్రధానంగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్న రైతులకు మాత్రమే వర్తించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోని రైతులు కూడా వీలైనంత త్వరగా ఫార్మర్ రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా రైతులను వ్యవసాయ విస్తరణ అధికారి కోరారు.

## ప్రభుత్వం కొనుగోలు చేసే విత్తనాలను విక్రయించాలి

జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్

**ప్రజాపక్షం/దామరగిద్ద :** ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యాన్ని ప్రోత్సాహిస్తూ బోనస్ ప్రకటిస్తూ ఎంపిక చేసిన వరి రకాలను రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఆగ్రోస్ హాకా, రైతు సేవా కేంద్రాలను ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విత్తనాలు ఎరువులను వాటి నాణ్యతను పరిశీలించారు. రైతుల ఆధార్ కార్డుతో ఎరువుల విక్రయాలను ఈపాస్ లో విధిగా నమోదు చేయాలని, యూరియా కోసం వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా ఆన్‌లైన్ బుకింగ్ సిస్టం ద్వారా సరఫరా చేయాలని వరి విత్తనాలను కొనుగోలు చేసి సమయంలో రైతులు కంపెనీ లేబుళ్లను నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలని, కొనుగోలు సమయంలో విధిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. వరి సాగులో రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలను అందుబాటులో ఉంచాలని డీలర్లను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా బెట్ట పరిస్థితులు నెలకొనడంతో వర్షాధారంగా సాగుచేసిన పెసర, జొన్న, కంది, పత్తి పంటల ను ఎలా సంరక్షించుకోవాలో సలహాలు సూచనలు అందించి రైతులకు తెలియజేయాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంట మండల వ్యవసాయ అధికారి బాలాజీప్రసాద్, ఏఈఓ గోపాల్ ఉన్నారు.




## పోలీస్ నిఘా వ్యవస్థ పటిష్టం

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో రాత్రి వేళల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర సహాయం అందించే నైట్ బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా జిల్లా పోలీసు శాఖ మరో కీలక చర్య చేపట్టిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నైట్ బీట్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి అవసరమైన రిఫ్లెక్టివ్ జాకెట్లు, ఎల్‌ఈడీ బ్యాటన్స్, ఫైబర్ లాఠీలను జిల్లా ఎస్పీ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో నైట్ బీట్ పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. నేరాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలు,చీకటి వీధులు, నిర్మానుష ప్రాంతాలు, కాలనీలు, ప్రధాన కూడళ్లు, జాతీయ మరియు రాష్ట్ర రహదారులపై నిరంతరం అప్రమత్తంగా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు.విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది భద్రత కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.ప్రతి నైట్ బీట్ అధికారి తన పరిధిలోని కాలనీలు, గ్రామాలు, వ్యాపార సముదాయాలు, ఏటీఎంలు,బ్యాంకులు, బంగారు ఆభరణాల దుకాణాలు,ఒంటరి ఇళ్లు వంటి సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు.అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపించిన వెంటనే తనిఖీలు చేపట్టి, అవసరమైతే ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్, ఏ.ఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు,ఆర్‌ఐలు సంతోష్, శ్రీను పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సోనమ్ వాంగ్ చుక్ ప్రాణాలను రక్షించేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ ప్రాణాలను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దూళిపాళ ధనుంజయనాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నేరేడుచర్లలో సిపిఐ కార్యాలయం ప్రజాభవన్ నుండి విడుదల చేసిన ప్రతిక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రభుత్వ వైఫల్యం వల్ల నీట్ పరీక్ష పత్రం లీకేజీ రావడం విద్యార్థుల వల్ల భవిష్యత్ పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ గత 20 రోజులుగా అమరణ నిరహారదీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్ చుక్ ఆరోగ్యం పూర్తిగా చెడిపోయి మృత్యువు అంచులో ఉన్నదన్నారు. కేంద్రవిద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి వర్గం నుంచి తప్పించి కేంద్ర ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకోవాలన్నారు. గొటితే పోయేదానిని గొడ్డలిదాకా తెచ్చుకోవద్దని ఇటీవల జనతా కాక్రోచ్ పార్టీకి వస్తున్న అసాధరణ మద్దతును తక్కువ అంచనా వేయరాదని కేంద్ర ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఉన్నవ్యతిరేకతను అద్దం పడుతుందని అన్నారు. దేశంలోని ప్రధాన వామపక్ష పార్టీలతో పాటు ఆమ్‌అద్మీ పార్టీ లాంటి పార్టీలు కూడా వాంగ్ చుక్‌కు మద్దతు ఇస్తున్నాయన్నారు.

## శ్రీవిజయచందర్ రైస్‌మిల్లు ప్రజల ప్రాణాలతో చెలగాటం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామ సమీపంలో జాతీయరహదారి 167 ను అనుకుని ఉన్న శ్రీ విజయ చందర్ రైస్ మిల్లు వల్ల వచ్చే దుమ్ము దూళి వరి పొట్టు కళ్లలో పడటం కారణంగా వాహనాలపై వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతూ క్షతగాత్రులై వికలాంగులు అవుతున్నందున అధికారులు ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని ఆ రైస్ మిల్లును మూసివేయించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని గానుగబండ గ్రామంలో జరిగిన సిపిఐ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ రైస్ మిల్లు నిర్మాణంలో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకపోగా చుట్టు కనీసం రక్షణ గొడ కూడా కట్టలేదన్నారు. ఇప్పటికే రెండు, మూడు అత్యంత ప్రమాదాలు సంభవించాయని , మిల్లుకు అమర్చిన ఇనుప రేకులపై ఎటువంటి రక్షణ గొడ కట్టకపోవడంతో అవి రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనాదారులపై పడి కాళ్లు, చేతులు విరిగి గాయాలపాలై అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డ సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, గోదుముల ఈశ్వరచారి, సైదులు, షేక్ నబీసాబ్, సోమయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## దున్నిన దుక్కులు ఎండిపోతున్నాయి కరెంటు ఇవ్వండి సారు

**ప్రజాపక్షం/వేములపల్లి :** గత నెల రోజులుగా త్రీ పేస్ కరెంటు లేక రైతులు పోసిన నార్లు ఎండిపోయే దిశలో కనిపిస్తున్నాయి ఉమ్మడి మండలంలోని పాములపాడు గ్రామంలోని రైతులు కరెంటు లేక దున్నిన దుక్కులన్నీ ఎండిపోతున్నాయని కంటనీరు పెట్టుకున్నారు. పాములపాడు గ్రామంలో వేళా పాల లేకుండా కరెంటు కోతలు విధిస్తూ 24 గంటలకు గాను ఏడు గంటలకు సప్లై చేస్తూ ప్రతిరోజు 10 నుంచి 15 సార్లు కరెంటుకు అంతరాయం కలుగుతుంది ఇదేంటని అధికారులను సంప్రదించగా సబ్ స్టేషన్ లో ప్రాబ్లం ఉంది మరో 10 రోజులు ఇలాగే ఉంటుంది సబ్ స్టేషన్ లో సరిపడా సౌకర్యాలు లేవు అంటూ రైతులను వెక్కిరించినట్లుగా ఎగతాళి చేస్తున్నారు ఓ పక్క వర్షాలు రాక,మరోపక్క కరెంటు లేక దున్నిన దుక్కులన్నీ ఎండిపోతుంటే రైతు గుండెలు గుబెలుమంటున్నాయి ఇప్పటికైనా అధికారులు స్పందించి అంతరాయం లేని కరెంటు ఇస్తే కనీసం మిగిలిన పంట నైనా పండించుకునే అవకాశం కలుగుతుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

**అంతరాయం లేని కరెంటు లేకుండ ఇవ్వాలి : ఈదయ్య**

వర్ష కాలం పెట్టాల్సిన నాట్లు ఇప్పటివరకు కూడా మొదలు పెట్టకపోవడం వర్షా ప్రభావం ఒక కారణమైతే త్రీపేస్ కరెంటు లేకపోవడం మరో కారణం, ప్రతిరోజు ఒకటి రెండు సార్లు తీయాల్సిన కరెంటుకు 10 నుంచి 15 సార్లు అంతరాయం కలగడంతో బోర్లు పోయడం లేదని అంతరాయం లేని కరెంటు ఇస్తే కొంతవరకైనా వ్యవసాయం చేసే అవకాశం ఉంటుందనిడ రైతు అలుగునూరు ఈదయ్య వ్యవసాయ కోరారు.



# పిల్లలు లేని అంగన్‌వాడీకి... విధులు నిర్వహిస్తున్న టీచర్, ఆయాలు

### నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/చివ్వెంల :** పిల్లలు లేని అంగన్‌వాడీ కేంద్రానికి ఓ టీచర్, ఓ ఆయా నెలల తరబడి నుండి విధులు నిర్వహిస్తున్న సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని సేవాలాల్ గ్రామ పంచాయతీ ఆవాసమైన పందిబండ తండలో వెలుగుచూసింది. పిల్లలు లేకుండా ఉన్నా నెలల తరబడి నుండి ఐసిడిఎస్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

మండలంలోని సేవాలాల్ తండ గ్రామ పంచాయితీలోని ఆవాసమైన పందిబండ తండలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలంటూ ఎవరూ లేరు. కేవలం టీచర్, ఆయా మాత్రమే ఆ కేంద్రంలో నెలల తరబడి నుండి విధులు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడి టీచర్ గుగులోతు పద్మ మాత్రం 5గురు చిన్నారులు ఉన్నారని చెబుతున్నారు. గ్రామస్తులు కొందరు తమ తండలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు ఎవరూ లేరని టీచర్‌కు, ఆయాకు అధికారులు ఖాళీగా కూర్చోబెట్టి నెలనెలా జీతాలు ఇస్తున్నారంటూ విలేకరులకు సమాచారం అందించారు. దీంతో ఆ సెంటర్‌కు వెళ్లి పరిశీలించగా వారు చెప్పింది వాస్తవమని తేలింది. సెంటర్‌లో ఒక్క చిన్నారి కూడా లేకపోవడంతో టీచర్, ఆయా ఆ కేంద్రంలోని చెట్ల కింద కూర్చొని కాలక్షేపం చేస్తున్నారు. కేంద్రంలో పనిచేస్తున్న టీచర్ గుగులోతు పద్మను వివరాలు అడుగగా మొత్తం 5గురు చిన్నారులు ఉన్నారని ఇందులో మూడున్నర సంవత్సరాల వారు ఇద్దరు, మిగతా ముగ్గురు రెండున్నర సంవత్సరాల చిన్నారులు ఉన్నట్లు చెప్పడంతోపాటు హాజరు పట్టికను కూడా చూపించింది. ఈ హాజరు పట్టికను పరిశీలించగా ఈనెల 9వ తేదీ వరకే హాజరు వేసి ఉండడం గమనార్హం. ఈరోజు చిన్నారులు ఎవరూ రాలేదా అని అడిగితే రాలేదని చెప్పారు. తండ వాసులు అసలు పిల్లలే లేరని చెప్పిన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకవెళ్ళగా ఇందులో ముగ్గురిని వారి తల్లిదండ్రులు సూర్యాపేటలోని ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారని తిరిగి తమ అంగన్‌వాడికే వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఉన్న మరో ఇద్దరు ఏక్కడని అడుగగా ఈరోజు రాలేదని చెప్పడం జరిగింది. బాలింతలు ఎంత మంది ఉన్నారని అడుగగా ఒక్కరు





కూడా లేరని గర్భిణీ స్త్రీల గురించి అడిగితే ఒక్కరు ఉన్నట్లు తెలిపారు. ఈ గ్రామ పంచాయితీ పరిధిలో పందిబండతండతో పాటు బల్లు తండ కూడా ఉంది. మొత్తం 3 తండల్లో కలిపి దాదాపు 165 నివాసాలు ఉండగా 700 మంది జనాభా ఉంది. గతంలో సేవాలాల్ తండలో అంగన్‌వాడీ కేంద్రం మరొకటి ఉండగా అక్కడ పిల్లలు లేకపోవడంతో ఈ పందిబండతండ అంగన్‌వాడీ కేంద్రంలోని అధికారులు గతంలో విలీనం చేశారు. తండలో ఉన్న ప్రాథమిక పాఠశాలను కూడా పిల్లలు రాకపోవడంతో గత విద్యాసంవత్సరం అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇతర ప్రాంతానికి విద్యాశాఖ అధికారులు బదిలీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో అధికారులు పంపిన పౌష్టికాహార పొట్లాలు, పాలు, గుడ్లు, బియ్యంతోపాటు ఇతర కిరాణ సామాను నిల్వలు ఉన్నాయి. వీటిని ఎవరికి పంపిణీ చేస్తున్నారన్నది కూడా అంతుచిక్కడం లేదు.

**సిడిపిఒ వివరణ...** పందిబండ తండ అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలు లేని విషయమై చివ్వెంల ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీజను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని చెప్పారు. గిరిజన తండల్లో చిన్నారులకు అక్షర జ్ఞానం నేర్పడం, పౌష్టికాహారం అందించడం, గర్భిణీ, బాలింతల సంరక్షణతోపాటు పౌష్టికాహారం అందించడం, భ్రుణ హత్యలు, శిశు విక్రయాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం చిన్న చిన్న తండల్లో కూడా అంగన్‌వాడి కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్దేశ్యం మంచిదే అయినప్పటికి చిన్నారులు లేకపోవడం కేంద్రాన్ని కొనసాగించడం కష్టమేనన్నారు. ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకవెళ్ళి అక్కడ పనిచేస్తున్న టీచర్, ఆయాలను ఇతర కేంద్రంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ముగ్గురిపై ఫోక్సో కేసు నమోదు

**ప్రజాపక్షం/హాలియా:** మండలంలోని కుపాసిపల్లి గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికపై జరిపిన లైంగిక దాడి లో ముగ్గురు వ్యక్తులపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు హాలియా ఎస్‌ఐ బండి సాయి ప్రశాంత్ తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్‌ఐ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికపై ముగ్గురు యువకులు ఆదిమల్ల విజయ్,బండారు అఖిల్, పేర్ల రమణలు లైంగిక దాడి చేయడంతో పాటు అత్యాచారం నేరాలకు పాల్పడినట్లు చెప్పారు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు వైద్య పరీక్షలు,ప్రాథమిక దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు నిందితులపై న్యాయ సంహిత,పోక్సో యాక్ట్ 2012 చట్టాల ప్రకారం వీరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.బాధిత బాలికకు భరోసా సెంటర్ లో వైద్య మానసిక న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కేసులో శాస్త్రీయ ఆధారాలు సేకరిస్తూ నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

## 100శాతం ఇకెవైసి పూర్తి చేయించాలి

**జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు**

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రేషన్ కార్డులో నమోదైన ప్రతి సభ్యుడు 100 శాతం ఇకెవైసి పూర్తి చేయించుకోవాలని రేషన్ డీలర్లకు జిల్లా పౌర సరఫరాల అధికారి వి. మోహన్ బాబు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ శాఖ జిల్లా కార్యాలయంలో డీలర్లకు ఇకెవైసిపై అవగాహన కల్పించారు. ఇకెవైసి పూర్తి చేయని సభ్యులకు భవిష్యత్తులో రేషన్ సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. అలాగే సంబంధిత రేషన్ డీలర్ల కమీషన్ చెల్లింపులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల రేషన్ కార్డులో ఉన్న ప్రతి సభ్యుడు రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా, తమకు సమీపంలోని ఏ చౌకధరల దుకాణంలోనైనా వెళ్లి తప్పనిసరిగా ఇకెవైసి నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సివిల్ సప్లైస్ అధికారులు ఎం. శ్రీనివాస్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, ఆర్.ఎస్. శ్రీకాంత్ రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే భూముల రీ సర్వే

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం) :** రైతుల దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికే భూముల రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన శాలిగౌరారం మండలం,వద్దిపాముల గ్రామంలో భూ రీ సర్వే పైఏర్పాటు చేసిన గ్రామసభకు హాజరయ్యారు.గ్రామంలో కొంతమంది రైతులు బాటలు,దారుల సమస్య,పట్టాలు లేకపోవడం భూమి ఉన్న కబ్జాలో లేకపోవడం వంటి సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు భూములకు సంబంధించిన రికార్డులను అప్డేట్ చేస్తూ వస్తున్నప్పటికీ నక్ష,టీపన్ వంటి వాటిలో మార్పులు లేకపోవడం, అలాగే కాగితాలపై ఉన్నవారు క్షేత్రస్థాయిలో వారి భూములు తెలియకపోవడం,మోకాపై ఉన్నప్పటికీ సమస్యల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాలను ప్రభుత్వం గుర్తించి అలాంటి సమస్యలను పరిష్కరించేందుకు భూముల రీ సర్వ్ చేయిస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ వై.అశోక్ రెడ్డి, తహసీల్దార్ మాధవరావు,సర్పంచు సురేందర్ రెడ్డి ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి.శంకర్ రెడ్డి, ఎంపీడీవో రజిత, తదితరులు ఉన్నారు.

**కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ**

విద్యార్థులకు మంచి విద్యను అందించడంతోపాటు,వారు ఆరోగ్యంగా ఉండేలా వ్యక్తిగత పరిశుభ్రత,పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు.శుక్రవారం అయనమండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల ఆవరణలో సివిల్ పనులు జరుగుతుండగా అన్నింటి పై ఆరా తీశారు. నీటి సంపు,సెప్టిక్ ట్యాంకు,అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థినిలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా ప్రభుత్వం సరఫరా చేసిన పాఠశాల యూనిఫామ్ కొలతలు సరిగా లేనందువల్ల ఎక్కువ మంది విద్యార్థినిలు వాటిని ధరించడం లేదని తెలుసుకొని తక్షణమే ఏపీఎం ను అక్కడికి పిలిపించి యూనిఫాం సరఫరా చేసిన టైలర్ ను పాఠశాలలోనే రెండు,మూడు రోజులు ఉంచి విద్యార్థినిల కొలతలు తీసుకొని అక్కడికక్కడే యూనిఫామ్ కుట్టించి ఇవ్వాలని ఆదేశించారు.

## రీ-సర్వే ద్వారా భూముల హద్దులు గుర్తింపు

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు భూ రికార్డులు ఆధునికీకరణ చెందుతాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. భూముల రీసర్వే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా అడవి దేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం, దామరచర్ల మండలం నర్సాపురం, మిర్యాలగూడ మండలం కిష్టాపురం, వేములపల్లి మండలం తిమ్మారెడ్డిగూడెం, మాడుగులపల్లి మండలం గండ్రవానిగూడెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, ఆర్డీవో రమణారెడ్డి పాల్గొని భూముల రీసర్వే ప్రక్రియ, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. రీసర్వే ద్వారా భూముల హద్దులు స్పష్టంగా నిర్ణయించబడతాయని, భూ యాజమాన్యానికి సంబంధించిన వివాదాలు తగ్గిపోతాయని తెలిపారు. రైతులు, భూ యజమానులు అధికారులు నిర్వహించే సర్వేకు సహకరించి అవసరమైన పత్రాలను సమర్పించాలని కోరారు. భవిష్యత్ తరాలకు వివాదరహిత భూ రికార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.

## 10వేల మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలో 10 వేల మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందించి స్వయం ఉపాధి కల్పిస్తామని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మండలంలోని బాలెంల గ్రామంలో మదర్ ఇండియా సేవా సంస్థ ఆధ్వర్యంలో 150 మంది మహిళలకు నిర్వహించిన కుట్టు శిక్షణ సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. సంస్థ చేస్తున్న కృషిని అభినందిస్తూ రూ.90వేల చెక్కును సంస్థ నిర్వాహకురాలు బొజ్జ సంధ్యారెడ్డికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత రెండు దశాబ్ధాలుగా స్ప్రెడ్ ఇండియా సంస్థ ద్వారా సూర్యాపేట నియోజక వర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. గ్రామాల్లో తాగునీటి ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, బెంచీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు వంటి మౌలిక వసతుల కల్పనకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. అదే విధంగా సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని ప్రతి వార్డులో కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి 10 వేల మంది మహిళలకు ఉచితంగా శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, కౌన్సిలర్లు జ్యోతి కరుణాకర్, నామ అరుణ, బైరబోయిన శ్రీనివాస్, మేగ్య తండ సర్పంచ్ భూక్య రాజు నాయక్, పిల్లల రమేష్ నాయుడు, పాలగాని కృష్ణ, కోడి శిరీష, బాలెంల సర్పంచ్ మమత నగేష్, నాయకులు వల్దాసు దేవేందర్, ధర్మానాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జిల్లాల్లో సెర్ప్, ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ సిబ్బందికి శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉచిత ఆరోగ్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిభిరంలో పాల్గొన్న సిబ్బందికి కార్డియాలజి, గైనకాలజి, జనరల్ ఫిజిషియన్ రక్తపోటు, షుగర్, ఈసిజి, సిబిపి, లిపిడ్ ప్రొఫైల్, కొలెస్ట్రాల్, క్యాల్షియం, నేత్ర వైద్య పరీక్షలు చేశారు. ఎరికాన్ టిపిఏ హెల్త్ ఇన్సూరెన్స్ అనుసంధానంతో యశోద హాస్పిటల్స్, మ్యాక్స్ విజన్, పాత్‌కైండ్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ ఉచిత ఆరోగ్య శిభిరంలో మొత్తం 229 మంది సిబ్బంది పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, డాక్టర్లు శ్వేత, సందీప్, తరిషక్, ఉమాదేవి, మెడికల్ సిబ్బంది సంతు దుర్గ, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్, డిపిఎంలు, ఏపిఎంలు, సిసిలు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, మండల సమాఖ్య సిబ్బంది, సెర్ప్, ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు

### ముగ్గురు నిందితులు అరెస్టు...ఒకరు పరారీ

### డిఎస్‌పి శ్రీనివాసరావు వెల్లడి




**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండలో సంచలనం సృష్టించిన బస్టాండ్ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకొని బ్లేడ్లతో బ్యాగులు, కవర్లు కోసి నగదు దోచుకునే అంతరాష్ట్ర దొంగల ముఠాను దేవరకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈసందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల ఒకటవ తేదిన దేవరకొండలోని కొత్త బస్టాండ్‌లో మండల లక్ష్మమ్మ అనే మహిళ చేతిలో ఉన్న కవర్‌ను బ్లేడ్‌తో కోసి రూ. 2లక్షల నగదును దుండగులు అపహరించారని బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కొత్త బస్టాండ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా చీరాల ప్రాంతానికి చెందిన అన్నారెడ్డి ఈశ్వరి, కావడి అంజమ్మ, ఆటో డ్రైవర్ కటారి రవి చందర్‌లుగా గుర్తించారు. మరో నిందితుడు అన్నారెడ్డి మధు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో అన్నారెడ్డి ఈశ్వరి, కావడి అంజమ్మలపై 40కేసులు ఉన్నట్లు గుర్తించారు. వీరంతా 2015 నుండి తెలుగు రాష్ట్రాలలోని పలు బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీని లక్ష్యంగా చేసుకొని బ్లేడ్లతో బ్యాగులు కట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తెలింది. నిందితుల నుండి దొంగతనాలకు ఉపయోగించిన ఏపి39యూవి6724 పసుపు రంగు ఆటో, మూడు స్మార్ట్ ఫోన్లు, రూ. 12 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగవంతంగా ఛేధించిన సిఐ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐలు రాజు, నారాయణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిని డిఎస్పి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

## రికార్డులను పరిశీలించిన జెడ్‌పి సిఇఒ

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :**మండలంలోని దోరకుంట గ్రామ పంచాయితీలో జడ్‌పి సిఈఓ శిరీష గ్రామ పంచాయితీ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికకు సంబంధించిన వివిధ శాఖల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐఆర్‌పై బిఎల్‌ఓలను ఆన్‌లైన్ వివరాలను సరైన వివరాలతో చేయాలని సూచించారు. గ్రామ పంచాయితీ నర్సరీ పరిశీలించి వన మహోత్సవంలో ప్లాంటేషన్, చెరువు గట్టుపై చెట్లను నాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఇస్సాకుహుస్సేన్, గ్రామ సర్పంచ్ పాలకి సురేష్, ఎంపిఓ రాంబాబు, ఏపిఓ టానియ, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, బిఎల్‌ఓలు కృష్ణవేణి, అరుణ, ఆదిలక్ష్మి , ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్, సైదులు, బాలకృష్ణ పాల్గొన్నారు.





Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com